


తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

16-4-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 74 పేజీలు: 10+4 వెల: 6.50



వీసాల రద్దుపై కోర్టును ఆశ్రయించిన విద్యార్థులు 5

భూ భారతి నిబంధనలు విడుదల 7




## దేశమంతటా 'నైరుతి'!


**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:** ఈ ఏడాది వర్షాలు విస్తారంగా కురుస్తాయని భారత వాతావరణశాఖ ప్రకటించింది. నైరుతి రుతుపవనాల సీజన్‌లో వర్షాలు విస్తారంగా కురుస్తాయని చెప్పింది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణం కంటే ఎక్కువగానే వర్షాపాతం నమోదవుతుందని మంగళవారం అంచనా వేసింది. మొత్తం సీజన్‌లో ఎల్ నినో పరిస్థితుల అవకాశాన్ని తోసి పుచ్చింది. నాలుగు నెలల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. మొత్తం దీర్ఘకాల సగటు వర్షాపాతం 105శాతంగా ఉంటుందని ఐఎండీ చీఫ్ మృత్యుంజయ్ మోహపాత్ర వెల్లడించారు. న్యూఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశంలో 1971-2020 మధ్యకాలంలో >>2

**విస్తారంగా వర్షాలు!**

**జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం**

**వాతావరణ శాఖ వెల్లడి**

**ఈ అప్‌డేట్‌తో రైతులకు ఎంతో ఉపశమనం**



### ప్రతి పదిమందిలో ఒకరికి

## కిడ్నీలో రాళ్లు!

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:** మారుతునకాలమాన పరిస్థితులు, ఆరోగ్య జీవనశైలిలో మార్పులు వంవాటి వాటితో తరచూ కిడ్నీల్లో రాళ్ల సమస్యలు సర్వసాధారణంగా మారాయి. గాలి, నేల లో ఉండే కోబాల్ట్, క్రోమియంల కారణంగా >>2



మంగళవారం హైదరాబాద్‌లో స్త్రీ సమ్మిట్ 2.0లో అవార్డులు అందజేస్తున్న డి.సిఎం భట్టి

### మహిళల అభ్యున్నతికి

## సర్కార్ పెద్దపీట

**కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే మా ధ్యేయం: డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క వెల్లడి**

**హైదరాబాద్‌లో ఘనంగా స్త్రీ సమ్మిట్ 2.0**

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మహిళల అభివృద్దికి తమ ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే తమ ధ్యేయమని ఆయన తెలిపారు. నగరంలోని తాజ్ డెక్కన్‌లో మంగళవారం జరిగిన స్త్రీ సమ్మిట్ 2.0ను భట్టి విక్రమార్క జ్యోతి వెలిగించి ప్రారంభించారు. హైదరాబాద్ సిటీ పోలీసు విభాగం, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్తంగా నిర్వహించిన ఈ >>2

### పార్టీ గీత దాటితే

# ఊరుకునేది లేదు

**మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్..**

**ఇప్పుడు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కూడా రంగంలోకి దిగారు..**

**సన్న బియ్యం పథకం ఒక అద్భుతం, ప్రభుత్వానికి మంచి పేరు వచ్చింది**

**మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రజల్లోకి వెళ్లాలి.. ప్రతిగ్రామంలో పర్యటించాలి**

**నియోజకవర్గాల్లో ప్రభావితం చేసే పనులు తీసుకురండి.. దగ్గరుండి నేనే చేయిస్తా**

**మే 1 నుంచి జూన్ 2 వరకు ప్రజల్లోకి వెళ్లేందుకు సమయం ఇస్తా..**

**సిఎల్పీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్.ఏప్రిల్15:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత పార్టీ ఎమ్మెల్యేలకు హెచ్చరిక జారీ చేశారు. పార్టీ గీత దాటితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. శంషాబాద్ నోవాటెల్ హోటల్‌లో జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్షం(సీఎల్పీ) సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పార్టీకి ఇబ్బంది కలిగించాలని ఎవరైనా చూస్తే వారే ఇబ్బంది పడతారని అన్నారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ అని గుర్తించాలని హితవు పలికారు. మంత్రి వర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అని అన్నారు. ఈ విషయంలో ఎవరేమి మాట్లాడినా ఉపయోగం ఉండదని స్పష్టం చేశారు. నిన్న మొన్నటి వరకు మనపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ విమర్శలు చేసేవారని, ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా రంగంలోకి దిగారని అన్నారు. తెలంగాణ పథకాలతో >>2



సిఎల్పీ భేటీలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

**జపాన్ పర్యటనకు వెళ్లిన**

## సిఎం రేవంత్

**శ్రీధర్‌బాబుతో పాటు అధికారుల బృందం పయనం**

**టోక్యో, మౌంట్‌ఫుజి, ఒసాకా, హిరోషిమాలో పర్యటన** 7



నేషనల్ హెరాల్డ్ కేసు:

### ఇడి ఛార్జిషీటులో సోనియా, రాహుల్ పేర్లు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:** నేషనల్ హెరాల్డ్ మనీ లాండరింగ్ కేసులో కాంగ్రెస్ ఎంపీలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, పార్టీ విదేశీ విభాగం చీఫ్ సామ్ పిట్రోడాపై మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చార్జిషీట్ దాఖలు చేసింది. ప్రత్యేక కోర్టు ఏప్రిల్ 25ను విచారణ తేదీగా నిర్ణయించింది. ప్రస్తుత ప్రాసిక్యూషన్ ఫిర్యాదును తదుపరి విచారణకు తీసుకుంటారు, అభియోగం ఆధారంగా.. కక్షిదారుల తరపు ప్రత్యేక న్యాయవాది మరియు దర్యాప్తు అధికారి కూడా కేసు డైరీలను కోర్టు పరిశీలన కోసం సమర్పించేలా చూసుకోవాలి అని ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే అన్నారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై చార్జిషీట్ దాఖలు చేయడం ఇదే మొదటిసారి. శనివారం ఈడీ రూ.661 కోట్ల విలువైన స్థిరాస్తుల స్వాధీనం కోసం నోటీసులు జారీ చేసింది. వీటిని నవంబర్ 2023లో కాంగ్రెస్ నియంత్రణలో ఉన్న అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ లేదా ఎజెఎల్ ఈడీ మనీలాండరింగ్ ఆరోపణలపై దర్యాప్తుకు జత చేసింది.ఆ ప్రాంగణాన్ని ఖాళీ >>2

### భూముల అమ్మకంలో

## బిఆర్ఎస్‌తో కాంగ్రెస్ పోటీ

**ప్రభుత్వాన్ని కూల్చాల్సిన అవసరం మాకేంటి?**

**అప్పుల్లో తెలంగాణ నంబర్ వన్**

**ఈనెలలో బిజెపి అధ్యక్షుడి ప్రకటన ఉంటుంది**

**మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలి**

**మీడియాతో చిట్‌చాట్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**



మంగళవారం హైదరాబాద్‌లో మీడియాతో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** తాము రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని పడగొట్టబోమని, వచ్చే ఎన్నికల్లో పోటీ చేసి రాష్ట్రంలో ఒంటరిగానే అధికారంలోకి వస్తామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వానికి ఐదేళ్ల సమయం ఉందన్నారు. ప్రభుత్వాన్ని కూల గొట్ట డానికి గుజరాత్ వ్యాపారులకు పనిలేదా? వ్యాపారులు వాళ్ళ వ్యాపారాలు వాళ్ళు చేసుకుంటున్నారని అన్నారు. ప్రజల ఆలోచనకు అనుగుణంగా పార్టీ సానుకులమైన నిర్ణయం తీసుకుంటుందన్నారు. ప్రజలు అనుకుంటే ఖచ్చితంగా బిజెపిని గెలిపిస్తారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తమిళనాడులో ఎన్‌డిఏకు నష్టం జరిగింది కాబట్టి పొత్తులతో బలోపేతం చేస్తున్నామన్నారు. తెలంగాణలో ఇప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ ఘోరంగా ఓడిపోతుందన్నారు. రేవంత్‌రెడ్డి భూముల అమ్మకం, లిక్కర్ సేల్స్, అప్పులు తేవడంలో తెలంగాణను నంబర్‌వన్‌గా మార్చారని విమర్శించారు. నక్సలైట్ల సమస్యలను పరిష్కరిస్తాం వారు బయటకు రావాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారన్నారు. నక్సల్స్ జనజీవన స్రవంతిలో కలవాలని విజ్ఞప్తి చేశారని అన్నారు. వారు జనజీవన స్రవంతిలో కలవాలన్నారు. భూములు అమ్మకం, మద్యం అమ్మకం,అప్పుల ద్వారానే తెలంగాణ అభివృద్ధి చేస్తున్నారు. గతంలో కెసిఆర్ చేసిందు,ఇప్పుడు కాంగ్రెస్ చేస్తుందన్నారు. హెచ్‌సియులో అర్ధరాత్రి ఫ్లడ్ లైట్లు పెట్టి చెట్లు నరికిన సందర్భం దేశంలో ఎక్కడ లేదన్నారు. హెచ్‌సియులో వన్య ప్రాణులు జింకలు, నెమళ్లు ఉన్నది వాస్తవమే తాను ఈ మాటలకు కట్టుబడి ఉన్నానన్నారు. హెచ్‌సియు భూమికి సంబంధించి మాకు పూర్తిగా కొలిచి ఇవ్వలేదని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు అంటున్నారన్నారు. వాజ్‌పేయ్ హాయంలో వృధాగా ఉన్న భూములను అమ్మాలని చూశారు, భావితరాల కోసం గ్రీనరీని కాపాడుకోవాలన్నారు. హైదరాబాద్ అభివృద్ధి జరగాలని నేను ఎప్పుడు కోరుకుంటానని అన్నారు. రాజకీయంగానే కాంగ్రెస్ నాయకులు నాపై విమర్శలు చేస్తున్నారన్నారు. సింగరేణి కార్మికులు కట్టిన టాక్స్‌ను పూర్తిగా రియంబర్స్‌మెంట్ కేంద్ర ప్రభుత్వం చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో 83కోట్ల మందికి ఐదు కేజీల సన్న బియ్యం ఇస్తుందన్నారు. దమ్ముంటే రేవంత్ రెడ్డి కేంద్రం ఇస్తున్న ఐదు కేజీలు కాకుండా ఇవ్వాలన్నారు. రాష్ట్రాల పరిస్థితుల కారణంగా >>2





ఫోన్ ట్యాపింగ్ కేసు:

### బెయిల్ ఇస్తే వారంలో భారత్‌కు!

**డిఫెన్స్ న్యాయవాది వెల్లడి**

**పాస్‌పోర్టు రద్దయితే ఎలా వస్తారని పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రశ్న**

**ప్రభాకర్ రావు ముందస్తు బెయిల్‌పై హైకోర్టులో వాదనలు**

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మొదటి ముద్దాయిగా వున్న ఎస్ఐబి మాజీ బాస్ ప్రభాకర్ రావు ముందస్తు బెయిల్‌పై హైకోర్టులో మంగళవారం వాడివేడిగా వాదనలు కొనసాగాయి. ప్రభాకర్‌రావు తరపున వాదించిన డిఫెన్స్ న్యాయవాది తన క్లయింట్ ఈ కేసులో నిర్దోషిగావున్నా నిందితుడుగా చేర్చారని తెలిపారు. ప్రభాకర్ రావుకు ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో ఎలాంటి సంబంధం లేదని, అయినా కావాలని నిందితుడుగా చేర్చి వేధిస్తున్నారని ఆయన వాదించారు. ఈ క్రమంలో తన క్లయింట్ దాఖలు చేసిన >>2

## కాంగ్రెస్ పార్టీలో నా స్థానం ఏంటి?

**పదేళ్లు ఒంటరి పోరాటం చేసినా..**



**నాకన్నా నాలుగేళ్ల తర్వాత జానారెడ్డి పార్టీలో చేరారు..**

**పార్టీ కోసం ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా..**

**మాజీ మంత్రి జీవన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు**

**జగిత్యాల బ్యూరో ప్రభాతవార్త:** నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసిన, బీఆర్ఎస్ హయాంలో 10 ఏళ్ళు ఒంటరి పోరాటం చేసిన ఇప్పుడు పార్టీలో నా స్థానం, నా సీనియారిటి ఏంటి అనీ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇంద్రభవాన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం >>2




**రాష్ట్రాలు వక్ఫ్‌చట్టం అమలుచేయబోమని**

## చెప్పేవీలులేదు..

**కొత్త చట్టం అమలుపై బిజెపి నేతలు**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:** వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలు చేయడాన్ని రాష్ట్రాలు నిరాకరించలేవని బీజేపీ స్పష్టం చేసింది. వక్ఫ్ సవరణ చట్టంపై ఇండియా కూటమి పార్టీల వైఖరి తీవ్రమైన ఆందోళన కలిగించే విషయంగా అభివర్ణించింది. ఆ పార్టీలు అధికారంలో కొనసాగితే రాజ్యాంగం ప్రమాదంలో పడుతుందని విమర్శించింది. వక్ఫ్ సవరణ చట్టాన్ని తమ రాష్ట్రాల్లో అమలు చేయబోమని పలు విపక్ష పాలిత రాష్ట్రాలు ప్రకటించిన నేపథ్యంలో బీజేపీ ఈ వ్యాఖ్యలు చేసింది. తమకు షరియా చట్టమే మొదట వచ్చిందని, ఆ తర్వాతే రాజ్యాంగమని ఝార్ఖండ్ ముక్తి మోర్చా నాయకుడు, రాష్ట్ర మంత్రి హాఫీజుల్ హసన్ వ్యాఖ్యానించారు. కర్ణాటక మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తమ రాష్ట్రాల్లో వక్ఫ్ చట్టాన్ని అమలు చేయమని ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ క్రమంలో వక్ఫ్ చట్టాన్ని నిరంతరం వ్యతిరేకిస్తున్న కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీలపై కమలం పార్టీ విమర్శలు గుప్పించింది. వక్ఫ్ చట్టంపై విపక్ష పార్టీ నేతల వ్యాఖ్యలు రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించడమేనని బీజేపీ జాతీయ ప్రతినిధి సుధాన్షు త్రివేది అభిప్రాయపడ్డారు. "73, 74వ రాజ్యాంగ సవరణల తర్వాత కేంద్రం, రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రభుత్వాల అధికారాలు స్పష్టంగా తెలిశాయి. రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన చట్టాన్ని ఏ జిల్లా పంచాయతీ ఆపలేదు. కేంద్రం (పార్లమెంట్) ఆమోదించిన చట్టాన్ని >>2

**ధాన్యం రాకతో పౌరసఫరాల శాఖ అధికారులలో అనిశ్చితి**

**ఆరువేలకు పైగా కొనుగోలు కేంద్రాల్లో ఊపందుకున్న ధాన్యం క్రయవిక్రయాలు**

**మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ**



### బ్యాంకు పూచికత్తు ఎగవేతకు

## మిల్లర్ల పైరవీలు

**రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ మిల్లులు 916**

**హైదరాబాద్, ఏప్రిల్ 15,ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగా ధాన్యం సేకరణ మొదలైనా తెలంగాణ వ్యాప్తంగా రైస్ మిల్లల నుంచి ప్రభుత్వం కోరిన బ్యాంకు గ్యారెంటి మాత్రం ఇంకా రాలేదు. ఖరీఫ్ సీజన్‌లో కూడా పూచికత్తు రాకపోవడంతో కొనుగోళ్ళు ఆలస్యమైనాయి. కొనుగోలు కేంద్రాలు తెరవడం జాప్యం అవడంతో కొందరు రైతులు దళారులకు విక్రయించుకొని ఆర్థికంగా నష్టపోయారు. రైస్‌మిల్లర్లు పౌరసరఫరాల శాఖ అధికారులకు స్థానిక ప్రజాప్రతినిధులతో ఫోన్లు చేయించి ధాన్యం కేటాయింపులకోసం ఒత్తిడి పెంచుతున్నట్లు తెలిసింది. పౌరసఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో బ్యాంకు గ్యారెంటీ అనే ఒక విధానపరమైన నిర్ణయం తీసుకోవడంతోవారి ఆదేశాలమేరకు మాత్రమే క్షేత్రస్థాయిలో తాముఆచరిస్తున్నామని ఇందులో ఎవరికి మినహాయింపుల లేదని చెప్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సిఎంఆర్ అక్రమాల కట్టడికి పూనుకొంది. గతంలో సిఎంఆర్ ధాన్యం పౌరసరఫరాల కార్పొరేషన్ ఏలాంటి బ్యాంకు గ్యారంటీ లేకుండా కేటాయించేది. మిల్లర్లు సకాలంలో బియ్యం అప్పగించక పోవడం, అవకతవకలకు పాల్పడటం దివాళా తీయడం, రీసైకిలింగ్ చేసి రేషన్ బియ్యం >>2



జమ్మూలో జరిగే అమర్‌నాథ్ యాత్ర 2025 కోసం నమోదు చేసుకోవడానికి క్యూలో వేచి ఉన్న యాత్రికులు.

## ఎగవేతకు మిల్లర్ల పైరవీలు

>> ఇవ్వడం వంటి తప్పుడు విధానాలు పాల్పడుతుండటంతో వీటిని కట్టడి చేయాలని ప్రభుత్వం బ్యాంకు గ్యారెంటీ అనే విధానం తీసుకొచ్చింది. సిఎంఆర్ ధాన్యం ఇచ్చేందుకు ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన బ్యాంకు గ్యారెంటీ విధానం కూడా మిల్లర్లు పెద్దగా లెక్కచేయడంలేదు. సిఎంఆర్ ఎగవేసేందుకు అవకాశం కోసం వేచిచూస్తున్న కొందరు మిల్లర్లు గ్యారెంటీ చెల్లించకుండా కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులతోనే పౌరసరఫరాలశాఖ,లేదా కార్పొరేషన్ అధికారులకు ఫోన్లు చేయిస్తున్నారు. పౌరసరఫరాలశాఖ అధికారులు ఫోన్ చేసిన నాయకులకు కొత్త విధానాలను వర్తింపజేయకుండా వినిపిస్తూ ధాన్యం కేటాయించలేమని అశక్తత వ్యక్తంచేస్తున్నారు. బకాయి దారులపై వేటు వేసేందుకు గత వానాకాలంలో మంత్రి మండలి ఉపసంఘం ఆధ్వర్యంలో నూతన పాలసీతీసుకొచ్చారని పైరవీకారులకు చెబుతున్నారు. బకాయిలేకుండా సిఎంఆర్ సక్రమంగా ఇచ్చేవారి వద్దనుంచి 10శాతం బ్యాంకు పూచీకత్తు తీసుకుంటున్నామని పైరవీ కోసం ఫోన్ చేసిన నాయకులకు సివిల్‌సప్లయ్ కార్పొరేషన్ అధికారులు వివరిస్తున్నారు. డిఫాల్ట్ అయి బకాయి తీర్చేసిన మిల్లు యజమానుల నుంచి 20శాతం బ్యాంకుగ్యారెంటీ తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. బకాయిలు తీర్చని జరిమానా చెల్లించని మిల్లు యజమానుల నుంచి 25శాతం బ్యాంకు గ్యారెంటీ వసూలు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా పూచికత్తు బకాయిలు పెండింగ్‌లో ఉన్న మిల్లులు 916 ఉన్నాయి. అలాగే రాష్ట్రంలో 1321 మిల్లులు పెండింగ్‌లేని మిల్లులు అని లెక్కగట్టారు. ఒక్క కరీంనగర్‌లోనే 113 మంది మిల్లు పెండింగ్‌లేని మిల్లులుగా గుర్తించారు.మరో ఏడుగురిని కలిపి వారికి పదిశాతం బ్యాంకు గ్యారెంటీ ఇస్తే ధాన్యం కేటాయిస్తామని అధికారులు తెలిపారు. అయితే 53 మంది మాత్రమే ఇప్పటి వరకు ఇచ్చినట్లు తెలిసింది. నల్లగొండలో 69 మంది మిల్లర్లు 10శాతం బ్యాంకు గ్యారెంటీ ఇచ్చారు. కరీంనగర్ జిల్లాలో 10 మిల్లులు మాత్రమే జరిమానాతో సిఎంఆర్ ఇవ్వగా 27 మిల్లులు జరిమానా చెల్లించలేదు కానీ సిఎంఆర్‌ను తిరిగిచ్చారు.మూడు మిల్లులు ధాన్యం తీసుకొని ఎగ్గొట్టినాయి.సాఫీగా ధాన్యం తీసుకొని ఇబ్బంది లేకుండా ఇచ్చే మిల్లులు 120వరకు కరీంనగర్ జిల్లాకు చెందినవి పౌరసరఫరాలశాఖ అధికారులు గుర్తించారు. వారి నుంచి బ్యాంక్ గ్యారెంటీలు కావాలని కోరితే ఇప్పటి వరకు 50 మంది మాత్రమే ఇచ్చారు ఇంకా 70 మంది ఇవ్వలేదు. రాష్ట్రవ్యాప్తంగా 83శాతం మిల్లు యజమానులు బ్యాంకు గ్యారెంటీ ఇవ్వకపోవడంతో ప్రభుత్వ కొత్త విధానం విఫలమైంది.దీనితో ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పెనుశాపంగా మారింది. ప్రభుత్వం బ్యాంకు గ్యారెంటీ నూతన పాలసీ అమలు చేసే క్రమంలో కొనుగోలు కేంద్రాలు వానాకాలం ఆలస్యంగా ప్రారంభించారు. దీనితో రైతులు దళారులకు విక్రయించారు. గ్రేడ్-1కు క్వింటాల్‌కు రూ. 2320 సాధారణకు క్వింటాల్‌కు 2300 రూపాయలు మద్దతు ధర ఉన్నా రైతులు క్వింటాల్‌కు 1700కు విక్రయించుకొన్నారు. దీనితో ఎంఎస్‌పి కోల్పోయి బోనస్ కోల్పోయి రైతులు దగాపడ్డారు.కరీంనగర్ జిల్లాలో 153 మిల్లుల్లో ఉన్న ధాన్యం విక్రయించగా ఇప్పటికి 97 మిల్లులో 96,340 మె.ట ధాన్యం కొనుగోలుదారులకు అప్పగించలేదు. సూర్యాపేట జిల్లాలో 19 మిల్లులలో ధాన్యమే లేదు. ఆరు మిల్లులపై రెవెన్యూ రికవరి చట్టం కింద కేసులు నమోదు చేశారు 13మిల్లులకు 25శాతం జరిమానాతో చెల్లించాలని నోటీసులు జారీచేశారు. నల్లగొండ జిల్లాలో 12 మిల్లులు యాదాద్రి జిల్లాలో 6మిల్లుల్లో ధాన్యమే మాయమైంది. మంథని లోని ఒక మిల్లుపై విజిలెన్స్ దాడులు చేయగా అక్కడ ధాన్యంలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఆరువేల కొనుగోలు కేంద్రాలలో వరిధాన్యం కొనుగోళ్లు ఊపందుకొన్నా ఇంకా కస్టమ్ మిల్లింగ్ తీసుకొనే మిల్లర్ల నుంచి మాత్రం బ్యాంకు పూచికత్తు విషయంలో స్పందన రావడంలేదు. అధికారులు పైరవీకారులకు సమాధానం చెప్పలేక అనేక ఇబ్బందులు పడుతూన్నరు. తెలంగాణలో ఇప్పటికే మూడలక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సేకరించారు. ధాన్యం రాకతో వాటిని మిల్లుపాయింట్‌కు పంపాలా లేక గోదాములకు తరలించాలా అనే మీమాంసలో అధికారులు ఉన్నారు.

## బిఆర్‌ఎస్‌తో కాంగ్రెస్ పోటీ

>> కేంద్ర ప్రభుత్వం అప్పులు చేస్తుందన్నారు. కామారెడ్డిలో రేవంత్ రెడ్డిని ఓడించాం, ఆయన సొంత జిల్లాలో బిజెపి ఎంపిని గెలిపించుకున్నాం అన్నారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత 45లక్షల సభ్యత్వాలు చేశామన్నారు. చాలామంది కొత్త కార్యకర్తలు సభ్యత్వం తీసుకున్నారన్నారు. వాలందరికి ట్రైనింగ్ క్లాసెస్ పెడతామన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికకు తొందరేం లేదని అంటూనే ఈనెలలో రాష్ట్ర అధ్యక్షుడి ప్రకటన ఉంటుందని అన్నారు. తాను జాతీయ అధ్యక్షుడి రేసులో లేనని అన్నారు. తన బ్రాండ్ నేషనల్‌ఇజం (జాతీయవాదం) అని చెప్పారు. రేపంత్ రెడ్డి బ్రాండ్ ఏమిటో వచ్చే ఎన్నికల్లో తెలుస్తుందని అన్నారు. మజ్లిస్‌కు కాంగ్రెస్. బిఆర్‌ఎస్ అడుగులకు మడుగులు ఒత్తుతున్నాయని అన్నారు. ఆ రెండు పార్టీలకు అసదుద్దీన్ ఓవైసి బిగ్‌బాస్ అని చెప్పారు. నాయకుల అవసరాల కోసం తమపై నిందలు వేస్తున్నారని అన్నారు. తాము తెలంగాణలో ఒంటరిగానే అధికారంలోకి రాబోతున్నామని అన్నారు. ప్రస్తుతం ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాలపై ప్రధానంగా దృష్టి సారించామని అన్నారు. అక్కడ పార్టీని బలోపేతం చేస్తామని చెప్పారు. తనపై కేసులు పెడితే పెట్టుకోవాని, ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. వక్ఫ్ బోర్డుచట్ట సవరణ ద్వారా ఒక్కగజం, ఒక్కపైసా దుర్వినియోగం జరగదని అన్నారు. రాజాసింగ్ అంశంపై మాట్లాడుతూ ఆయన తమ పార్టీ సీనియర్ నాయకుడని, ఏమైనా సమస్యలుంటే ఇంటర్నల్‌గా పరిష్కరించుకుంటామని అన్నారు. దక్షిణాదికి లోక్‌సభ సీట్లు తగ్గుతాయనేది గాలి ప్రచారం మాత్రమేనని అన్నారు.

## అమలుచేయబోమని చెప్పేవీలులేదు..

>> ఏ రాష్ట్రం కూడా నిరాకరించకూడదు. వక్ఫ్ సవరణ చట్టంపై విపక్షాల వ్యాఖ్యలు రాజ్యాంగం పట్ల వారికి గౌరవం లేదని తెలియ జేస్తున్నాయి. వారు రాజ్యాంగాన్ని తమ జేబుల్లో ఉంచుకుంటారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్‌డీఏ రాజ్యాంగాన్నిగుండెల్లో ఉంచుకుం టుంది. ఇది రాజ్యాంగాన్ని జేబుల్లో, గుండెల్లో ఉంచుకునేవారికి మధ్య పోరాటం. కాంగ్రెస్ హయాంలోనే 73, 74వ సవరణలు ఆమోదం పొందాయి. వీటిని అప్పట్లో విప్లవాత్మకమైనవిగా అభివర్ణించారు. నేడు వారు తమ సొంత ప్రభుత్వం ఆమోదించిన సవరణలను వ్యతిరేకిస్తున్నారు." అని స్పష్టం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి వస్తే సవరించిన వక్ఫ్ చట్టాన్ని గంటలోపు రద్దు చేస్తామని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ చేసిన వ్యాఖ్యలను త్రివేది తీవ్రంగా ఖండించారు. అలాగే కర్ణాటక, ఝార్ఖండ్ మంత్రులు చేసిన వ్యాఖ్యలకుగానూ వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## కిడ్నీలో రాళ్లు!

>> మూత్రపిండాల్లో రాళ్ల ఏర్పడుతుంటాయని పరిశోధకులు కనిపెట్టారు. కిడ్నీలో రాళ్ల ఏర్పడటానికి చాలా నెలలు లేదా సంవత్సరాల సమయం పడుతుంది. అధిక ఆక్సలేట్ లేదా తక్కువ కాల్షియం ఉన్న ఆహారాన్ని తినడం వల్ల కూడా మూత్రపిండాల్లో రాళ్లు ఏర్ప డుతుంటాయని తెలిపారు. తాజాగా దిల్లీ ఎయిమ్స్ నిర్వహించిన పరిశోధనల్లో పలు ఆసక్తి కర అంశాలు బయటపడ్డాయి. కోబాల్ట్, క్రోమియంను అనేక ఉత్పత్తుల తయారీలో విని యోగిస్తారు. వాటి వల్లగాలి, నేల కలుషితమవుతాయి. క్రోమియం ఉనికి ఎక్కువగా ఉండే ప్రదేశాలలో నివసించే వారికి మూత్రపిండాల్లో రాళ్లు వచ్చే ముప్పు ఎక్కువగా ఉంటుంది. క్రోమియం ఉత్పత్తుల కారణంగా, మనిషి మూత్రపిండాలలో కాల్షియం ఆక్సలేట్ రాళ్లు ఏర్పడే ప్రమాదం ఉంటుందని దిల్లీ ఎయిమ్స్‌లో పరిశోధనలో గుర్తించారు. కిడ్నీలో రాళ్ల సమస్యకు భవిష్యత్తులో మరింత మెరుగైన చికిత్సా విధానాలను రూపొందించడానికి ఈ అధ్యయన నివేదిక దోహదపడుతుంది. గాలి, నేలలో కోబాల్ట్, క్రోమియం లాంటి కాలుష్య కారకాలు ఉన్న ప్రదేశాల కోసం ప్రత్యేక వ్యూహాలను రూపొందించడంలో ఈ రీసెర్చ్ రిపోర్ట్‌లోని సమాచారం సహాయపడుతుంది. ఇటీవలే దిల్లీ ఎయిమ్స్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పరిశోధకులు ఈ అధ్యయన నివేదికను విడుదల చేశారు. అధ్యయనంలో భాగంగా మూత్ర పిండాల్లో రాళ్లు ఉన్న పలువురు రోగుల నుంచి రక్తం, మూత్రం, కిడ్నీ రాళ్ల శాంపిల్స్‌ను సేకరించారు. కిడ్నీలోరాళ్లు కలిగిన వారి నుంచి ఈ మూడు రకాల సమాచారాన్ని ఏకకాలంలో సేకరించి రీసెర్చ్ చేయడం ఇదే తొలిసారి అని సైంటిస్టులు తెలిపారు. దీనివల్ల కిడ్నీలో రాళ్లు ఏర్పడటానికి దారితీసిన ప్రధాన కారకాన్ని గుర్తించే వీలుంటుందని పేర్కొన్నారు. ఈ పరిశోధనలో ఎయిమ్స్‌లోని యూరాలజీ విభాగం, అనాటమీ విభాగం, లేబొరేటరీ మెడిసిన్ విభాగం వైద్యులు పాల్గొన్నారు. రీసెర్చ్‌లో పాల్గొన్న దిల్లీ ఎయిమ్స్ పరిశోధకుల ప్రకారం, ప్రతి 10 మందిలో ఒకరు తమ జీవితకాలంలో మూత్రపిండాల్లో రాళ్ల సమస్యను ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. ఈ సమస్య 30 నుంచి 40 ఏళ్లలోపు వారిలో సర్వసాధారణంగా ఉండొచ్చు. మూత్రపిండాల్లో రాళ్లు వస్తే నడుము దిగువ భాగంలో, ఉదరంలో లేదా ఉదరంలోని ఒక వైపున నొప్పిగా అనిపిస్తుంది. మానవ మూత్రంలో ఖనిజాలు, ఆమ్లాలు, ఇతర పదార్థాలన్నీ కలిసి ఉంటాయి. ఇందులో క్యాల్షియం, సోడియం, ఆక్సలేట్, యూరిక్ యాసిడ్ ఉంటాయి. మనం నీళ్ల తాగినప్పుడు, అవి శరీరం నుంచి మూత్రం రూపంలో బయటకు వెళ్తాయి'అని సైంటిస్టులు వివరించారు. మనం తక్కువ నీరు తాగడం వల్ల కాల్షియం, సోడియం, ఆక్సలేట్, యూరిక్ యాసిడ్ వంటి పదార్థ కణాల మోతాదు మూత్రంలో పెరిగిపోతుంది. తగినంత ద్రవం లేకపోవడం వల్ల, ఆ కణాలన్నీ కలిసి అతుక్కోవడం ప్రారంభిస్తాయి. ఇలా అతుకున్న కణ భాగాలే కిడ్నీలలో రాళ్లుగా ఏర్పడతాయి.

### వారం - వర్జ్యం

తేది : 16-04-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
కృ.తదియ మ.1.16
అనూరాధ పూర్తి
వర్జ్యం ఉ.7.38-ఉ.9.25
దు.ఉ.11.43-మ.12.33
శుభసమయం : ఉ.9.30-10.10
రాహుకాలం - మ.12.00-1.30

### వార్తాఫలం

మేషం : అనుకున్న పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆర్థిక ఇబ్బందుల నుండి బయట పడతారు.

వృషభం:దీర్ఘకాలిక సమస్యలు తీరి ఊరట చెందుతారు. దూరప్రాంతాల నుండి శుభవార్తలు వింటారు.

మిథునం:ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు.

కర్కాటకం : వృత్తి, వ్యాపారాలు లాభ సాటిగా సాగుతాయి. బంధువులతో ఏర్పడిన విభేదాలు పరిష్కరించుకుంటారు.

సింహం:ప్రయాణాలలో ఆటంకాలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. ధనవ్యయం పెరుగుతుంది.

కన్య : ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం. ఋణవత్తిడులు ఎదురై చికాకులు పెడతాయి. వస్తు సేకరణ.

తుల : ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రముగా వుంటుంది. బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

వృశ్చికం: కుటుంబ సమస్యలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. వస్తువులు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు.

ధనుస్సు: వాక్చాతుర్యంతో ఎదుటవారిని ఆకట్టుకుంటారు. విలువైన ఆభరణాలు కొనుగోలు చేస్తారు.

మకరం: వృత్తి, వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఆర్థిక లావాదేవీలు ఆశా జనకంగా వుంటాయి.

కుంభం:ఊహించని ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. అనుకోని ఆహ్వానాలు.

మీనం : సన్నిహితులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో ప్రోత్సాహం లభిస్తుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన సిఎల్పీ భేటీలో పాల్గొన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

# గీత దాటితే ఊరుకునేది లేదు

>> మోదీ ప్రభుత్వం ఉక్కిరిబిక్కిరి అవుతోందని వ్యాఖ్యానించారు. ప్రజాప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని ముఖ్యమంత్రి రేవంత్ పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని కొన్ని సమస్యలకు తమ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందని సీఎం పేర్కొన్నారు. సన్నబియ్యం పథకం ఒక అద్భుతమని ఆనాడు రూ.2 కిలో బియ్యంలా ఇప్పుడు సన్నబియ్యం పథకం శాశ్వతంగా గుర్తుండే పథకమని సీఎం వివరించారు. భూ భారతిని రైతులకు చేరవేయాలన్నారు. దేశంలోనే ఇందిరమ్మ ఇండ్ల పథకం ఆదర్శంగా నిలిచిందని క్షేత్ర స్థాయిలో నిజమైన లబ్ధిదారులకే అందాలని, దీన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.కులగణన ద్వారా వందేళ్ల సమస్యను శాశ్వతంగా పకడ్బందీగా పరిష్కరించామన్న సీఎం విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బిల్లులు తీసుకొచ్చామని ఇది ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమని వెల్లడించారు. జటిలమైన ఎస్సీ ఉపకులాల వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామని అందుకే వర్గీకరణ జరిగే వరకు ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదని తెలిపారు. హెచ్‌సీయూ భూములపై ప్రతిపక్షం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో ఒక అబద్ధపు ప్రచారం చేసిందని,ఈ ప్రచారాన్ని ప్రధాని నరేంద్ర మోదీ కూడా నమ్మి బుల్డోజర్లు పంపిస్తున్నారని మాట్లాడు తున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. పార్టీ, ప్రభుత్వం ప్రతిష్ఠ పెరిగితేనే భవిష్యత్ ఉంటుందని మనం ఎంత మంచి చేసినా ప్రజల్లోకి తీసుకెళ్లకపోతే ప్రయోజనం ఉండదన్నారు. మళ్లీ గెలవాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలని పార్టీశ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వివరించారు. మీ నియోజకవర్గంలో ఏం కావాలో ఒక నివేదిక తయారు చేసుకోవాలని మంత్రులు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.ఆ పనులను పూర్తి చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. వర్గీకరణ మోదీకి గుదిబండగా మారిందని, కులగణన మోడీకి మరణశాసనం రాయబోతోందన్నారు. దేశంలో తెలంగాణ మోడల్‌పై చర్చ జరుగుతోందని తెలిపారు. అందుకే తెలంగాణలో కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టాలనే బీజేపీ, బీఆరెస్ ఒక్కటయ్యాయన్నారు. సన్న బియ్యం బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. సన్న బియ్యం మన పథకం మన పేటెంట్, మన బ్రాండ్ అని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. మనం తీసుకున్న గొప్ప నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే,ఎమ్మెల్సీ,ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. బుధవారం నుంచి జూన్ 2 వరకు ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో ప్రతీ గ్రామం పర్యటించేలా కార్యాచరణ తీసుకోవాలని సూచించారు. తాను కూడా మే 1 నుంచి జూన్ 2 వరకు ప్రజలతో మమేకం అవడానికే సమయం కేటాయిస్తానని చెప్పారు.

**చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి స్వీట్ వార్నింగ్**

ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీరియస్ అయ్యారు. రోజుకొకరిని మంత్రిగా నువ్వే ప్రకటిస్తున్నావు. ఇది మంచి పద్ధతి కాదు మంత్రివర్గ విస్తరణపై అధిష్టానం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. మంత్రులుగా ఎవరిని ఎంపిక చేయాలనేది హైకమాండ్ చూసుకుంటుంది. మరోసారి ఈ అంశంపై మాట్లాడొద్దు, నేతలు,కార్యకర్తలను కన్ఫ్యూజ్ చేయొద్దని ఎంపీ చామలకు సిఎం రేవంత్ స్వీట్ వార్నింగ్ ఇచ్చారు. మనందరి లక్ష్యం ఒక్కటే అయి ఉండాలి. రెండోసారి ప్రభుత్వాన్ని తీసుకురావడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. సన్నబియ్యం పంపిణీ విషయంలో ప్రభుత్వానికి చాలా మంచి పేరు వచ్చింది. దాన్ని పక్కదారి పట్టించడానికి బిఆర్ఎస్,బిజెపి కుట్రలు చేస్తోందన్నారు. దీన్ని అందరూ సమర్థవంతంగా తిప్పికొట్టాలని చెప్పారు. త్వరలోనే ఎమ్మెల్యేలకు వ్యక్తిగతంగా అపాయింట్‌మెంట్ ఇస్తా, రెండోసారి గెలవడానికి మీ నియోజకవర్గాల్లో ప్రభావితం చేసే పనులు తీసుకురండీ,దగ్గరుండీ నేనే చేయిస్తా అని సిఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

**వివేక్,రాజగోపాల్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు గైర్హాజరు**

సిఎల్పీ సమావేశానికి టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క హాజరై ప్రసంగించారు. మంత్రి వర్గంలో చోటు దక్కకపోవడంపై అసంతృప్తితో ఉన్న గడ్డం వివేక్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి,ప్రేమ్‌సాగర్‌రావు సిఎల్పీ సమావేశానికి గైర్హాజరయ్యారు. పార్టీ ఫిరాయింపుల కేసును ఎదుర్కొంటున్న కడియం శ్రీహరి. సంజయ్,తెల్లా వెంకట్రావు తదితరులు హాజరయ్యారు.

# సోనియా, రాహుల్ పేర్లు

>> చేయాలని కోరుతూ జారీ చేసిన నోటీసులు ఢిల్లీ, ముంబైలోని బాంద్రా ప్రాంతంలోని ఆస్తులు మరియు లక్నోలోని బిశేశ్వర్ నాథ్ రోడ్‌లోని తిరిలి భవనంపై అతికించారు.ఈ కేసుపై ఈడీ దర్యాప్తు 2021లో ప్రారంభమైంది, జూన్ 26, 2014న న్యూఢిల్లీలోని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ పాటియాలా హౌస్ కోర్టులు జారీ చేసిన ఉత్తర్వు ఆధారంగా. ఈ కేసు బిజెపికి చెందిన సుబ్రమణియన్ స్వామి దాఖలు చేసిన ప్రైవేట్ ఫిర్యాదు ఆధారంగా జరిగింది. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మరియు అనేక మంది ఇతర కాంగ్రెస్ నాయకులు మరియు యంగ్ ఇండియన్ అనే ప్రైవేట్ కంపెనీతో సహా అనేక మంది ప్రముఖ రాజకీయ నాయకులు అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఎజెఎల్)కి చెందిన రూ. 2000 కోట్లకు పైగా విలువైన ఆస్తులను మోసపూరితంగా స్వాధీనం చేసుకోవడంతో సంబంధం ఉన్న మనీలాండరింగ్ పథకంలో పాల్గొన్నారని ఆరోపిస్తూ ఫిర్యాదు ఆరోపించింది.నేషనల్ హెరాల్డ్‌ను ఎజెఎల్ ప్రచురిస్తున్న సంగతి తెలిసిందే. మరియు యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యంలో ఉంది. కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ మరియు రాహుల్ గాంధీ యంగ్ ఇండియన్‌లో మెజారిటీ వాటాదారులు, వారిలో ఒక్కొక్కరు 38 శాతం వాటాలను కలిగి ఉన్నారు.ఇదిలా ఉండగా, హర్యానాలో జరిగిన రియల్ ఎస్టేట్ ఒప్పందంతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ ఆరోపణలపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా భర్త మరియు రాహుల్ గాంధీ బావమరిది అయిన వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాను దర్యాప్తు సంస్థ ప్రశ్నించిన కొన్ని గంటల తర్వాత చార్జిషీట్ దాఖలు చేసింది.తనపై వచ్చిన ఆరోపణలను రాజకీయ ప్రతీకారంగా వాద్రా తోసిపుచ్చారు, ఏజెన్సీ ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి తాను ఇప్పటికే గంటలు గడిపానని మరియు వేల పేజీల పత్రాలను సమర్పించానని ఎత్తి చూపారు.

**రాబర్ట్ వాద్రాకు ఇడి నోటీసులు**

వయనాడ్ ఎంపీ ప్రియాంకాగాంధీ భర్త రాబర్ట్ వాద్రాకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరోసారి నోటీసులు పంపింది. హర్యానాలోని శికోపూర్ గ్రామంలో జరిగిన భూమి కొనుగోళ్లకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో మంగళవారం విచారణకు హాజరుకావాలని సమన్లలో పేర్కొంది. ఈడీ సమన్లు జారీ అయిన తర్వాత వాద్ర తన నివాసం నుంచి దిల్లీలోని ఈడీ కార్యలయానికి కాలినడకన వెళ్లారు. ఈ సందర్భంగా ఈడీ కార్యలయం ముందు మీడియాతో మాట్లాడారు. ప్రజలకు ఏదైనా మంచి చేసినప్పుడల్లా తనను అణచివేయడానికి ప్రయత్నిస్తారని పేర్కొన్నారు. ఈడీ సమన్లు జారీ చేయడాన్ని రాజకీయ ప్రతీకార చర్యగా పేర్కొన్నారు. ప్రభుత్వం దర్యాప్తు సంస్థల అధికారాన్ని దుర్వినియోగం చేస్తుందని విమర్శించారు. తన దగ్గర ఏమి లేదని, అందుకే తనకు ఎటువంటి భయం లేదని తెలిపారు. అధికారులు అడిగే ప్రశ్నలకు సమాధానం ఇస్తానని చెప్పారు. హరియాణాలోని షికోపూర్ భూ ఒప్పందంపై ఈడీ మనీ లాండరింగ్ కేసు నమోదు చేసింది. వాద్రా విచారణకు హాజరైతే మనీ లాండరింగ్ చట్టం కింద ఆయన వాంగ్మూలం నమోదు చేయనున్నట్లు దర్యాప్తు వర్గాలు పేర్కొన్నాయి. ఇదివరకు వేర్వేరు మనీ లాండరింగ్ కేసుల్లో రాబర్ట్ వాద్రాను ఈడీ అధికారులు ప్రశ్నించారు.



గుజరాత్ నర్మదా జిల్లాలోని లచ్రాస్‌లో స్మార్ట్ అంగన్‌వాడీ, స్మార్ట్ క్లాస్‌రూమ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్

## దేశమంతటా 'నైరుతి'!

>> దీర్ఘకాల సగటు 87 సెంటీమీటర్లు మాత్రమే ఉండాదని పేర్కొన్నారు. భారత ఉపఖండంలో సాధారణం కంటే తక్కువ వర్షాపాతంతో సంబంధం ఉన్న ఎల్ నినో పరిస్థితులు ఈ సారి అభివృద్ధి చెందే అవకాశం లేదన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, కర్నాటకలోనూ సాధారణం కంటే ఎక్కువగానే ఉంటాయని చెప్పింది. వాతావరణ శాఖ ఇచ్చిన అప్‌డేట్ దేశ రైతులకు ఎంతో ఉపశమనం కలిగించనున్నది. నైరుతి రుతుపవనాలు భారత దేశ వ్యవసాయరంగానికి ఎంతో కీలకమైనవి. వ్యవసాయం దేశ జనాభాలో దాదాపు 42.3 శాతం మందికి జీవనోపాధి అందిస్తున్నది. అదే సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థకు 18.2శాతం దోహదపడుతున్నది. ఇటీవల కాలంలో వర్షం కురిసే రోజులు తగ్గుతుండగా.. స్వల్ప వ్యవధిలో భారీ వర్షాలు పెరుగుతోంది. దాంతో తరచూ కరువులు, వరదలు సంభవిస్తున్నాయని వాతావరణశాఖ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. దేశంలోని కొన్ని ప్రాంతాలు ఇప్పటికే తీవ్రమైన వేడితో అల్లాడుతున్నాయి. ఏప్రిల్‌నుంచి జూన్‌వరకు గణనీయంగా ఎక్కువ సంఖ్యలో వేడిగాలులు వీచే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. వాతావరణ మార్పుల కారణంగా వైవిధ్యం మరింత పెరిగిందని పేర్కొంటున్నారు.

## బెయిల్ ఇస్తే వారంలో భారత్‌కు!

>> ముందస్తు బెయిల్‌ను సానుకూలంగా పరిశీలించి వెంటనే దీనిని మంజూరు చేయాలని ఆయన కోరారు. ఒకవేళ ప్రభాకర్ రావుకు ముందస్తు బెయిల్ లభిస్తే వారం రోజుల్లో భారత్‌కు వస్తారని, పోలీసుల విచారణకు హాజరవుతారని, విచారణాధికారులకు సహకరిస్తారని డిఫెన్స్ న్యాయవాది తెలిపారు. డిఫెన్స్ న్యాయవాది వాదనలతో పబ్లిక్ ప్రాసిక్యూటర్ తీవ్రంగా విబేధించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావు ముమ్మాటికీ దోషి అని ఆయన తెలిపారు. ఈ విషయంలో పోలీసుల వద్ద తి రుగులేని ఆధారాలు వున్నాయని ఆయన వాదించారు. ప్రభాకర్ రావుకు ముందస్తు బెయి ల్ ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వకూడదని ఆయన హైకోర్టును అభ్యర్థించారు. తీవ్ర మైన కేసుగా పరిగణించబడుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావు మొదటి ముద్దాయిగా వున్నాడని ఆయన తెలిపారు. డిఫెన్స్ న్యాయవాది చెబుతున్నట్లు ముందస్తు బెయిల్ ఇస్తే వారం రోజుల్లో ప్రభాకర్ రావు భారత్‌కు వస్తారనడం హాస్యాస్పద ంగా వుందని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెల్లడించారు. ప్రభాకర్ రావు పాస్‌పోర్టును పా స్‌పోర్టు అథారిటీ రద్దు చేసిందని, పాస్‌పోర్టు రద్దయితే ప్రభాకర్ రావు భారత్‌కు ఎలా వస్తారని ఆయన ప్రశ్నించారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం ప్రభా కర్ రావు ముందస్తు బెయిల్‌పై తదుపరి విచారణను ఈ నెల 25వ తేదీకి వాయిదా వేసింది.

# సర్కార్ పెద్దపీట

>> సమ్మిట్‌లో 500కు పైగా మహిళలు, ఆయా రంగాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ మహిళల సాధికారత కోసం తమ ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి పటిష్టంగా అమలు చేస్తోందని తెలిపారు. దీనివల్ల ఎన్నో లక్షల మంది మహిళలకు ప్రయోజనం కలిగిందని ఆయన తెలిపారు. మార్చి ఎనిమిదవ తేదీన జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంతో పాటు సోమవారం జరిగిన అంబేద్కర్ జయంతి ఎన్నటికీ మరువలేమని ఆయన తెలిపారు. ఈ క్రమంలోనే అనేక హక్కులను ఆయన కల్పించారని విక్రమార్క వెల్లడించారు. మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధిగా ఎదగాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోందని ఆయన తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం నుంచి మహిళలకు 21 వేల కోట్ల రూపాయలను వడ్డీలేని రుణాలుగా అందిస్తున్నామని భట్టి విక్రమార్క అన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించడం వల్ల మహిళా సంఘాలకు ఎంతో ప్రయోజకరంగా వుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే ల క్ష్యంతో ప్రభుత్వం ముందుకు పోతోందని ఆయన వెల్లడించారు. వెయ్యి మెగావాట్ల పునరుత్పత్తి విద్యుత్ ఉత్పత్తికి సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్‌తో కలిసి ప్రభుత్వం పనిచేస్తో ందని ఆయన అన్నారు. అద్దెకు తీసుకుంటున్న ఆర్టీసీ బస్సుల విషయంలో కూడా మహిళలకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని ఆయన తెలిపారు. ఉచిత బస్సులు, ఇందిరా శక్తి క్యాంటీన్లు, స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్ల వంటి అనేక అంశాలలో మహిళలకు తమ సర్కారు అగ్రతాంబులం ఇవ్వడం ద్వారా వారిని ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం కల్పించిందని మంత్రి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం మహిళలను సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చేయడా నికి కట్టుబడి వున్నట్లు సిఎం రేవంత్ రెడ్డి చెప్పిన మాటలను ఈ సందర్భంగా మంత్రి భట్టి విక్రమా ర్క చెప్పారు. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ ఛైర్మన్, కొత్వాల్ ఆనంద్ మాట్లాడుతూ స్త్రీ సమ్మిట్ 2.0 నిర్వహణ వల్ల మహిళా సాధికారికతకు మరింత ప్రయోజనం చేకూరిందని అన్నారు. మహిళ లతో పాటు చిన్నారుల భద్రతకు సిటీ పోలీసు విభాగం అనేక చర్యలు చేపట్టిందని తెలిపారు. దీని వల్ల ఎన్నో ప్రయోజనాలు కలిగాయని ఆయన తెలిపారు. హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ సి టీ పోలీసు విభాగంలో ఒక భాగమే అయినా ఎన్నో విజయవంతమైన కార్యక్రమాలను చేపట్టిందని ఆయన తెలిపారు. ఈ సమ్మిట్ వల్ల సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కారం లభి స్తుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి శేఖర్ రెడ్డితో పాటు డాక్టర్ బన్సూరి వెల్పాండియన్ సహా ఆరో గ్య నిపుణులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో నా స్థానం ఏంటి?

>> నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలో, నా సీనియారిటీకి స్థానం ఏమిటనే భావన నాలోఉందన్నారు. ఒక దశలో జీవన్ రెడ్డి బావోద్వేగానికి లోనయ్యారు. కాంగ్రెస్ అంటే జీవన్ రెడ్డి, జీవన్ రెడ్డి అంటే కాంగ్రెస్ అనీ అంటారని ఆయన పేర్కొన్నారు. పార్టీ బలోపేతం కోసం పనిచేస్తున్నా,దశాబ్దకాలం పోరాటం చేశానని చెప్పుకొచ్చారు. ఏమాత్రం తోనకకుండా, కాంప్రమైజ్ కాకుండా 10ఏళ్ళు ఒంటరి పోరాటం చేశానని జీవన్ రెడ్డి పేర్కొన్నారు పీసీసీ అధ్యక్షుడు హోదాలో రేవంత్‌రెడ్డి, సీఎల్పి నేతగా భట్టి విక్రమార్క ఎంత పోరాడరో శాసన మండలిలో ఏకైక సభ్యుడిగా నేను అంతే పోరాటం చేశానని నేనేమి తక్కువ కాదని తేల్చి చెప్పారు. 2014 లోబీ ఆర్ ఎస్ ప్రభంజనంలో తట్టుకుని జగిత్యాల నుంచి ఎమ్మెల్యే గా గెలువడమే కాకుండా ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ ఉమ్మడి 3 జిల్లాలో ఏకైక కాంగ్రెస్ ఎమ్మెల్యేగా పని చేసి పార్టీ పటిష్టతకు పాటుపడ్డనని జీవన్ రెడ్డి అన్నారు. 2019 లో మార్చి నుండి 6 ఏళ్ళు శాసన మండలిలో ఏకైక కాంగ్రెస్ పార్టీ సభ్యుడిగా బీఆర్ఎస్ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేశాననీ జీవన్ రెడ్డి గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీలో నాకన్న సీనియర్ ఎవరూ లేరని, ఇప్పుడు ఉన్న వారిలో వి.హ్నన్మత రావు ఒక్కరే నాకన్న సీనియర్ అనీ పేర్కొన్నారు. జానారెడ్డి కూడా నా తర్వాత 4 సంవత్సరాలకు కాంగ్రెస్ పార్టీలో చేరారనీ చెప్పారు. పార్టీకి ఎప్పుడు నేను వ్యతిరేకంగా మాట్లాడలేదనీ, పార్టీ బలోపేతం కోసమే పనిచేస్తున్నానని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ మారుతారనే ప్రచారం జరుగుతోందని విలేకరుల ప్రశ్నకు 40 ఏళ్లుగా పార్టీకోసం పని చేస్తున్న నా స్థానం ఎంటిదని అడుగుతున్న అంతే కానీ నేనెందుకు పార్టీ మారుతానని ఎదురు ప్రశ్న వేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బండ శంకర్,కొత్త మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# చంచల్‌గూడ జైల్లో నిబంధనల ఉల్లంఘన

## రిమాండు ఖైదీ ములాఖాత్ దృశ్యాలు

## సోషల్ మీడియాలో చక్కర్లు... జైలు సిబ్బందిపై వేటు



రిమాండు ఖైదీ జాబ్రీ

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** చంచల్‌గూడ జైల్లో నిబంధనల ఉల్లంఘన వెలుగు చూసింది. చోరీ కేసు సహా పలు కేసుల్లో నిందితుడుగా వున్న ఓ నేరగాడు చంచల్‌గూడ జైలులో రిమాండు ఖైదీగా వుండగా అతన్ని కలిసేందుకు వచ్చిన బంధువులు ములాఖత్ సందర్భంగా జరిగిన భేటీని సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో వుంచడం వైరల్‌గా మారింది. దీనిని తీవ్రంగా పరిగణించిన ఉన్నతాధికారులు అక్కడి సిబ్బంది నలుగురిపై వేటు వేశారు. వివరాలు ఇలావున్నాయి. పాతబస్తీ కి చెందిన పాత నేరగాడు అహ్మద్ బిన్ హాసన్ అల్ జాబ్రీని ఈ నెల 11వ తేదీన టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. అయితే ఈ నెల 12వ తేదీన జాబ్రిని కలిసేందుకు అతని బంధువులు జైలుకు వెళ్లారు. ఈ సందర్భంగా ములాఖత్‌కు వచ్చిన వారి ని జైలు సిబ్బంది సరిగ్గా తనిఖీ చేయక పోవడంతో పాటు వారి వద్ద వున్న సెల్‌ఫోన్లను తీసుకోలేదు. దీంతో జాబ్రితో ములాఖత్ అయిన అతని బంధువులు ఈ దృశ్యాలను సెల్‌ఫోన్లో చిత్రీకరించారు. అనంతరం ఈ దృశ్యాలను ఇన్‌స్టాగ్రాంలో పోస్ట్ చేశారు. ఇదికాస్త నిమిషాల వ్యవధిలోనే వైరల్‌గా మారింది. ఈ ఘటనలో జైలు సిబ్బంది నలుగురు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వారిపై వేటు వేస్తూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

# కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలపై భగ్గుమన్న కాంగ్రెస్

## ప్రభుత్వాన్ని కూల్చాలనేది కెసిఆర్ ఆలోచన : మంత్రి పొంగులేటి

## జోస్యం కూడా ప్రభాకర్‌రెడ్డి చెపుతున్నారా?: మంత్రి పొన్నం ప్రభాకర్

## ప్రజాబలం మా వెంటే.. భయంలేదు : పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

## నార్కో టెస్ట్ కొత్త ప్రభాకర్‌రెడ్డికి చేయాలి : ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

**హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బిల్డర్లు,పారిశ్రామిక వేత్తలు ఏకమయ్యారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇటు బిఆర్‌ఎస్‌ను ఇరకాటం పెడుతుంటే మరోవైపు కాంగ్రెస్ భగ్గుమంటున్నది. కాంగ్రెస్‌లో చేరే ముందు గతంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసిన అనుభవం ఉన్న తెలంగాణ ప్రజలు కొత్తప్రభాకర్‌రెడ్డి కూడా గోడదూకేందుకు సన్నద్ధమయ్యారా అనే సందేహం ప్రజలు కూడా వ్యక్తంచేస్తున్నారు. బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నంప్రభాకర్ స్పందిస్తూ కొత్తప్రభాకర్‌రెడ్డి ట్రాన్స్‌పోర్టు వ్యాపారం అనుకొన్నా కానీ ఈ మధ్య జోతిష్యం కూడా చెబుతున్నారని వ్యంగ్యంగా వ్యాఖనించారు. బిఆర్‌ఎస్ నేతలు ప్రభుత్వాన్ని కూలుస్తాం అంటే ఊరుకుంటామా ఎవరు చేతులు కట్టుకొని లేరు అని ప్రభాకర్ మండిపడ్డారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చాలని కుట్ర ఆది నుంచి జరుగుతోందని అని అన్నారు. ప్రజాబలంలేని బిఆర్‌ఎస్ వేల కోట్ల రూపాయలతో రాజకీయం చేయాలని చేస్తోందని పొంగులేటి ధ్వజమెత్తారు. ఇందిరమ్మ ప్రభుత్వం కూ ల్చాల నేది కెసిఆర్ ఆలోచనే నని కెసిఆర్ నోటి నుంచి వచ్చిన మాటలు కొత్త ప్రభాకర్‌రెడ్డి నోటి నుంచి వచ్చాయని అన్నారు. ప్రభుత్వాన్ని కూల్చాలని పగటి కలలు కంటున్నారని ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి అన్ని పరిణామాలను గమనించాలని పిలుపునిచ్చారు. బిఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు బుద్ధిచెప్పారని భవిష్యత్ లో కూడా అదే పని చేస్తారని ఆయన జోస్యంచెప్పారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చినహామీ ప్రకారం ధరణిని బంగాళాఖాతంలో వేశామని సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్ళడానికి చిత్తశుద్ధితో కృషిచేస్తామని ఆయన తెలిపారు. భూభారతి ఆర్‌వోఆర్ 2025 చట్టాన్ని తీసుకొచ్చామని ఏరాష్ట్రంలో ఇవ్వని సన్నబియ్యం ఇక్కడ ఇస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ళు కులాలు మతాలకు అతీతంగా ఇస్తామని చెప్పారు.,ప్రజలు ఓట్లేస్తేనే తాము అధికారంలోకి వచ్చామని ప్రభుత్వంకొనసాగలో లేదో వచ్చే ఎన్నికలలో ప్రజలే డిసైడ్ చేస్తారు బిఆర్‌ఎస్ నాయకులు కాదని పొంగులేటి కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యలపై స్పందించారు. టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల బలం ఉందని బిఆర్‌ఎస్ చోటా మోటీ నేతల వ్యాఖ్యలకు భయపడేదిలేదని తెలిపారు.కొత్త ప్రభాకర్‌రెడ్డి వ్యాఖ్యల వెనుక పెద్ద కుట్రకోణం దాగి ఉందని అనుమానం వ్యక్తంచేశారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ ప్రభుత్వాన్ని కూల్చుతామని మాట్లాడిన కొత్త ప్రభాకర్‌రెడ్డికి నార్కో అనాలిసిస్ టెస్ట్ చేయించాలని డిమాండ్ చేశారు. అపుడు నిజాలు బయటకు వస్తాయి. వెంటనే ఆయన చేసిన వ్యాఖ్యలపై ప్రభుత్వం విచారణ జరిపించాలని ఆయన కోరారు. అభివృద్ధి సంక్షేమంలో దూసుకెళ్తున్న ప్రజా ప్రభుత్వాన్ని కూల్చేందుకు తెరవెనుక బిఆర్‌ఎస్ భారీ కుట్రలు చేస్తోందని ఆరోపించారు బిజెపి, గుజరాత్ వ్యాపారులతో కలిసి గులాబి పార్టీ ఈ కుట్రకు తెరలేపిందని వ్యాఖ్యానించారు.కొత్త ప్రభాకర్‌రెడ్డి మాటలు ముమ్మాటికి కెసిఆర్ దేనని అద్దంకి దయాకర్ ఆరోపించారు.దుబ్బాక ఎమ్మెల్యే ఆరోపణలపై వెంటనే విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని విప్ ఆదిశ్రీనివాస్, భువనగిరి ఎంపి కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. బిఆర్‌ఎస్ నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఎందుకు ఈర్శ ఉందని ఆది శ్రీనివాస్ నిలదీశారు. కుట్రకోణం ఉన్నట్లైతే వెంటే చర్యలు తీసుకోవాలని తెలంగాణలో మరో పదేళ్ళు మేమే అధికారంలో ఉంటామని ధీమా వ్యక్తంచేశారు.

# గల్ఫ్‌లో హత్యకు గురైన నిర్మల్ జిల్లావాసి కుటుంబానికి అండగా ఉంటాం

## బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** గల్ఫ్‌లో హత్యకు గురైన నిర్మల్ జిల్లా వాసి కుటుంబానికి అండగా ఉంటామని బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఈ నేపథ్యంలో విదేశాంగ మంత్రిత్వ శాఖ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో మాట్లాడారు. మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చే దిశగా చర్యలు తీసైఉకుంటున్నట్లు తెలిపారు. సోన్ మండల కేంద్రానికి చెందిన అష్టం ప్రేమ్‌సాగర్ దుబాయ్‌లో మృతి చెందడంతో, కుటుంబ సభ్యులు, మండల నాయకులు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డికి తీసుకుని వచ్చారు. మంగళవారం విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఎన్‌ఆర్ఐ సెల్ అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా ప్రేమ్‌సాగర్ మృతదేహం స్వదేశానికి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అధికారులకు సూచించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొని, వారి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.




# కోనోకార్పస్ మొక్కలను రక్షించుకోవాలి

## పర్యావరణ శాస్త్రవేత్తల పిలుపు

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాలలో బహుళ ప్రయోజనాలను అందిస్తున్న కోనో కార్పస్ మొక్కలను రక్షించుకుందామని ప్రముఖ శాస్త్రవేత్తలు ప్రొఫెసర్ ఎ.ఆర్. రెడ్డి, సిసిఎంబి పూర్వ డైరెక్టర్ డాక్టర్ సి.హెచ్. మోహన్ రావులు పిలుపునిచ్చారు. జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో కోనోకార్పస్ మొక్కలను రక్షించుకుందాం అనే అంశంపై మీడియా సమావేశం నిర్వమించారు. దీనికి ప్రముఖ వృక్ష శాస్త్రవేత్త, కోనోకార్పస్ మొక్కపై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పరిశోధనలు జరిపిన ప్రొఫెసర్ ఎ.ఆర్ రెడ్డి ప్రసంగిస్తూ మొక్కలన్నిటిలో అత్యధిక కార్బన్ డై ఆక్సైడ్ ను తీసుకొని అత్యధిక ఆక్సిజన్ ను అందిస్తున్న మొక్క కోనోకార్పస్ అని తన పరిశోధనలో తేలిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా కోనోకార్పస్ పై జరిపిన పరిశోధనలన్నీ మంచి ప్రయోజనాలున్నాయని పేర్కొన్నాయన్నారు. భూగర్భ జలాలను ఎక్కువ తీసుకుంటుందనే ప్రచారం అవాస్తవమని, నీటి లభ్యత లేని దుబాయ్, సౌదీ అరేబియాలో కోనోకార్పస్ మొక్కలను విరివిగా పెంచుతున్నారని తెలిపారు. ప్రతి మొక్క నుండి అన్ని ప్రయోజనాలు పొందలేమని, కొన్ని పండ్లు ఇస్తాయని, కొన్ని పూలు ఇస్తాయని, మరికొన్ని నీడను, కలపను ఇస్తాయన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బాధ్యతాయుత స్థానంలో, గౌరవప్రదమైన పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కోనోకార్పస్ మొక్క ఆక్సిజన్ పీల్చుకొని కార్బన్ డై ఆక్సైడ్ ను విడుదల చేస్తుందని పేర్కొనడాన్ని తీవ్రంగా ఖండించారు. తెలుగు రాష్ట్రాలలో వాల్టా చట్టాన్ని అమలు చేయడం లేదని, చెట్లను నరికిన వాళ్లపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పులో చెట్లను నరకడం మనుషులను నరికినట్టే భావించాలని తీర్పునిస్తూ ప్రతి నరికిన చెట్టుకి లక్ష రూపాయల పెనాల్టీ విధించిందని గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వం కోనోకార్పస్ చెట్లను నరికే కార్యక్రమాన్ని కొనసాగిస్తే సుప్రీం కోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ వృక్ష శాస్త్ర ప్రొఫెసర్ బి.యన్. రెడ్డి, జీవశాస్త్ర నిపుణులు గోపాలకృష్ణ, వి.ఎన్.ప్రసాద్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# ఇంటర్ ఫలితాలు రాకముందే డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

## నేటి నుంచి బిసి గురుకుల డిగ్రీ కాలేజీల్లో దరఖాస్తులకు అవకాశం

## గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఫలితాలు వెలువడక ముందే.. బిసి సంక్షేమ శాఖ అధ్వర్యంలో కొనసాగుతున్న బిసి గురుకుల డిగ్రీ కాలేజీల్లో 2025-26 విద్యా సంవత్సరంలో మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్‌ను మంగళవారం జారీ చేశారు. నేటి(బుధవారం.. ఏప్రిల్ 16) నుంచి దరఖాస్తు చేసుకోవాలని గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి బిసి రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సొసైటీ కార్యదర్శి సూచించారు. 2025 మార్చ్‌లో ఇంటర్మీడియట్ 2వ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు రాసిన విద్యార్థులు బిసి రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీల్లో (ఇంగ్లీష్ మీడియం) మొదటి సంవత్సరంలోని బిఎస్సీ(ఫిజిక్స్, లైఫ్ సైన్సెస్) బికామ్, బిఏ, బిబిఏ, బిఎఫ్‌టి, యానిమేషన్ అండ్ విఎఫ్‌ఎక్స్ కోర్సుల్లో చేరడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నేటి(ఏప్రిల్16.. బుధవారం) నుంచి దరఖాస్తు చేసుకోవచ్చుని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో సొసైటీ కార్యదర్శి సైదులు తెలిపారు. పూర్తి వివరాలకు ప్రాస్పెక్టస్ చూడాలని సూచించారు. అయితే ఇప్పటికే బిసి రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీల్లో చదివిన ఇంటర్మీడియట్ విద్యార్థులు దరఖాస్తు చేయనవసరం లేదన్నారు. వారు సంబంధిత కాలేజీ ప్రిన్సిపాల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 040-23328266లో సంప్రదించాలని బిసి గురుకుల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు సూచించారు.

# హైదరాబాద్‌ను గ్లోబల్ బిజినెస్ సెంటర్‌గా మార్చడమే లక్ష్యం

## ఇన్నోవేషన్, ఆర్‌అండ్‌డి, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్‌పై దృష్టి

## 2030 నాటికి 200 మిలియన్ చదరపు అడుగుల కమర్షియల్ స్పేస్‌ను అందుబాటులోకి తేవడమే లక్ష్యం

## సిటిజెన్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** హైదరాబాద్ లో 2030 నాటికి 200 మిలియన్ చదరపు అడుగుల 'గ్రేడ్ ఏ' కమర్షియల్ స్పేస్ ను అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. మంగళవారం నానక్‌రాం గూడలో యూఎస్‌కు చెందిన సిటిజెన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'సిటిజెన్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్'ను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ "గ్లోబల్ బిజినెస్ హబ్"గా మారిందని అందుకు అనుగుణంగానే కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ పెరిగిందన్నారు. ఢిల్లీ, చెన్నై లాంటి మెట్రో నగరాల్లో కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ తగ్గుతుంటే మన దగ్గర గతేడాది దేశంలోనే అత్యధికంగా 56 శాతం వార్షిక వృద్ధిరేటు నమోదయ్యిందన్నారు. గతేడాది రిటైల్ రంగంలో 1.8 మిలియన్ చదరపు అడుగుల స్పేస్‌ను వివిధ సంస్థలు లీజుకు తీసుకున్నాయన్నారు. హైదరాబాద్‌లో ఆమ్జెన్, గ్లోబల్ లాజిక్, ఎలీలిల్లీ, మారియంట్, సిగ్నా లాంటి అంతర్జాతీయ సంస్థలకు చెందిన 355 జిసిసిలుండగా 3 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తున్నాయన్నారు. ఏడాది వ్యవధిలో 70కి పైగా కొత్త జిసిసిలు హైదరాబాద్‌లో ప్రారంభమయ్యాయన్నారు. హైదరాబాద్‌ను జిసిసిలకు హబ్‌గా మార్చడమే కాకుండా వాటిని ఇన్నోవేషన్, ఆర్‌అండ్‌డి, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ తదితర అంశాల్లో సేవలు అందించే గ్లోబల్ వాల్యూ యాడెడ్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2030 నాటికి దేశ జిడిపిలో తెలంగాణ వాట ట్రిలియన్ డాలర్లకు చేరుతుందన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగాలు కల్పించడమే తమ లక్ష్యమని వివరించారు. కొందరు కావాలనే పనిగట్టుకొని పెట్టుబడులు రాకుండా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంపై నమ్మకంతో ఎంతో మంది పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వస్తున్నారని అన్నారు. వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామన్నారు. తమ జిసిసిని హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన సిటిజెన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం 1000మంది ఐటి, డేటా నిపుణులకు ఇక్కడ ఉపాధి అవకాశాలు లభిస్తాయని, రెండు, మూడేళ్లలో ఈ సంఖ్య రెట్టింపు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సిఎస్ జయేష్ రంజన్, సిటిజన్స్ ఫైనాన్షియల్ గ్రూప్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, హెడ్ ఆఫ్ ఎంటర్ప్రైజ్ టెక్నాలజీ, సెక్యూరిటీ మైకెల్, కాగ్నిజెంట్ ప్రెసిడెంట్ అమెరిక సూర్య గుమ్మాడి తదితరులు పాల్గొన్నారు.



మంగళవారం నానక్‌రాంగూడలో 'సిటిజెన్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్'ను లాంఛనంగా ప్రారంభిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

# లా సెట్, పిజి లాసెట్ దరఖాస్తు గడువు పెంపు

## అపరాధ రుసుంతో మే 25 వరకు అవకాశం

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని న్యాయ శాస్త్ర కోర్సుల్లో చేరడానికి దరఖాస్తు గడువును పొడిగించారు. మంగళవారం(ఏప్రిల్ 15)తో గడువు ముగియడంతో.. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. 3 సంవత్సరాలు, 5 సంవత్సరాల లా కోర్సులో చేరడానికి నిర్వహించే లాసెట్-2025కి సంబంధించిన టిజి లాసెట్-2025తోపాటు పిజి లా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే పిజి లాసెట్-2025కి దరఖాస్తు గడువును 30 వరకు పొడిగించినట్టు లాసెట్, పిజి లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ బి విజయలక్ష్మీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం వరకు 30,365 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు గడువు మంగళవారం(ఏప్రిల్ 15)తో ముగియడంతో.. ఈ నెల 30 వరకు అపరాధ రుసుం లేకుండా పొడిగించారు. అపరాధ రుసుంతో మే 25 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. జూన్ 6న పరీక్షలను నిర్వహించనున్నారు. సోమవారం సాయంత్రం వరకు లాసెట్ 3 సంవత్సరాల పరీక్షకి 21,483 దరఖాస్తులు రాగా.. 5 సంవత్సరాల లాసెట్‌కి 6326 దరఖాస్తులు వచ్చాయి. పిజి లాసెట్‌కి 2556 దరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా ఇప్పటి వరకు 30,365 దరఖాస్తులు వచ్చాయి. అపరాధ రుసుం రూ. 4000తో మే 25 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. 3 సంవత్సరాల లాసెట్ పరీక్షను జూన్ 6న ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు.. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు నిర్వహించనున్నారు. పిజి లాసెట్, 5 సంవత్సరాల లాకోర్సులో ప్రవేశాల కోసం జూన్ 06న మధ్యాహ్నం 4 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నారు.

# పేదల గుడిసెలు తొలగిస్తే ప్రజా ప్రతిఘటన

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** మహబూబాబాద్ జిల్లాలో పేదలు వేసుకున్న గుడిసెలను తొలగిస్తే ప్రజా ప్రతిఘటన తప్పదని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ హెచ్చరించారు. మహబూబాబాదు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ స్థలంలో గత మూడేళ్ళుగా వేలాది మంది ఇండ్లు లేని నిరుపేదలు గుడిసెలు వేసుకుని నివాసముంటున్నారని.. ఆ గుడిసెలను మంగళవారం ఉదయం పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు జేసీబీలతో గుడిసెలను కూల్చివేసే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. గుడిసెలు తొలగిస్తే ఇక్కడే పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామన్న పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆ భూమిలో పేదల గుడిసెలు తొలగించి, పెద్దలకు కట్టబెట్టే కుట్ర జరుగుతుందని.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే జోక్యం చేసుకుని అక్కడ నివాసముంటున్న పేదలందరికీ పట్టాలిచ్చి, ఇంటి నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 19సార్లు ఈ గుడిసెలు కూల్చివేసే ప్రయత్నం చేసిందని గుర్తు చేశారు. అక్కడ గుడిసెలు వేసుకున్న 200 మందిపై అక్రమ కేసులు పెట్టి, జైళ్లకు పంపిందన్నారు. గుడిసెలను తొలగించి కొంత మంది అనుయాయులకు కట్టబట్టే కుట్రకు ప్రభుత్వం పూనుకోవడం తగదన్నారు.

# మొదటిరోజు టెట్‌కు 1,890 దరఖాస్తులు

## జూన్ 15 నుంచి 30 వరకు పరీక్షలు

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో మంగళవారం నుంచే టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి రోజు 1890 దరఖాస్తులు వచ్చినట్టు టెట్-2025 ఛైర్‌పర్సన్, పాఠశాల విద్య డైరక్టర్ ఈవి నరసింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం నుంచే ఆన్‌లైన్‌లో టెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి రోజు 2072 మంది ఫీజు చెల్లించగా.. వారిలో 1890 మంది తమ దరఖాస్తులను అప్‌లోడ్ చేశారు. మొదటి రోజు పేపర్-1కి 598 మంది ఫీజు చెల్లించి.. వారిలో 558 మంది దరఖాస్తు చేశారు. పేపర్-2కి 1221 మంది ఫీజు పే చేయగా.. అందులో 1101 మంది దరఖాస్తు చేశారు.

ఇక రెండు పేపర్లకు 253మంది ఫీజు చెల్లిస్తే వారిలో 231 మంది దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. టెట్ నోటిఫికేషన్‌ను ఈ నెల 11న ప్రభుత్వం జారీచేయగా మంగళవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిం చడం ప్రారంభించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఈ నెల 30 వరకు స్వీకరించ నున్నారు. జూన్ 9 నుంచి అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. జూన్ 15 నుంచి 30 వరకు పరీక్షలను నిర్వహించనున్నారు.

# విద్యాబోధనలో నాణ్యతే ముఖ్యం

## ఇనిస్టిట్యూట్ అఫ్ ఇంజనీర్స్ ఇండియా ప్రెసిడెంట్ వి.బి.సింగ్

**హైదరాబాద్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** నూతనంగా వస్తున్న విద్యామార్పులకు అనుగుణంగా భవిష్యత్ ఇంజనీర్లను తీర్చి దిద్దాలనే ఆలోచనలతో రూపుదిద్దుకున్న హైదరాబాద్‌లోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా ప్రస్తుతం ఆసియాలోనే ఒక ప్రతిష్టాత్మకమైన సంస్థగా పేరు ప్రతిష్టలు సంపాదించుకుందని కలకత్తాకు చెందిన ఇనిస్టిట్యూట్ అఫ్ ఇంజనీర్స్ ఇండియా ప్రెసిడెంట్ వి.బి.సింగ్ అన్నారు. మంగళవారం ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా బోర్డ్ అఫ్ మేనేజిమెంట్ సమావేశానికి ముఖ్య అతిథిగా వి.బి.సింగ్ హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా స్థాపన ఉద్దేశాలను వివరించారు. నాడు పలు రాష్ట్రాలు పోటీ పడినప్పటికీ, నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాద్ లోనే ఈ సంస్థను స్థాపించాలని గట్టి నిర్ణయం తీసుకుని ఇందుకు అవసరమైన స్థలాన్ని కూడా 1981లోనే కేటాయించడంతో, అప్పటి రాష్ట్రపతి డాక్టర్ ఆర్.వెంకట్‌రామన్ భూమి పూజ చేసారన్నారు. ఈ 45 యేళ్లల్లో దేశంలోని కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పనిచేసున్నవేలాది మంది ఇంజనీర్లకు ఇంజనీరింగ్ విద్యలో ఎప్పటికపుడు వస్తున్న నూతన సాంకేతికత విధానంపై ఓరియెంటేషన్ తరగతులు నిర్వహిస్తూ వారిలో నూతన ఉత్సాహానికి, దేశ అభివృద్ధికి ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా బాటలు వేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న కాలేజ్ డైరెక్టర్ డాక్టరు జి. రామేశ్వర్‌రావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ విద్య ఒక్కటే కాకుండా దేశంలోని పలు ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాల ఉత్పత్తులను పెంచడంలో ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా కన్సల్టెన్సీ సేవలను అందిస్తున్నదని, కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ భారత్, స్కిల్ డెవలప్‌మెంట్, జల్ జీవన్ మిషన్‌లకు కూడా ఎస్కి తమ సేవలను అందిస్తూనే, మార్కెటింగ్ స్కిల్స్‌కు అందిస్తున్నామన్నారు. సమావేశంలో హెడ్స్ ఆఫ్ ది డిపార్టుమెంట్స్ డాక్టరేట్స్ సి.ఎస్ కృష్ణప్రసాద్‌రావు, ఆర్.వెంకట్‌రెడ్డి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-II
1ST FLOOR, TRIVENI COMPLEX, ABIDS, AT: HYDERABAD
O.A. No. 74 OF 2025
ICICI BANK LIMITED ...Applicant
AND
SHAIK ABDUL NABI ...Defendant(s)
SUMMONS BY WAY OF PAPER PUBLICATION
1. SHAIK ABDUL NABI
D/O. SHAIK MASTHAN VALI, Age 33, Occ: Business, H. No. 16-2-742/ E/3, Flat No. 203, Venkatadri Nagar, ASMAN GADH Malakpet, Hyderabad-500036 TS
...Defendants
Please take the summons in the above O.A. No. 74 OF 2025 filed by the Applicant for Recovery of money Rs. 36,63,354.82 Ps/- against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "VARTHA" a Telugu Daily newspaper, and posted the matter on 30.04.2025.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants, are directed as under;
(I) To show cause within thirty days of the service of summons as to why the relief prayed for should not be granted;
(ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the Original application;
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other pending hearing and disposal of the application for attachment of properties;
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of assets over which security interest in created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal;
(v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets of other assets and properties' in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 30.04.2025 at 10.30 am at Debts Recovery Tribunal-II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad - 500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default, the Application will be heard and determined in your absence.
8th day of April, 2025.
(By order of the Court)
Asst. Registrar
Debts Recovery Tribunal-II, Hyderabad

# వరి ఉత్పత్తిలో ఈ యేడాది తెలంగాణ దేశంలోనే అగ్రగామి

## వ్యవసాయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన సదస్సులో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్ (అత్తాపూర్) ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** రాష్ట్రం నుంచి తొలిసారి ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతి అవుతున్న నేపథ్యంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బియ్యం ఎగుమతి విధానం అన్న అంశంపై మంగళవారం ఒకరోజు సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే వరి ఉత్పత్తిలో ఈ యేడాది తెలంగాణ అగ్రగామిగా నిలిచిందని అన్నారు. ప్రస్తుత 2025-26 లో రాష్ట్రంలో సుమారుగా 280 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి అయిందని ఇది ఒక రికార్డు అని చెప్పారు. ఈ ఘనతకు రైతుల కృషితోపాటు, అనుకూలమైన వాతావరణ పరిస్థితులు ప్రకృతి సహకారం, నూతన వరి రకాలు అందుబాటులో ఉండటం కారణం అన్నారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ రైతాంగాన్ని అభినందించారు. రైతాంగానికి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందనీ.. సన్న రకాలకు క్వింటాల్‌కు 500 రూపాయల బోనస్ తో పాటు ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వివరించారు. రాష్ట్ర ప్రజల స్థానిక అవసరాలకు పోను, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్నబియ్యం పంపిణీ కోసం ఉద్దేశించిన బియ్యం పోను, కేంద్ర నిలువల కోసం సుమారు 60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయింపు లు పోగా ఇంకా సుమారు 50 నుంచి 60 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం రాష్ట్రంలో మిగులు ఉంటుందని ఆయన అన్నారు. మిగులు ధాన్యం మార్కెట్ చేయడానికి అన్వేషణ్లో భాగంగా ఆగ్నేయ ఆసియా ప్రాంతంలోని ఫిలిప్పైన్స్ కు తెలంగాణ బియ్యాన్ని ఎగుమతి చేయడాన్ని సదావకాశంగా తీసుకొని ఆ ప్రభుత్వంతో నేరుగా అవగాహన ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. ఈ ఒప్పందంలో భాగంగా ఏడాదికి 10 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యాన్ని ఎగుమతి చేసే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. దొడ్డు రకాలలో ముఖ్యమైన ఎం టీ యూ 1010, ఐ. ఆర్64 రకాలను రాష్ట్రంలో విస్తృతంగా సాగు చేస్తున్నారని..వీటికి ఫిలిప్పీన్స్ లో అధిక డిమాండ్ ఉందని తెలిపారు. వరి సాగు లో ఇటీవల రైతాంగంలో ఆదరణ పొందుతున్న వరి నేరుగా విత్తే పద్ధతి(డి ఎస్ ఆర్) రోజు విడిచి రోజు నీరు పెట్టే విధానం(ఎ డబ్ల్యూ డి), తక్కువ రసాయనాలు కలిగిన వరి రకాలను ఉత్పత్తి చేయడంపై రైతులను ప్రోత్సహించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలకు మంత్రి సూచించారు. అదేవిధంగా ఎగుమతికి అనుకూలమైన వరి రకాలను ఉత్పత్తి చేయడానికి రైతులకు తగిన ప్రోత్సాహకాలు, ఎగుమతి దారులకు విధానపరమైన ప్రోత్సాహకాలు ఇస్తామని ఆయన ప్రకటించారు. అధునాతన బియ్యం మిల్లులను ఒక డెమో రూపంలో ఆధునిక రైస్ మిల్లును వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసి రైతులకు, యువతకు శిక్షణ ఇచ్చి ఆధునిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ ఫిలిప్పీన్స్ దేశం ఎప్పటికీ దిగుమతి చేసుకునే దేశమేనని.. ఎన్నటికీ స్వయం సమృద్ధి సాధించే దేశం కాదు కాబట్టి ఆ దేశాన్ని తెలంగాణ బియ్యానికి అనుకూలమైన మార్కెట్ గా గుర్తించి ఆ దిశగా చర్యలు తీసుకున్నట్లయితే తెలంగాణలో పండుతున్న బియ్యం నిల్వలకు శాశ్వత పరిష్కారం దొరికినట్లేనని చెప్పారు. అఖిలభారత రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బి కృష్ణారావు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు, అపెడా అధికారులు, రైతు నాయకులు, విశ్వ విద్యాలయ శాస్త్రవేత్తలు, పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

వార్త


లక్ష్యం మీద చూపించే శ్రద్ధ, దాన్ని సాధించే సాధన విధానాల మీద కూడా చూపించినప్పుడే లక్ష్య సిద్ధి జరుగుతుంది.

-డబ్ల్యు ఎమర్సన్

# ముందడుగు


విజయ్‌మాల్యా, మోహల్ చోక్సీ, నీరవ్‌మోడీ, లలిత్ మోడీ వీళ్లెవరూ భారతీయ ఆత్మలు కాదు. లాభ సాటి వ్యాపారాలతో బాగా గడించి దేశ సరిహద్దులుదాటి మరో దేశంలో దాగిఉన్నవారే. స్వదేశంలో బాగా ఆర్జించాక వారి లొసుగులు వీరి విలాసాలు ఒక్కొక్కటి బయటపడే సరికి ముఖం చాటేశారు. భారత దేశ ఆర్థిక సంపదను కొల్లగొట్టి విదేశాలకు పారిపోయి దాక్కున్నవారే. ఇప్పుడు ఒక్కరొక్కరే కలుగులోంచి బయటపడుతున్నారు. కొందరు ఆర్థిక నేరగాళ్లయితే, కొందరు దేశ వినాశనానికి విధ్వంస రచన చేసినవారు, వీళ్లను ఇండియాకు రప్పించడంలో కాస్తంత జాప్యం జరిగినా భారతీయ దౌత్యనీతి వారిని భారతీయ జైళ్లలో కూర్చో బెట్టగలిగింది. విజయ్ మాల్యా ఒకప్పటి లలిత్ మోడీ భారతీయ వాణిజ్యవర్గాల్లో బాగా పేరొందిన వారే. ప్రధానంగా ఆర్థిక నేరస్థులుగా ప్రకటితమయిన వారు బ్యాంకులను మోసగించారు. నిన్నగాక మొన్న బెల్జియంలో అరెస్టు అయిన వజ్రాల వ్యాపారి మోహుల్ చోక్సీ పంజాబ్ నేషనల్ బ్యాంకును వేల కోట్ల మేరకు మోసం చేశారు. భారత దర్యాప్తు సంస్థలు సిబిసి ఐడి, ఇడి అభ్యర్థన మేరకు చోక్సీని బెల్జియం పోలీసులు అరెస్టు చేశారు. దాదాపు రూ.13,800 కోట్లకుపైగా మోసం చేసినట్లు అభియోగాలున్నాయి. చిన్నచిన్న రుణాలకే వెంటపడి వేధించి వసూలు చేసే బ్యాంకులు, భారీ ఎత్తున గ్యారెంటీలు రాయించుకునే బ్యాంకులు ఎందుకంత ఉదాసీనంగా వ్యవహరించాయో ఆ లోగుట్టు పెరుమాళ్లకే ఎరుక. 2018లో చోక్సీ అతని మేనల్లుడు నీరవ్ మోడీలిద్దరూ బ్యాంకు కుంభకోణాలు బయటపడగానే పారిపోయారు. ఆశ్రయించిన దేశాల పౌరసత్వాన్ని కూడా పొందగలిగారు. చోక్సీ ఆంటిగ్వాబార్బుడా పౌరసత్వం సాధించారు. దాంతో ఆ దేశ విదేశాంగ మంత్రి ఈఫీ ఛెత్‌గ్రీన్‌తో భారతదేశ దౌత్యాధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇది తెలవగానే చోక్సీ బెల్జియం పౌరసత్వాన్ని పొందారు. ఇలా నేరస్థులకు దొరికినన్ని దారులు తక్కువేమీ కాదు. ఎన్నిదారులు వెతికినా అవన్నీ తప్పుడు పత్రాల సృష్టి ద్వారానే అన్నది విశదమే. చోక్సీ ఇప్పటికి భారతీయ పౌరుడే. ఇలా బహుళ పౌరసత్వంలో ఉన్నవారికి ప్రయోజనాలు అన్ని విధాలే. ఆయన మేనల్లుడు నీరవ్ మోడీ ప్రస్తుతం లండన్ జైల్లో ఉన్నాడు. పంజాబ్ నేషనల్ బ్యాంకు స్కామ్ విజిల్ బ్లోయర్ హరిప్రసాద్ ఈ సందర్భంగా అభినందనీయుడు. భారతీయ దర్యాప్తు సంస్థలు విశ్వప్రయత్నం చేస్తే కొందరు ఆర్థిక నేరగాళ్లు బయటి కొస్తున్నారు. వారు దోచుకున్న బ్యాంకుల సొమ్మును కక్కించడమొక్కటే ముందుంది. ఖరీదైన న్యాయవాదులు ఇప్పటికే ఈ నేరస్తుల తరపున వకాల్తా పుచ్చుకుని వీళ్లె వరూ జైలు ఊచలు లెక్కించకుండా 'రోగాల పాట' మొద లెట్టేశారు. శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలన్నట్లు ఆర్థిక నేరస్థులంతా ఎన్నో అవకాశాలను అందిపుచ్చుకున్నా చివరికి చట్టం చేతికి దొరకక తప్పలేదు. పైగా ఖజానాలను బొక్కే సిన ఆర్థిక నేరస్థులకు అరదండాలు తప్పవని సాక్షాత్తూ ప్రధాని నరేంద్రమోడీ నిష్కర్షగా చెప్పనే చెప్పారు. ఇక ఆలస్యమేముంది. వాళ్లంతా దర్యాప్తు సంస్థల గాలానికి దాదాపు చిక్కినట్లే. 2020లో బెల్జియం భారత్ ఖైదీల మార్పిడి ఒప్పందాన్ని ప్రధాని మోడీ కొనసాగించడంతో చోక్సీ భారత్ దర్యాప్తు సంస్థలకు చిక్కారు. క్యాన్సర్ చికిత్స పేరిట తప్పించుకునే ప్రయత్నాన్ని భారత్ నిలువరించాలి. మానవ హక్కులు, రాజకీయ వేధింపులు, అక్రమ అరెస్టులు, అనారోగ్య సమస్యలు వంటి సవాలక్ష కారణాలు ఇలాంటి నేరస్థులను తాత్కాలికంగా రక్షిస్తూంటాయి. విచారణకు చిక్కకుండా శిక్షల వరకు రాకుండా కాపాడుతుంటాయి. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ వ్యవస్థాపకుడు విజయమాల్యా ఎట్టకేలకు భారతీయ బ్యాంకులకు కుచ్చుటోపీ పెట్టిన సొమ్ములో కొంత మొత్తాన్ని కట్టేందుకు అంగీకరించారన్న సమాచారం వినవచ్చింది. కింగ్ ఫిషర్స్ ఎయిర్‌లైన్స్ నడపడం కోసం బ్యాంకుల నుండి మోసపూరిత లావాదేవీల్లో భాగంగా రూ.9.990 కోట్లు అవినీతికి పాల్పడ్డారు. నిధులు విదేశాలకు తరలింపు, నిధుల దుర్వినియోగం ఆయనపై మోపబడిన నేరాలు. ఆయనపై బ్రిటన్‌లో దివాలా ప్రక్రియ నిరాకరించారు. ప్రస్తుతం బ్రిటన్‌లో ఉన్న విజయ్‌మాల్యాపై రూ.11,291 కోట్ల మేరకు విలువైన ఆర్థిక నేరాలున్నాయి. బిసిసిఐ మాజీ ప్రెసిడెంట్ లలిత్ మోడీపై రూ.3000 కోట్ల విలువైన ఆర్థిక అవకతవకల కేసులు ప్రధానంగా విదేశీ మారక ద్రవ్య ఉల్లంఘనల కేసుల్లో 16 చార్జిషీట్‌లు నమోదయ్యాయి. బోర్డు ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా (బిసిసిఐ)లో రూ. 468 కోట్ల మేరకు నిధులు దుర్వినియోగపరిచారు. మరో విదేశీ ఉల్లంఘనకేసు కూడా వెరశి రూ.5100 కోట్ల జరిమానా వేయదగిన కేసుల్లో నేరస్థుడు. కానీ భారతదేశం నుంచి తప్పించుకొని విదేశాల్లో తిరుగుతున్నాడు. లలిత్ మోడీ పనామా పాస్ట్ పోర్టు రద్దు, వంటి చర్యలు మాత్రమే అమలు జరిగాయి. ఇంటర్‌పోల్ రెడ్‌కార్నర్ నోటీసులను 2017లోనే తిరస్కరించింది. తమకు వీలైన దారుల్లో వీరు దాక్కోవడం గమనించదగిన విషయం. ఇటీవల మోడీప్రభుత్వం సాధించిన విజయమేమిటంటే భారత్‌లోని ముంబయిలో జరిగిన విధ్వంస రచనకు బాధ్యుడైన తహవూర్ రణానానుఅరెస్టు చేసి విచారణలోకి దింపడం, వీటన్నిటిపై ప్రాసిక్యూషన్ నిరూపించగలిగి ప్రభుత్వ ఖజానాకు బ్యాంకుల నుండి కాజేసిన మొత్తాన్ని తిరిగి వసూలు చేయగలిగితే భారత ప్రభుత్వం విజయం సాధించినట్టే!

మన శక్తియుక్తుల్ని మానవ కళ్యాణానికి వినియోగించాలి. వినాశనానికి కాదు.



షేక్స్పియర్

మాట్లాడిన మాట, వదిలిన బాణం, జరిగిన కాలం, వదులుకున్న అవకాశం ఈ నాలుగు వెనక్కిరావు.



ప్లినీ

# రాతను మార్చే మూల్యాంకనం

**ఉపాధ్యాయులు లేదాపట్టభద్రులే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వేసిన ఓట్లు మునిగిపోతున్న రోజులివి. మనం ఎవరిని పరీక్షిస్తున్నాము ఎందుకు పరీక్షిస్తున్నాము ఏ విధంగా పరీక్షిస్తున్నాము అనే విషయాలు తెలియనంత కాలం పరీక్షలు, వాటి మూల్యాంకనం, ఫలితాలు అన్ని ఒక ప్రహసనంగానే నిలిచిపోతాయి. దారుణమైన మూల్యాంకనానికి విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఎంతో మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. జవాబు ఎన్ని పేజీలు రాశాడో చూసి మార్కులు వేయడం, జవాబు పత్రం బరువును చూసి మార్కులు వేయడం, ఇంగ్లీష్ మీడియం పేపర్లు తెలుగు మీడియం టీచర్లు దిద్దడం, తెలుగు మీడియం పేపర్లు ఇంగ్లీష్ మీడియం బోధించే టీచర్లు దిద్దడంలాంటి అసంబద్ధమైన విషయాలు మూల్యాంకనంలో చోటు చేసుకుని విద్యార్థులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుంది. ఈప్రక్రియలు అన్నింటినీ సజావుగా లోపరహితంగా పూర్తి చేసి ఫలితాలు ప్రకటిస్తే విద్యార్థిలోకం నిజంగా హర్షిస్తుంది.**

శ్రీ శ్రీ కుమార్

మనదేశంలో పరీక్షలు ఒక ప్రహసనం లాంటివి. ఏడాది పొడుగునా చదివిన విద్యార్థి తెలివితేటలు కేవలం ఒక మూడు గంటల్లోనే పరీక్షించబడి అతడి భవిష్యత్తు నిర్ణయించబడుతుంది. పరీక్షలు సక్రమంగా నిర్వహిస్తే ఆ ప్రభుత్వం 'పాస్' అయినట్లే. అదేమి విచిత్రమో ప్రశ్నాపత్రం చాలా రహస్యంగా తయారు చేయించి ముద్రించినా కొన్ని కార్పొరేట్ సంస్థలకు అంతే రహస్యంగా చేరి వారి విద్యార్థులకు అత్యధిక మార్కులు వచ్చే విధంగా నెట్వర్క్ జరుగుతుంది. ఇక పరీక్షాహాల్లో పరీక్ష నిర్వహణ కూడా ఒక 'పథకం ప్రకారం జరుగుతుంది. తనిఖీకి వచ్చిన అధికారులు పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని మాత్రమే ప్రకటిస్తారు. సజావుగా జరుగుతున్నట్లు చెప్పరు. ఇక మూల్యాంకన దశ మొదలవుతుంది. అనుభవమున్న ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు లేదా అధ్యాపకులు ముఖ్యంగా 10వ తరగతి బోధిస్తున్న లేదా ఇంటర్మీడియట్ బోధిస్తున్న వారిని ఎగ్జామినర్లుగా నియమించాలి. ఈ ప్రక్రియలో కొందరు సిబ్బంది తమకు ఆరోగ్యం బాలేదని ఇంకా రకరకాల వ్యక్తిగత కారణాలతో స్పాట్ నుండి మినహాయింపు కోరుతారు. కొందరు మాత్రం అర్హత లేకపోయినా సదరు సబ్జెక్టు బోధించకపోయినా 'మేనేజ్ చేసుకుని మూల్యాంకనానికి హాజరవుతారు. ప్రభుత్వమేమో పరీక్షలు పూర్తయిన వెంటనే మూల్యాంకనం ప్రారంభించి కేవలం 40రోజుల్లోనే ఫలితాలు ప్రకటిస్తామని చెబుతుంది. ఎగ్జామినర్లు రోజుకు నిర్దిష్ట సంఖ్యలో జవాబు పత్రాలు దిద్దవలసి ఉంటుంది. కానీ క్యాంపు అధికారులు వారిపై ఒత్తిడి చేసి అంతకుమించిన సంఖ్యలో జవాబు పత్రాలు దిద్దిస్తారు. ఫలితంగా తప్పులు దొర్లుతాయి. ఎగ్జామినర్లకు 'కీ' పేపర్ ఎప్పుడు ఇవ్వరు. కేవలం ప్రతి ప్రశ్నకు రాయాల్సిన జవాబులో ఉండవలసిన పాయింట్ల (దాన్నే ప్రిన్సిపుల్స్ ఆఫ్ వాల్యుయేషన్ అంటారు) ప్రకారంగా జవాబు పత్రాల మూల్యాంకనం జరగాలి. అంటే కచ్చితంగా సబ్జెక్టు బోధించినవారు మాత్రమే అభ్యర్థికి సరియైన న్యాయం చేయగలుగుతారు. కానీ ఇతరులు దిద్దినట్లయితే ఏమైనా జరగవచ్చు. బాగా రాసిన అభ్యర్థికి తక్కువ మార్కులు వేయవచ్చు, సరిగ్గారాయని అభ్యర్థికి ఎక్కువ మార్కులు వేయవచ్చు. ఏ అద్భుతమైన జరగవచ్చు. ఒక్కొక్కసారి ప్రశ్నకు కేటాయించిన మార్కుల కన్నా ఎక్కువ మార్కులు కూడా వేసిన సందర్భాలున్నాయి. ఎగ్జామినర్లు దిద్దినజవాబు పత్రాల్లో కొన్నింటినీ వారి పైన ఉండే చీఫ్ ఎగ్జామినర్లు దిద్దుతారు. ఇంటర్మీడియట్‌లో అయితే సబ్జెక్ట్ ఎక్స్పర్ట్‌కూడా ఉంటారు. జవాబు పత్రాలు అన్నింటినీలోను మార్కుల మొత్తాన్ని సరిచూచేవారు కూడా ఉంటారు. ఇంత మందిని దాటి కూడా తప్పులు జరుగుతున్నాయి. కొన్నేళ్లుగా తమకు వచ్చిన మార్కులపై సందేహాలు ఉన్న వారు తమ జవాబు పత్రాల జిరాక్స్ కాపీలు తెప్పించుకొని తమకు అన్యాయం జరిగిందని నిర్ధారించుకొని రివాల్యుయేషన్‌లో ఎక్కువ మార్కులు పొందిన వారు వందల్లో ఉంటున్నారు. రీవాల్యుయేషన్లో అంతరం ఎక్కువగా ఉన్నట్లయితే సదరు ఎగ్జామినర్‌కు కొంత శిక్ష ఉంటుంది. అందుకు భయ పడి ఎగ్జామినర్లు ఇతోధికంగా ఇబ్బడిముబ్బడిగా యధేచ్ఛగా మార్కులు వేయడం కూడా చూస్తున్నాం. ఒకప్పుడు పదవ తరగతి తెలుగు మీడియం ఆంగ్ల ప్రశ్నపత్రంలో ఒక పేరాగ్రాఫ్ కింద ఆరువాక్యాలు ఇచ్చి అందులో సరియైన మూడింటిని గుర్తించమని ప్రశ్న ఉండేది. కొందరు అన్ని వాక్యాలు సరియైనవేనని టిక్ పెట్టినట్లయితే వాటికి కూడా మార్కులు వేయమని చెప్పిన ప్రబుద్ధులు ఉన్నారు. నేటి పరీక్షా విధానం ఏ విద్యార్థి కూడా ఫెయిల్ కాకూడదు అనే ఒక విశాల దృక్పథంతో తయారయింది. అందుకే ఈరోజుల్లో ఫెయిల్ కావడం చాలా కష్టమైనపని. మూల్యాంకన ప్రక్రియ చాలా జటిలమైనది. ఎగ్జామినర్లు ఎంతో శ్రద్ధతో



ఏకాగ్రతతో చేయవలసిన పని. ఏరకమైన ఆటంకాలు, ఇంకా బయట నుండి అలజడులు లేకుండా దూరంగా ప్రశాంతమైన వాతావరణంలో జరగాలి. బయట వ్యక్తులు ప్రవేశించకూడదు. వారి ప్రమేయం ఉండకూడదు. అందుకు తగిన వాతావరణం కల్పించవలసిన బాధ్యత మూల్యాంకనం సజావుగా జరిపిం చవలసిన బాధ్యత క్యాంపు అధికారులదే. మొబైల్ కూడా వాడకూడదు అనే నియమం కేవలం కాగితాలకే పరిమితమైంది. ఇంత మందిని దాటి ఫలితాల్లో తప్పులు దొర్లుతున్నాయి అంటే అది మూల్యాంకన సిబ్బందిపైన సంబంధిత అధికారుల ఒత్తిడి మాత్రమే కారణం. గతంలో కొన్ని సబ్జెక్టుల జవాబు పత్రాలు అనుభవమున్నవారు ఎవరైనా దిద్దవచ్చు. సదర సబ్జెక్టు బోధనలో వారికి నైపుణ్యం, అవగాహ న లేకపోయినా పర్లేదు. ఇంటర్మీడియట్ స్థాయిలో కూడా అడపాదడపా ఆర్ట్స్ బోధించే అధ్యాపకులు సైన్స్ జవాబు పత్రాలు దిద్దడం మనం చదివాం. ఫలితాలు త్వరగా ప్రక టించినంత మాత్రాన అధికారులకు అవార్డులు రావు. ఏ మాత్రం లోపాలు లేకుండా మూల్యాంకనం జరగడం విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడడం చాలా ముఖ్యం. ఆశించిన ఫలితాలు కానీ సున్నిత మనస్కులైన అభ్యర్థులు ఆత్మహత్యలకు పాల్పడిన సందర్భాలు అనేకం. లోప భూయిష్టమైన మూల్యాంకనానికి అమూల్యమైన జీవితాలు కోల్పోయిన విద్యార్థులు ఎందరో? భవిష్యత్తుపై ఎన్నో ఆశ లు పెట్టుకున్న విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఆశాభంగం చెందిన సంఘటనలు ఎన్నో. నిన్న మొన్న ఆంధ్రప్రదేశ్‌లో ప్రకటించిన ఇంటర్ ఫలితాల్లో అన్ని సబ్జెక్టుల్లో 90శాతం పైగా మార్కులు సాధించి ఆంగ్లంలో కేవలం ఐదుమార్కులు రావడం నిర్లక్ష్యమా లేక మానవ తప్పిదమా? అదే అమ్మా యికి మొదటి సంవత్సరం ఆంగ్లంలో 94మార్కులు సాధిం చడం గమనార్హం. ఇంటర్ లేదా డిగ్రీఅడ్మిషన్లు దాదాపు ఆగస్టు సెప్టెంబర్ వరకు జరుగుతూనే ఉంటాయి. పోటీ పరీక్షలకు ఈ ఫలితాలు ఏమి అడ్డంకులుకావు కానీ ప్రభు త్వాలకు అధికారులకు తొందర ఎక్కువ. ఆదరా బాదరాగా పేపర్లు దిద్దించి అతి తక్కువ కాలంలోనే ఫలితాలు ప్రకటించాలనే తొందరలో జరిగే పొరపాట్లు విద్యార్థులకు గ్రహపాటుగా మారడం శోచనీయం. చివరికి ట్యాబులేషన్ దశలోనూ ఘోరమైన తప్పులు జరగడం విద్యార్థుల వారి తల్లిదండ్రుల ఆకాంక్షలకు గొడ్డలి పెట్టుగా మారుతుంది. పరీక్షల నిర్వహణ మూల్యాంకనం ఈ రెండుప్రక్రియలు సరిగా జరగకపోతే విద్యార్థుల భవిష్యత్తు తారుమారు కావచ్చు. అగమ్యగోచరం కావచ్చు. వారు కొన్నిసార్లు తీవ్రమైన చర్యలకు పాల్పడవచ్చు. వీటిలో నిర్లక్ష్యం, ఉదాసీనత పనికిరావు. వీటిని ఒక యజ్ఞంలాగా మాత్రమే నిర్వహించాలి. సున్నితమైన విద్యార్థుల మనసులపై ఏరకమైన దుష్ప్రభావంపడకూడదు. ఏమాత్రం ఆదమరిచి ఉన్నా అది తీవ్రపరిణామాలకు దారితీస్తుంది. పరీక్షలు వాయిదాపడవచ్చు, తిరిగి నిర్వహించవలసిన అగత్యం ఏర్పడవచ్చు. ఈ పరీక్షల తర్వాత పోటీ పరీక్షలకు తయారయ్యే విద్యార్థులపై అది దారుణమైన ప్రభావాన్ని చూపవచ్చు. గతవారం ఒక రాష్ట్రంలో నిర్వహించిన పరీక్షలన్నీ రద్దుచేసి మళ్లీ నిర్వహించుతామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం సిగ్గుచేటు. ఎంబిబిఎస్ లాంటి ఉన్నతమైన వృత్తి విద్యా కోర్సుల్లో కూడా కాపీయింగ్ జరగడం దారుణం. వ్యాపం కుంభకోణం ఇంకా మన కళ్ల ముందు నుంచి చెదిరిపోలేదు. మార్కులే ప్రమాణంకాదు. ఫలితాలే గీటురాయి కాదు. పరీక్షలే జీవితానికి అంతిమ పరీక్షలుకావు. అసలు నాలుగవ తరగతి పూర్తి చేసిన విద్యార్థికి ఓఎంఆర్ జవాబు పత్రం ఇచ్చి అతని తెలివిని పరీక్షిస్తున్నామా లేదా అతని సాంకేతిక పరిజ్ఞానాన్ని పరీక్షిస్తున్నామా అనేది విజ్ఞులు ఆలోచించాలి. ఉపాధ్యాయులు లేదాపట్టభద్రులే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వేసిన ఓట్లు మునిగిపోతున్న రోజులివి. మనం ఎవరిని పరీక్షిస్తున్నాము ఎందుకు పరీక్షిస్తున్నాము ఏ విధంగా పరీక్షిస్తున్నాము అనే విషయాలు తెలియనంత కాలం పరీక్షలు, వాటి మూల్యాంకనం, ఫలితాలు అన్ని ఒక ప్రహసనంగానే నిలిచిపోతాయి. దారుణమైన మూల్యాంకనానికి విద్యార్థులు వారితల్లిదండ్రులు ఎంతో మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. జవాబు ఎన్నిపేజీలు రాశాడో చూసి మార్కులు వేయడం, జవాబు పత్రం బరువును చూసి మార్కులువేయడం, ఇంగ్లీష్ మీడియం పేపర్లు తెలుగుమీడియం టీచర్లుదిద్దడం, తెలుగు మీడియం పేపర్లు ఇంగ్లీష్ మీడియం బోధించే టీచర్లు దిద్దడంలాంటి అసంబద్ధమైన విషయాలు మూల్యాంకనంలో చోటుచేసుకుని విద్యార్థులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుంది. విద్యార్థుల చేతిరాతచూసి కూడా మార్కులు వేస్తే అవి వారి తలరాతను మారుస్తున్నాయి. ఈప్రక్రియలు అన్నింటినీ సజావుగా లోపరహితంగా పూర్తి చేసి ఫలితాలు ప్రకటిస్తే విద్యార్థిలోకం నిజంగా హర్షిస్తుంది. ●

# ఆరోగ్యానికి ఆలంబన మాతాశిశు సంక్షేమం

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

ఆడ జన్మకు సార్థకత అమ్మతనం. కళ్ల ముందు నడిచే దైవం అమ్మ. పునర్జన్మను పొందిన మరో బిడ్డకు ప్రాణం పోసే అమ్మతనం మహిళలకు దేవుడిచ్చిన అపూర్వ అవకాశం. మాతృత్వం ఓ అద్భుత దైవకార్యంతో సమానం. ప్రాణాపాయం ఉంటుందని తెలిసి కూడా అమ్మతనమనే పేరును తెచ్చుకోవడానికి తాను గర్భిణిగా నవమాసాలు బిడ్డను మోసి, ప్రసవ వేదనను సంతోషంగా భరించి, కేరుకేరను ఏడ్చే నవజాత శిశువు స్వరాన్ని వింటూ నొప్పులను మరిచి మురిసిపోతుంది అమ్మ అయిన అతివ. గర్భిణిగా, ప్రసవంలో, ప్రసవానంతరం కూడా తల్లికి సురక్షిత ఆరోగ్యాన్ని అందించడం మన కనీస బాధ్యత. ప్రేమ, త్యాగం, అవధులు లేని ధైర్యంఅనే విలువలను ఇంధనాలుగా మలిచి మహిళ మాతృత్వాన్ని అనుభవిస్తుంది. ఒక సర్వే ప్రకారం ప్రపంచదేశాల్లో భారతీయ మహిళలు లేదాతల్లులు ప్రమాదకర వాతావరణాల్లో జీవితాలను గడుపుతున్నారని, ప్రపంచ గర్భిణి మహిళల మరణాల్లో 15 శాతం వరకు భారతంలోనే జరుగుతున్నట్లు తేలడం విచారకరం. సాలీనా 44,000 మంది మహిళలు ప్రసవానికి ముందు, ప్రసవ సమయంలో లేదా ప్రసవానంతరం సరైన వైద్యసేవలు అందని కారణంగా మరణిస్తున్నట్లు తెలుస్తున్నది. మన దేశగర్భిణులు, ప్రసవ సమయంలో లేదా ప్రసవంతర్వాత తల్లులు 12శాతం వరకు మరణిస్తున్నారని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ప్రపంచ వ్యాప్త తల్లుల మరణాలు 99 శాతం అభివృద్ధి చెందుతున్న దేశాల్లో జరగడం గమనార్హం. 190 నుంచి 2015 వరకు 44శాతం తల్లుల మరణాలు తగ్గడం, 2016 నుంచి 2030 వరకు ఒక లక్షతల్లుల్లో 70కన్న తక్కువ మరణాలునమోదు అయ్యేవిధంగా పలు కటుదిట్టమైన చర్యలుతీసుకోవడం జరుగుతున్నది. గ్రామీణ, పేదవర్గాలకు చెందిన మహిళలు అధికంగా ప్రమాదకర వాతావరణాల్లో బతుకులు ఈడ్చుడంజరుగుతున్నది. గర్భిణులు, ప్రసవ సమయం, ప్రసవానంతరం తల్లి, బిడ్డసురక్షకు నాణ్యమైన వైద్యఆరోగ్య సదుపాయాలు కల్పించడం ప్రభుత్వాల కనీసబాధ్యత అని తెలుసుకోవాలి. ఈ విధులకు సుశిక్షితులైన వైద్య సిబ్బందిని నియమించడం ప్రభుత్వాల కనీస కర్తవ్యం. మాతాశిశు సంక్షేమమే రేపటి ఆరోగ్యవంతమైన పౌరసమాజ స్థాపనకు పునాదులుగా తీసుకోవాలి. అమ్మతనం అమృతభావం. శిశువుకు తెలిసిన తొలి దైవం కన్నతల్లి మాత్రమే. ఇంట్లో కొలువైన అమాయకబాధ్య తగల ప్రేమ మూర్తి అమ్మ మాత్రమే. మాతృత్వం కోసం పరితపించే మహిళ నుంచి ప్రసవానంతర తల్లి వరకు అన్ని దశల్లో మాతృశిశు ఆరోగ్యాన్ని బలపరచడం మన కనీస బాధ్యత. అమ్మతనంపట్ల అవగాహన, తల్లులు లేదా గర్భిణులు తీసుకోవలసిన జాగ్రత్తలు, ప్రసవ సమయ సవాళ్లను అధిగమించడం, సురక్షిత ప్రసవం, ప్రసవానంతర చర్యలు తీసుకోవడంలాంటి అంశాలే కొనసాగాలి. అమ్మను ప్రసవ సమయంలో కోల్పోయిన బిడ్డలంత దురదృష్టవంతులులేరు. అమ్మ మనసు వెన్నంట మృదువు. అమ్మ ప్రేమ కలుషితం కాని అనుభవం. మాతృత్వానికి తలవంచి, నేటి భార్యను రేపటి తల్లిగా భావించి తగు జాగ్రత్తలు తీసుకుందాం. మాతాశిశు సంక్షేమానికి గొడుగు పడదాం. ●

# ప్రజావాక్కు



### ప్రజల మనసును గెలవాలి

ఏప్రిల్ 7వ తారీఖున అహ్మదాబాద్‌లో నిర్వహించిన ఎ.ఐ.సి.సి. సమావేశంలో రాహుల్ గాంధీతోబాటు అతిరథ మహారథులందరు పాల్గొన్నారు. దేశ సమస్యల మీద దృష్టిని పెట్టి పరిష్కారానికి మార్గాలు సూచించక కేవలం భారతీయ జనతా పార్టీ పరిపాలనను విమర్శించడంతోనే సమావేశం ముగిసింది. తెలంగాణా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనవంతు మాట్లాడిన విధానం నిజంగా కాంగ్రెసు పార్టీకిపునరుజ్జీవం పోసినట్టుగా చాలా బాగుంది. అయితే కొన్ని అపశ్రుతులు ఉన్నాయనిపిస్తోంది. మాది గాంధీ పరివార్ అయితే బిజెపిది గాడ్సే పరివార్ అనడం విన్నవారికి రుచించలేదు. చీటికి మాటికి పార్లమెంటులో గొడవలు చేయడం, వాకౌట్లు చేయడం పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటిదే. అందరి ప్రజల మనసులను గెలవాలి. కొన్నివర్గాల వారినిమాత్రమే సంతుష్టి పరచాలనుకుంటే మాత్రం అనుకున్న ఫలితాలు అందని ద్రాక్షే.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### మాతృభాషను కాపాడుకుందాం

ప్రభుత్వం ఇతర భాషలో మార్కులను దృష్టిలో ఉంచుకొని ఆలోచించడమే తప్ప తెలుగు భాషా ప్రావీణ్యాన్ని విద్యార్థులకి తెలుపలేకపోతుంది. ప్రపంచంలోనే రెండవ ఉత్తమ లిపిని కలిగిన తెలుగు భాషను మనం మరుగున పడేస్తున్నాం. ఇదంతా భాష మీద మనకున్న నిర్లక్ష్యంలా అనిపిస్తుంది. కావున భావితరాలకు తెలుగు భాషను అందించి మనం మన మాతృభాషను కాపాడుకుందాం.

-కాల్వ నిఖిత, సిద్దిపేట

### ఆహార పదార్థాల కల్తీ

**తెలుగు** రాష్ట్రాలలో ఆహార పదార్థాలు కల్తీ విపరీతంగా పెరిగి పోతూ వున్నది. ముఖ్యంగా హోటల్స్, బేకరీలు, ఫ్రై సెంటర్లలో ఎక్కువగా కల్తీపదార్థాలు విక్రయిస్తు వున్నారు. అవి తిన్నవారికి జీర్ణావస్థలో మార్పులు వచ్చి జీర్ణాశయం దెబ్బతినడం, అల్సర్లు, కాలేయ వ్యాధులు సంభ వించి మృత్యువాత పడుతూ వున్నారు. సంబంధిత ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు లేకపోవడం వల్లవారు ఇష్టానుసారం పదార్థాలు తయారు చేసి విక్రయిస్తువున్నారు. కల్తీ ఆహార పదార్థాల సెంటర్‌ల మీద దాడులు చేసివానిని సీజ్ చేయాలి.

-సి. సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### వృక్షో రక్షతి రక్షితః

శబ్ద, వాయుకాలుష్యంతో మానవుడు కకావికలం అవుతున్నాడు. ఇక పశుపక్ష్యాదుల సంగతి సరేసరి. ప్రకృతి అసమతుల్యత వైపుపయనిస్తూ ఆపదలతో విలయతాండవం చేస్తున్నా నరుడు మేలుకోలేదన్న విషయం ఆందోళనకరం. ఇది ముమ్మాటికి మానవ తప్పిదం. మనం ఎంత భయంకర వాతావరణంలో ఉన్నామనేది ఏదో ఒకచోట పుడమి తల్లి కన్నెర్ర కారణంగా తుఫాన్, సునామి రక్కసి విరుచుకుపడడమే ఇందుకు నిదర్శనం. అటవి సంపద, చెరువులు, భూగర్భజలాలు, ఇంకుడు గుంతలను పరిక్షించుకోవాలి. అభివృద్ధినెపంతో ఇష్టానుసారంగా పరిసరాల హాని తలపెట్టే పనులు ఇకనుంచి అయినా మానుకోవాలి. ప్రపంచ దేశాలకే పెను సవాళ్లుగా ఎదురవుతున్న గ్లోబల్ వార్మింగ్‌కై సమష్టి కృషితో ప్రయత్నించాలి.

- ఆర్.వెంకటేష్ చరన్, బెంగళూరు

### కార్పొరేట్ విద్యపై నియంత్రణ అవసరం

**ఇటీవల** కాలంలో దాదాపు ఒక రెండు దశాబ్దాల నుండి ప్రభుత్వ పాఠశాలలో జిల్లా పరిషత్తు మండల పరిషత్తు మేనేజ్మెంట్ పాఠశాలలో, మున్సిపల్ పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహాలను పూర్వ విద్యార్థులు, దాతలు ఇచ్చిన విరాళాలతో పాఠశాల ప్రాంగణాల్లో నిర్మిస్తూ ఉన్నారు. వాటితోపాటు స్వామి వివేకానందుడు సర్వేపల్లి రాధాకృష్ణ గౌతమ బుద్ధుడు మొదలగు విగ్రహాలను నిర్మిస్తూ ఉన్నారు. ఒక్కోసారి కళామతల్లివిగ్రహం, తెలుగు తల్లి విగ్రహం కూడా నిర్మిస్తూ ఉన్నారు. నిజానికి ఇలాంటివి నిర్మించేటప్పుడు సంబంధిత యాజమాన్యాలకు తెలియచేసి వారి అనుమతి తీసుకుని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చేయాలి. కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల యధేచ్ఛగా దోపిడీ చేస్తూ ఉన్నాయి. సందట్లో సెడేమియాగా ప్రైవేటు కార్పొరేటు వైద్యసంస్థలు ప్రజలను భయభ్రాంతులను చేస్తూదోపిడీ చేస్తూ ఉన్నాయి. వీటిని అరికట్టే బాధ్యత ప్రభుత్వాలకు లేదా?

-వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### ఉత్తమ ఉపాధ్యాయులను నియమించాలి

**ఉత్తమ** ఉపాధ్యాయుడు విద్యార్థులకు ప్రేరణ కలిగిస్తాడు. పాఠం చక్కగా ప్రిపేర్ అవుతాడు. విద్యార్థులను డౌట్స్ అడగమని ప్రోత్సహిస్తాడు. తరచుగా పరీక్షలు నిర్వహిస్తాడు. క్విజ్ నిర్వహిస్తాడు. ఆటలు ఆడిస్తాడు. జోక్స్, కథలు చెబుతాడు. బహుమతులు ఇస్తాడు. తక్కువ హోం వర్క్ ఇస్తాడు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తాడు.

-పుట్టూరి రాంనర్సింహా రెడ్డి, నల్లగొండ జిల్లా

మన వి | ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# తగ్గే డిమాండ్‌పై అంశాలన్నీ ప్రభావితమే!

డాక్టర్. పి.ఎస్. చారి

సాధారణంగా సమిష్టి డిమాండ్ (మొత్తం డిమాండ్) అంటే ఒక నిర్దిష్ట ధర వద్ద, ఒక నిర్దిష్టకాలంలో వస్తువులు, సేవలకు మార్పిడి చేయబడిన మొత్తం ద్రవ్యంగా వ్యక్తీకరించబడుతుంది. మొత్తం డిమాండ్‌ను సాధారణంగా వినియోగం, పెట్టుబడి, ప్రభుత్వ వ్యయం, నికర ఎగుమతులు వంటి నాలుగు వనరుల మొత్తంగావర్ణిస్తారు. ప్రపంచ సమిష్టి డిమాండ్ తగ్గడానికి దోహదపడే ప్రధాన అంశాలుగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం, జీవన వ్యయం వంటివి ఉన్నాయి. ప్రపంచ ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, జీవన వ్యయసంక్షోభం, ఇంధన ధరలు, వడ్డీరేటు పెంపుదల, ప్రపంచ పరపతి కఠినత్వం, కోవిడ్ మహమ్మారి పరిణామాలు, ముడి పదార్థాల కొరత, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, రష్యా ఉక్రెయిన్ యుద్ధం, వాణిజ్య అనిశ్చితి మొదలైనవి మొత్తం డిమాండ్ తగ్గడానికి కారణమవుతున్నాయి. ఇవేకాక వినియోగదారుల విశ్వాసం తగ్గడం, రుణస్థాయిలు పెరగడం, నిత్యావసర వస్తువులపై ఖర్చుతగ్గడం, ఉద్యోగ అభద్రత, వ్యాపార జాగ్రత్తలు వాతావరణ మార్పు వంటి పర్యావరణ అంశాలు సమిష్టి డిమాండ్ తగ్గడానికి కారణమవుతున్నాయి. సమిష్టి డిమాండ్ తగ్గడం వల్ల వాస్తవ స్థూలదేశీయోత్పత్తి, ఆర్థిక ఉత్పత్తి తగ్గే అవకాశం ఉంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి ప్రకారం 2025, 2026 సంవత్సరాల్లో ప్రపంచవృద్ధి 3.3 శాతంగా అంచనా వేయబడింది. ఇది చారిత్రక సగటు 3.7 శాతం కంటే తక్కువ. అభివృద్ధి చెందిన అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో మందగమనం ప్రపంచ డిమాండ్ బలహీనపడటానికి దోహదం చేస్తుంది. అమెరికా, యూరోపియన్ దేశాల నుండి చైనా, భారతదేశం బ్రెజిల్ వరకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న దేశాలు ద్రవ్యోల్బణం, వడ్డీరేటు పెంపుదల, ప్రపంచ సరఫరా గొలుసు అంతరాయాలు, భౌగోళిక రాజకీయ అనిశ్చితుల మిశ్రమం కారణంగా తగ్గుతున్న సమిష్టి డిమాండ్ సమస్యను ఎదుర్కొంటున్నాయి. భారతదేశంలో తగ్గుతున్న మొత్తం డిమాండ్‌ను ప్రభావితం చేసే అంశాలు అనేక ఇతర ఆర్థికవ్యవస్థల మాదిరిగానే భారతదేశం కూడాతగ్గుతున్న మొత్తం డిమాండ్ ద్వారా గణనీయంగా ప్రభావితమవుతుంది. భారతదేశంలో మొత్తం డిమాండ్లో తగ్గుదల ప్రధానంగా తగ్గిన వినియోగం, తగ్గిన పెట్టుబడి, తగ్గుతున్న ప్రభుత్వ వ్యయం, బలహీనమైన నికర ఎగుమతుల నుండి వస్తుంది. ఏ దేశమైనా దేశీయ వినియోగంపై ఎక్కువగా ఆధారపడి ఉంటుంది, ఇది దాని స్థూల దేశీయోత్పత్తిలో గణనీయమైన భాగాన్ని కలిగి ఉంటుంది. అందువల్ల, డిమాండ్‌లో ఏదైనా మందగమనం ఆర్థిక వ్యవస్థలోని అన్నిరంగాలలో భిన్నపరిణామాలను కలిగిస్తుంది. ఆర్థికమాంద్యం, పేదరికం, అసమానత, రాజకీయ అస్థిరత, ముఖ్యంగా బ్యాంకింగ్ రంగంపైప్రభావం, నిరర్థక ఆస్తులు వంటి విస్తృత ఆర్థికపరిణామాల కారణంగా భారత దేశం తగ్గుతున్న మొత్తం డిమాండ్ ద్వారా తీవ్రంగా ప్రభావితమవుతుంది. ఈప్రభావాలు ఉపాధి నుండి వ్యాపార



పెట్టుబడి, ఎగుమతులు, ఆర్థిక ఆరోగ్యంవరకు వివిధ రంగాలలో అలలురేపుతాయి. భారతదేశంలో మొత్తం డిమాండ్‌ను ప్రభావితం చేసే కీలక అంశాలు చూసినప్పుడు ద్రవ్యోల్బణ ఒత్తిడి ఫిబ్రవరి 2025లో 3.6శాతం ఇది కొనుగోలు శక్తిని తగ్గిస్తుంది, వినియోగాన్ని ప్రభావితంచేస్తుంది. రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్యోల్బణ ఒత్తిళ్లకు ప్రతిస్పందనగా వడ్డీ రేట్లను పెంచింది, ఇది ప్రైవేట్ పెట్టుబడి, వినియోగాన్ని తగ్గించవచ్చు. ప్రధాన ఆర్థికవ్యవస్థలలో అమెరికా, చైనా మందగమనం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, కొవిడ్ మహమ్మారి వంటి ప్రపంచ అంశాలు భారతదేశ ఎగుమతులు, పెట్టుబడి రాకపోకలు ద్రవ్యోల్బణంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయి. ప్రభుత్వ సంస్కరణలు వస్తువులుసేవల పన్ను మేక్‌ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత వంటి నిర్మాణాత్మక సంస్కరణలు దేశీయ తయారీ, పెట్టుబడి ఎగుమతులను పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. అయితే, వాటి పూర్తి ప్రభావాలు కార్యరూపం దాల్చడానికి సమయం పట్టవచ్చు. డిసెంబర్ 2024లో, భారతదేశంలో ప్రైవేట్ వినియోగం స్థూలదేశీయోత్పత్తిలో 64.8శాతం వాటాను కలిగి ఉంది. కొవిడ్ మహమ్మారి తర్వాత గ్రామీణ భారత దేశం గణనీయమైన కోలుకుంది. అయినప్పటికీ పట్టణ ప్రాంతాలు ఇప్పటికీ మొత్తం వినియోగంలో ఎక్కువ వాటాను కలిగిఉన్నాయి. అయితే, వ్యవసాయ ఇబ్బందులు, ఆదాయ అసమానత ఇతర నిర్మాణాత్మక సవాళ్ల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో వినియోగ వృద్ధి కొద్దిగా నెమ్మదిగా ఉంది. భారతదేశ రిటైల్ రంగం దేశస్థూల దేశీయోత్పత్తికి దాదాపు 10శాతం దోహదపడుతుంది. వచ్చే దశాబ్దంలో దాదాపు 9 10శాతం కాంపౌండ్ వార్షిక వృద్ధిరేటు వద్ద వృద్ధి చెందుతుందని అంచనావేయబడింది. 2032 నాటికి దాదాపు 2 ట్రిలియన్ల విలువను చేరుకుంటుంది. భారత దేశ వినియోగదారుల విశ్వాసం హెచ్చుతగ్గులకు లోనవుతోంది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, అధిక ఇంధన ధరలు ఉపాధి ఆందోళనల కారణంగా 2024లో వినియోగదారుల ఆశావాదం తగ్గినట్లు నీల్సన్ ఐక్యూ వినియోగదారుల విశ్వాస సూచిక చూపించింది. 2024లో, ఏప్రిల్ డిసెంబర్ కాలంలో భారత దేశ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 27శాతం పెరిగాయి. అయితే, అధిక నిష్క్రమణల కారణంగా నికర తగ్గింది. 2024-25 ఆర్థికసంవత్సరంలో, భారతదేశ ప్రభుత్వ వ్యయం 48.21 లక్షల కోట్లుగా అంచనా వేయబడింది. ఇది స్థూలదేశీయోత్పత్తిలో 19.4శాతం ఈభాగాలలో ఏదైనా తగ్గుదల సమిష్టి డిమాండ్ తగ్గడానికి దారితీస్తుంది. ఒక దేశం కేంద్రబ్యాంకు నియంత్రణలో ఉన్న ద్రవ్యవిధానం, రుణవ్యయాలు, పెట్టుబడి, వినియోగదారుల ఖర్చులను ప్రభావితం చేయడం ద్వారా మొత్తం డిమాండ్‌ను నేరుగా ప్రభావితం చేస్తుంది. ఉదాహరణకు అమెరికాలోని ఫెడరల్ రిజర్వ్, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ ఆర్థికవ్యవస్థను ఉత్తేజ పరిచేందుకు వారి బెంచ్ మార్క్ వడ్డీ రేట్లను తగ్గించవచ్చు. యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ ప్రతికూల వడ్డీరేట్లతో ప్రయోగాలు చేశాయి. ఆర్థికవ్యవస్థలో డిమాండ్‌ను ప్రత్యక్షంగా ప్రభావితం చేయడానికి ప్రభుత్వాలు ఆర్థికవిధానాన్ని ఉపయోగించవచ్చు. చైనా బెల్ట్ అండ్‌రోడ్ ఇనిషియేటివ్, 2021 అమెరికా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బిల్లు వంటిపెద్దస్థాయి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు మొత్తం డిమాండ్‌ను పెంచే లక్ష్యంతో ఆర్థిక ఉద్దీపన ప్రకటించాయి. ఈ ప్రభావాల తీవ్రత, సమిష్టి డిమాండ్ తగ్గుదల పరిమాణం విధాన రూపకర్తలు, ఇతర ఆర్థిక ఏజెంట్ల ప్రతిస్పందనలపై ఆధారపడి ఉంటుంది. ●

# ఎగుమతులు నిలిపివేసి చైనాషాక్

## ఆందోళనలో అగ్రరాజ్యం



**వాషింగ్టన్, ఏప్రిల్ 15:** అమెరికా–చైనాల మధ్య సుంకాల యుద్ధం కొనసాగుతోంది. చైనా ఉత్పత్తులపై టారిఫ్‌లను యుఎస్ 145 శాతానికి పెంచినట్లు ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. అందుకు ప్రతిగా చైనా కూడా అమెరికా ఉత్పత్తులపై సుంకాలను 125 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించింది. అంతటితో ఆగకుండా తమ దేశంలో లభ్యమయ్యే అరుదైన ఖనిజాలు, కీలకమైన లోహాలు, అయస్కాంతాలను యుఎస్‌కు ఎగుమతి చేయడాన్ని ఆపేస్తున్నట్లు బీజింగ్ పేర్కొంది. ఈ ప్రకటనపై అమెరికా స్పందించింది. ఖనిజాల ఎగుమతి విషయంలో చైనా తీసుకున్న నిర్ణయం ఆందోళనకరంగా ఉందని ట్రంప్ ముఖ్య ఆర్థిక సలహాదారుల్లో ఒకరైన కెవిన్ హాసెట్ పేర్కొన్నారు. టెక్నాలజీ, ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ రంగంలో ఈ ఖనిజాల అవసరం ఎక్కువగా ఉంటున్నాయి. డ్రాగన్ నిర్ణయాల పశ్చిమదేశాల్లో ఆయుధాలు, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, ఏరోస్పేస్ తయారీ, సెమీ కండక్టర్ల కంపెనీలకు సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ఈ అంశాన్ని నిశితంగా పరిశీలిస్తున్నామని.. వీటిపై డ్రాగన్‌తో చర్చలు జరిపే అవకాశం ఉందని తెలిపారు. అయితే ట్రంప్ విధించిన టారిఫ్‌ల వల్ల 100 శాతం మాంద్యం వస్తుందని తామేమీ అనుకోవట్లేదని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న అరుదైన ఖనిజాల్లో దాదాపు 90 శాతం చైనా నుంచే వెళుతున్నాయి. తాజాగా బీజింగ్ చేపట్టిన చర్యల ప్రభావం కేవలం అమెరికా వరకే పరిమితం కాదు.. అన్ని దేశాలపైనా ఉండనుంది. తొలుత చైనా ఉత్పత్తులపై టారిఫ్‌లను ట్రంప్ 54 శాతం పెంచడంతో కీలక విడిభాగాల ఎగుమతులను చైనా ఆపేసింది. మరోసారి అగ్రరాజ్యం సుంకాలను 145 శాతానికి పెంచడంతో అరుదైన ఖనిజాలు, కీలకమైన లోహాలు, అయస్కాంతాలు, ఇతర ఉత్పత్తులను ఎగుమతి చేయడం బీజింగ్ నిలిపివేసింది. దీంతోపాటు ఎక్స్‌పోర్ట్ లైసెన్స్‌లను పరిమితం చేసే అవకాశాలు కూడా ఉన్నాయి. అమెరికాలోని లాక్‌హీడ్ మార్టిన్, టెస్లా, యాపిల్ వంటి సంస్థలు చాలా ముడిపదార్థాలు కోసం బీజింగ్‌పైనే ఆధారపడుతున్నాయి. అమెరికా ప్రభుత్వం వద్ద రేర్‌ఎర్త్ మినరల్స్ నిల్వలు ఇప్పటికే ఉన్నాయి. కానీ, తమ డిఫెన్స్ కాంట్రాక్టర్లకు సరఫరా చేయడానికి మాత్రం ఇవి సరిపోవు. దీంతో అమెరికా ప్రభుత్వం చైనా చర్యలపై ఆందోళన వ్యక్తం చేస్తోంది. అయితే సుంకాల విషయంలో చైనాతో త్వరలో కీలక ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశం ఉన్నట్లు యుఎస్ ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ పేర్కొన్నారు.



# అయోధ్య గర్భగుడి శిఖరంపై ఎత్తయిన కలశం

**అయోధ్య, ఏప్రిల్ 15:** అయోధ్య రామాలయంలోని గర్భగుడి ప్రధాన శిఖరంపై 161 అడుగుల ఎత్తైన కలశాన్ని ప్రతిష్ఠించారు. వేద ఆచార్యులు ఈ మహత్తర కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. దీంతో జన్మస్థల సముదాయంలో నిర్మించిన ఆలయాలలో శబ్ద రుషుల ప్రతిష్ఠ కూడా పూర్తైంది. ఆలయ సముదాయంలో నిర్మిస్తున్న పరకోటలోని 6 దేవాలయాల పైభాగంలో కూడా కలశాన్ని మరికొద్ది రోజుల్లో ఏర్పాటు చేయనున్నారు. అందుకోసం ఆలయ నిర్మాణ కార్మికులు రాత్రింబవళ్లు పని చేస్తున్నారు.

**గర్భగుడి శిఖరం పని పూర్తి:** బైశాఖి పర్వదినం, డాక్టర్ భీమ్ రావ్ అంబేడ్కర్ జయంతి నాటికి శ్రీరాముడి ఆలయ గర్భగుడి శిఖరం పని పూర్తయిందని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్ రాయ్ తెలిపారు. సోమవారం ఉదయం 9.15 గంటలకు కలశ ప్రతిష్ఠ పూజలతో ప్రారంభింభమైందని చెప్పారు. ఉదయం 10.30 గంటలకు శిఖరంపై కలశ ప్రతిష్ఠ పూర్తైందని వెల్లడించారు. గర్భగుడి ప్రధాన శిఖరంపై 161 అడుగుల కలశం ఆలయ సముదాయంలోని పరకోట నిర్మిస్తున్న 6 దేవాలయాల పైభాగంలో కూడా కలశాలు ఏర్పాటు చేస్తాం. ఆలయంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో రామ్ లాల్లా కూర్చుని ఉన్నారు. మొదటి అంతస్తులో రామ్ దర్బార్ ఉంది. 6 ఆలయాలలో దేవతల విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. అంతేకాకుండా సత్య మందిరాలలో విగ్రహాల ప్రతిష్ఠ పూర్తయింది. మిగిలిన శేషావతార్ ఆలయం ఈ ఏడాది పూర్తవుతుందని చంపత్ రాయ్ తెలిపారు.

**రామాలయానికి బెదిరింపులు:** కాగా, అయోధ్య రామాలయానికి ఆదివారం రాత్రి బెదిరింపు మెయిల్ రావడం వల్ల కలకలం రేగింది. దీంతో అప్రమత్తమైన అధికారులు భద్రతను మరింత పెంచారు. అయితే, దీనిపై ఆలయ అధికారులు, పోలీసులు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ అధికారిక మెయిల్ ఐడీకి ఆదివారం రాత్రి బెదిరింపు మెయిల్ వచ్చినట్లు స్థానిక మీడియా తెలిపింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. ఇటీవల అయోధ్య రామాలయంలో శ్రీరామనవమి వేడుకలు గ్రాండ్‌గా జరిగాయి. శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగిన తర్వాత వచ్చిన రెండో శ్రీరామ నవమి కావడం వల్ల సంబరాలు అంబరాన్నంటాయి. రామయ్య దర్శనం కోసం దేశవిదేశాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. బాలరాముడి నుదిటిపై సూర్యతిలకం చూసి భక్తులు తన్మయత్వం చెందారు.



# అజిత్ సినిమా మేకర్స్‌కు ఇళయరాజా నోటీసులు

**చెన్నై, ఏప్రిల్ 15:** కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ లీడ్ రోల్‌లో తెరకెక్కిన లేటెస్ట్ మూవీ ‘గుడ్ బ్యాడ్ అగ్లీ’. డైరెక్టర్ అధిక్ రవిచంద్రన్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఈ నెల 10న రిలీజైన సినిమా మంచి టాక్ దక్కించుకుంది. దీంతో బాక్సాఫీస్ వద్ద డీసెంట్ వసూళ్లు సాధిస్తోంది. ఈ నేపథ్యంలో మేకర్స్‌కు షాక్ తగిలింది. ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా మేకర్స్‌కు లీగల్ నోటీసులు పంపారు. గతంలో ఆయన మ్యూజిక్ అందించిన మూడు పాటలను అనుమతి లేకుండా గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాలో వాడుకున్నారని నోటీసుల్లో పేర్కొన్నారు. అందుకుగానూ రూ.5 కోట్ల పరిహారం డిమాండ్ చేశారు. అంతేకాకుండా తక్షణమే సినిమా నుంచి ఆ పాటలను తొలగించి, క్షమాపణ చెప్పాలని కోరారు. అయితే దీనిపై మేకర్స్ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. కాగా గతేడాది ఓ మలయాళ సినిమాకు కూడా ఇళయరాజా లీగల్ నోటీసులు పంపారు. యుత్‌ఫుల్ హిట్‌గా నిలిచిన మంజుమ్మెల్ బాయ్స్ సినిమాలో వాడిన ఓ పాటకు సంబంధించి హక్కులు తనవేనని ఇళయరాజా క్లెయిమ్ చేసుకున్నారు. ఈమేరకు రూ.2కోట్లు పరిహారం డిమాండ్ చేశారు. అయితే ఈ వ్యవహారంలో మూవీమేకర్స్ రూ.60లక్షలు చెల్లించినట్లు అప్పట్లో ప్రచారం సాగింది. ఇక భారీ అంచనాలతో రిలీజైన ఈ సినిమాకు ఓవర్సీస్ ప్రేక్షకుల నుంచి కూడా మంచి ఆదరణ లభిస్తోంది. రీసెంట్‌గా అక్కడ ఈ సినిమా వన్‌మిలియన్ డాలర్ క్లబ్‌లో చేరిపోయింది. ఈవిషయాన్ని తెలుపుతూ మేకర్స్ పోస్ట్‌చేశారు. కాగా, ఈసినిమా వరల్డ్‌వైడ్‌గా ఇప్పటికేరూ.150కోట్లు వసూలుచేసింది. తమిళనాడులోనే రూ.80 కోట్ల కలెక్షన్లు సాధించింది. ఇదే వారంలోనే రూ.200కోట్ల క్లబ్‌లో చేరడం పక్కా అని ట్రేడర్స్ అంచనా వేస్తున్నారు.

# అణ్వాయుధాలు వీడకపోతే సైనిక చర్య

## ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్, ఏప్రిల్ 15:** అణుఒప్పందంపై ఇరాన్‌తో అమెరికా ఒకవైపు చర్చలు జరుపుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి హెచ్చరికలు చేశారు. ఇరాన్ అణ్వాయుధాలను మర్చిపోవాలని, లేకపోతే ఆ దేశంలోని అణు స్థావరాలపై సైనిక చర్యకు దిగుతామని పేర్కొన్నారు. విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ‘ఇరాన్ అణ్వాయుధాలను పూర్తిగా మరిచిపోవాలి.లేదంటే ఆ దేశంలోని అణుస్థావరాలపై సైనిక చర్యకు దిగుతా. న్యూక్లియర్ ఒప్పందానికి మేము వారితో చాలా దగ్గరగా ఉన్నాం. అయితే, ఆ దేశం కావాలనే ఈ ఒప్పందంపై తాత్సారం చేస్తోంది’ అని ట్రంప్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇరాన్ తమను మోసం చేస్తున్నట్లు కన్పిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. ఇక, న్యూక్లియర్ డీల్‌పై ఇటీవల ఒమన్‌లో తొలి విడత చర్చలు జరిగిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన చర్చలు ఈ శనివారం రోమ్‌లో జరగనున్నాయి. ఒమన్‌లో జరిగిన తొలి విడత చర్చలు సజావుగా సాగాయని ఇరాన్‌కు చెందిన మీడియా సంస్థ పేర్కొంది. ఒమన్ విదేశాంగ మంత్రి సమక్షంలో అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీలు పాల్గొన్నారు. సమావేశానంతరం అరాగ్చీ ఇరాన్ ప్రభుత్వ టివితో మాట్లాడుతూ ఈ విషయంపై మరోసారి సమావేశమవుతామన్నారు. ఈ పరోక్ష సమా వేశంలో చర్చలు కొనసాగించాలని ఇరు దేశాలు నిర్ణయించుకున్నాయి. అందులో భాగంగానే ఈ శనివారం మరోసారి సమావేశం కానున్నాయి. కాగా ట్రంప్ మొదటిసారి అధికారంలో ఉన్న ప్పుడు ఇరాన్‌తో సంబంధాలు అంతంత మాత్రం గానే సాగాయి. ఆయన అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే 2018లో అణుఒప్పందం నుంచి అగ్రరాజ్యం వైదొలిగింది. టెహ్రాన్‌పై ఆంక్షలు విధించింది. అప్పటి నుంచి ఎన్నో యేళ్లుగా పరోక్ష చర్చలు విఫలమ య్యాయి. ఈ క్రమంలోనే మరోసారి అణు ఒప్పందం కుదుర్చుకునేందుకు ట్రంప్ ఇటీవల సంసిద్ధత వ్యక్తం చేశారు. పరోక్ష చర్చలకు ఇరాన్ సైతం అంగీకరించింది. అయితే, అణు ఒప్పం దానికి టెహ్రాన్ అంగీకరించకపోతే మాత్రం తీవ్ర పరిణామాలు తప్పవంటూ ట్రంప్ హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

# సూడాన్ దాడుల్లో 300మందికి పైగా పౌరులు మృతి



**ఖర్తూమ్, ఏప్రిల్ 15:** ఆఫ్రికా దేశం సుడాన్ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ దాడులతో అతలాకుతలమౌతోంది. దార్ఫర్ ప్రాంతంలో రెండు రోజులపాటు జరిగిన దాడుల్లో 300 మందికి పైగా పౌరులు మరణించారని ఐక్యరాజ్యసమితి మానవతా సంస్థ వెల్లడించింది. గత శుక్ర, శనివారం ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్స్ బలగాలు దార్ఫర్ ప్రాంతంలోని జామ్జామ్, అబూషాక్ క్యాంపులపై దాడులకు పాల్పడ్డాయి. ఈ దాడుల్లో 300 మందికి పైగా పౌరులు మరణించినట్లు ఆఫీస్ ఫర్ ది కోఆర్డినేషన్ ఆఫ్ హ్యూమానిటేరియన్ అఫైర్స్ పేర్కొంది. మృతుల్లో 10 మంది రిలీఫ్ ఇంటర్నేషనల్‌కు చెందిన మానవతా సిబ్బంది కూడా ఉన్నట్లు పేర్కొంది. వాళ్లంతా జామ్జామ్ శిబిరంలోని ఆరోగ్య కేంద్రాల్లో తమ విధుల్లో ఉండగా ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. మృతుల్లో 23 మంది చిన్నారులు ఉన్నట్లు స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. అయితే ఈ దాడులను యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ తీవ్రంగా ఖండించారు. శత్రుత్వాన్ని వెంటనే ముగించి పౌరులకు, మానవతా సిబ్బందికి రక్షణ కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు.కాగా, జామ్జామ్ క్యాంపుపై ఆర్ఎస్ఎఫ్ దాడులు కారణంగా గత రెండు రోజుల్లో 60 నుంచి 80 వేల కుటుంబాలను నిరాశ్రయులయ్యారని ఐక్యరాజ్యసమితి వలస సంస్థ ప్రకటించింది. ఇక 16 వేల మంది పౌరులు జామ్జామ్ శిబిరాన్ని వీడినట్లు తెలుస్తోంది. సుడాన్ అంతర్యుద్ధం రెండేళ్ల కిందట మొదలైంది. 2023 ఏప్రిల్ 15న సూడాన్ ఆర్మీ చీఫ్ అబ్దుల్ ఫత్తా అల్ బుర్హాన్ ఆర్ఎస్ఎఫ్ కమాండర్ మొహమ్మద్ హమ్దాన్ డాగ్లోల మధ్య ఘర్షణ నెలకొంది. దీంతో ఇరువర్గాల మధ్య దాడులు మొదలయ్యాయి. సుడానీస్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్ రెండు వర్గాల మధ్య జరిగిన దాడుల్లో 2023 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 29,600 మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడులను తీవ్ర స్థాయిలో మానవ హక్కుల ఉల్లంఘనలే అని ఐక్యరాజ్య సమితి అప్పట్లోనే పేర్కొంది. ఈ ఘర్షణల వల్ల దాదాపు కోటి 30 లక్షల మంది సుడాన్ వదిలి పొరుగు దేశాలకు వలస వెళ్లినట్లు ఐక్యరాజ్య సమితి గణాంకాలు చెబుతున్నాయి.




# పాకిస్థాన్‌పై బలోచ్ తిరుగుబాటుదారుల పంజా

**ఇస్లామాబాద్, ఏప్రిల్ 15:** భద్రతా బలగాలను తీసుకెళుతున్న వాహనమే లక్ష్యంగా మంగళవారం పాకిస్థాన్‌లో దాడి జరిగింది. ఈ ఘటనలో ఇప్పటివరకు ముగ్గురు భద్రతాధికారులు మరణించగా మరో 18 మంది గాయపడినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో వాయువ్య పాకిస్థాన్‌లో ఇద్దరు పోలియో వర్కర్లను కిడ్నాప్ చేశారు. బలోచిస్థాన్ ప్రావిన్స్‌లోని మస్టంగ్ ప్రాంతంలో భద్రతా సిబ్బంది వాహనంపై తొలిసారి దాడి జరిగిందని ప్రభుత్వ ప్రతినిధి షహిద్ రిండ్ వెల్లడించారు. దీనిలో ది బలోచిస్థాన్ కానిస్టేబుళ్ల బృందం ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ బృందం కలాత్ నుంచి తిరిగివస్తుండగా వేర్పాటువాదులు గురిపెట్టినట్లు వెల్లడించారు. ఈ దాడికి ఐఇడిని వాడినట్లు అనుమానిస్తున్నారు. ఇప్పటివరకు ఏ గ్రూప్ ఈ దాడికి బాధ్యత వహించలేదు. దాడి జరిగిన సమయంలో వాహనంలో 40 మంది పోలీసులు ఉన్నారు. తీవ్రంగా గాయపడిన వారిని క్వెట్టాకు తరలించగా.. స్వల్పగాయాలతో బయటపడిన వారిని స్థానిక వైద్యశాలలో చేర్చారు. ఈ దాడిని పాక్ అధ్యక్షుడు జర్దారీ, ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఖండించారు. ఉగ్రవాదులపై యుద్ధం ఆగదని ఈ సందర్భంగా షరీఫ్ వెల్లడించారు. గత నెలలో బలోచిస్థాన్‌లో భద్రతా దళాలను తరలిస్తున్న జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలునే వేర్పాటువాదులు హైజాక్ చేశారు. బలోచిస్థాన్ ప్రావిన్సులోని పర్వతప్రాంతం క్వెట్టా నుంచి ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్సులోని పెషావర్‌కు రైలు వెళ్తుండగా మిలిటెంట్లు దాడికి తెగబడ్డారు. ఈ రైలు మార్గంలో 17 సొరంగాలు ఉండగా.. 8వ సొరంగం వద్ద మిలిటెంట్లు ట్రాక్‌ను పేల్చి జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను తమ నియంత్రణలోకి తీసుకున్నారు. ఆ తర్వాత రైలును చుట్టుముట్టి భారీ స్థాయిలో కాల్పులు జరిపారు. ఈ సందర్భంగా వారు దాదాపు 182 మంది బందీలను పట్టుకోవడం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కొన్ని గంటల పాటు పాక్ దళాలు శ్రమించి చివరికి రైలును స్వాధీనం చేసుకొన్నారు. పాకిస్థాన్‌లోని దాదాపు 44 శాతం భూభాగం తన సొంతమైన బలోచిస్థాన్ ప్రావిన్స్‌లో చమురు, బొగ్గు, బంగారం, రాగి, సహజ వాయువు తదితర వనరులు పుష్కలంగా ఉన్నాయి. వీటి ఆదాయం పాక్ ఖజానా నింపుతోంది. కోటిన్నర జనాభా గల ఈ పర్వత రాష్ట్రంలో మాత్రం అత్యధిక పేదరికం ఉంది. ప్రత్యేక దేశంలో ఏర్పడాలని ఇక్కడి ప్రజలు కొన్ని దశాబ్దాలుగా పోరాడుతున్నారు.

# శిశు అక్రమరవాణా చేస్తే ఆసుపత్రుల లైసెన్స్ రద్దు

## సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:** నవజాత శిశువుల అక్రమ రవాణా కేసుల విషయంలో ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం కనబరుస్తున్న తీరుపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏ ఆసుపత్రిలో అయినా చిన్నారుల అక్రమ రవాణా జరిగినట్లు తేలితే వెంటనే లైసెన్స్ రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సంబంధిత అధికారులతోపాటు ప్రభుత్వానికి మంగళవారం కఠిన మార్గదర్శకాలు నిర్దేశించింది. ఇటీవల ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఓ ఆసుపత్రిలో నవజాత శిశువు అపహరణకు గురయ్యాడు. దీంతో వెంటనే ఆ చిన్నారి తల్లి దండ్రులు పోలీసులను ఆశ్రయించారు. అప్పటికే గుర్తు తెలియని వ్యక్తి ఆ చిన్నారిని విక్రయించాడు. అయితే నిందితుడిపై ఎఫ్ఐఆర్ నమోదు కాగా, అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించిన దంపతులకు నిరాశే మిగిలింది. కేసును పై విచారించిన న్యాయస్థానం నిందితుడికి బెయిల్ మంజూరు చేసింది. దీంతో తమకు న్యాయం జరగలేదని ఆరోపిస్తూ బాధితులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తాజాగా ఈ కేసును సుప్రీంకోర్టు విచారించింది. చిన్నారుల అక్రమ రవాణా కేసులపై యూపీ ప్రభుత్వ తీరు, నిందితుడికి బెయిల్ మంజూరు చేసిన అలహాబాద్ హైకోర్టుపై సీరియస్ అయింది. అక్రమ రవాణా పెండింగ్ కేసులకు సంబంధించి విచారణ ఎలా కొనసాగుతోందో తెలియజేయాలని దేశవ్యాప్తంగా హైకోర్టులను జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. నిందితుడి బెయిల్ రద్దు చేసింది.

**విచారణ ఆరు నెలల్లోపు పూర్తి కావాలి:** ఇలాంటి కేసులకు సంబంధించిన విచారణను 6 నెలలలోపు పూర్తిచేయాలని, రోజూవారీ విచారణను కూడా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. కుమారుడిని పొందేందుకు ఆశపడిన నిందితుడు, రూ.4 లక్షలకు చిన్నారిని పొందాడని వ్యాఖ్యానించింది. ఒకవేళ నిజంగా బిడ్డ కావాలని అనుకుంటే అక్రమ రవాణా చేసేవారిని సంప్రదించాల్సింది కాదని పేర్కొంది. ఆ చిన్నారిని దొంగతనం చేసి తనకు అందించారనే విషయం నిందితుడికి బాగా తెలుసని చెప్పింది. ఇలాంటివారు సమాజానికి ముప్పు అని వ్యాఖ్యానించింది. నిందితులను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని ధర్మాసనం తెలిపింది.

# 14యేళ్లుగా మోడీకోసం పాదరక్షలు వేసుకోని కశ్యప్

## అభిమానికి స్వయంగా బూట్లు ఇచ్చిన ప్రధాని మోడీ



**హర్యానా, ఏప్రిల్ 15:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హరియాణా పర్యటనలో ఆసక్తికర సన్నివేశం జరిగింది. మోదీ ప్రధాని కావాలని, ఆయన్ను కలిసిన తర్వాతే పాదరక్షలు ధరిస్తానంటూ 14ఏళ్ల క్రితం ప్రతిజ్ఞ చేసిన రామ్‌పాల్ కశ్యప్ అనే అభిమానినికలిశారు. దీంతో ఆ అభి మానికి బూట్లు గిఫ్ట్‌గా అందజేసిన ప్రధాని మోదీ వాటిని తొడుక్కొనేందుకూ సాయం చేశారు. యమునానగర్‌లో కైతాల్‌కు చెందిన రామ్‌పాల్ కశ్యప్‌ని కలిశాను. నేను ప్రధానమంత్రి అయిన తర్వాతే పాదరక్షలు ధరిస్తానని అతడు 14 ఏళ్ల క్రితం ప్రతిజ్ఞ చేశారు. ఈరోజు ఆయన వచ్చి నన్ను కలిశారు. ఇలాంటి వ్యక్తుల ఆప్యాయత, ప్రేమను అంగీకరిస్తాను. కానీ, దయచేసి సామాజిక కృషి, దేశ నిర్మాణానికి సంబంధించిన అంశాలపై దృష్టి పెట్టండి“ అని ప్రధానమంత్రి సూచించారు. ఈ మేరకు ఎక్స్‌లో వీడియోను షేర్ చేసుకున్నారు.14 ఏళ్లుగా తాను పాదరక్షలు లేకుండానే ఉన్నట్లు కశ్యప్ మోదీకి తెలిపారు. ఆ తర్వాత బూడిద రంగులో ఉన్న స్పోర్ట్స్ షూ ఆయనకు అందజేశారు. భవిష్య త్తులో ఇలా చేయొద్దని కశ్యప్‌కు ప్రధాని సూచించారు.

# మళ్లీ మా నాన్నే బీహార్ ముఖ్యమంత్రి: నిషాంత్‌కుమార్

**పాట్నా, ఏప్రిల్ 15:** ఈ యేడాది చివరలో జరిగే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే తరఫున సిఎం అభ్యర్థి ఎవరనే విషయంలో విపక్షాల వాదనలను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ తనయుడు నిషాంత్‌కుమార్ నిర్ద్వంద్వంగా తోసిపుచ్చారు. ఎన్డీయే తరఫున తన తండ్రే సిఎం అభ్యర్థి అని, నితీష్ నాయకత్వంలోనే ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. పాట్నాలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమిలో నితీష్ కుమార్ నాయకత్వాన్ని కేంద్రమంత్రి అమిత్‌షా, బీహార్ బిజెపి అధ్యక్షుడు సామ్రాట్ చౌదరి కూడా ధ్రువీకరించారని చెప్పారు. ఎన్నికల తర్వాత నితీష్‌కుమార్‌ను తప్పిస్తారంటూ విపక్షాలు చేస్తున్న ఆరోపణలపై నిషాంత్ స్పందిస్తూ.. ‘ఆయన సిఎం ఎందుకు కాకూడదు? అమిత్‌షా చెప్పారు. సామ్రాట్ చెప్పారు. దానిపై ఎలాంటి సందేహం లేదు’ అని అన్నారు. నితీష్‌కుమార్ ఆరోగ్యంపై విపక్షాలు చేస్తున్న ఆరోపణలను కూడా నిషాంత్ కొట్టివేశారు.

# జెనీవాలో వేలానికి గోల్కొండ నీలివజ్రం




**జెనీవా, ఏప్రిల్ 14:** ఒకనాటి గోల్కొండ రాజ్యంలోని వజ్రాల గనుల్లో దొరికిన అరుదైన ‘గోల్కొండనీలి’వజ్రం’ వేలానికి రానుంది. ప్రఖ్యాత క్రిస్టీస్ సంస్థ స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో మే 14వ తేదీన ఈ వజ్రాన్ని విక్రయించనుంది. రాచ వారసత్వం, విభిన్నమైన నీలిరంగులో, 23.24 కేరట్ల పరిమాణంతో ఉండటంతో ‘గోల్కొండ బ్లూ’కు మంచి ధర పలుకుతుందని క్రిస్టీస్ సంస్థ ప్రతినిధి రాహుల్ కడాకియా తెలిపారు. ప్రస్తుతం ఒక ఉంగరానికి అమర్చి ఉన్న ఈ వజ్రానికి రూ.300 కోట్ల నుంచి రూ.430 కోట్ల వరకు పలుకుతుందని అంచనా వేస్తున్నట్టు వెల్లడించారు. ‘గోల్కొండ బ్లూ’ వజ్రం గురించి తెలిసిన చరిత్ర ప్రకారం.. మొదట్లో అది ఇండోర్ రాజు మహారాజా యశ్వంత్‌రావు హోల్కర్2 వద్ద ఉండేది. 1923 సమయంలో చేతికి ధరించే బ్రాస్‌లెట్‌లో ఈ వజ్రాన్ని పొదిగారు. తర్వాత ఇండోర్ పియర్స్‌గా పిలిచే మరో రెండు వజ్రాలతో కలిపి ‘గోల్కొండ బ్లూ’ను మహారాణి ధరించే నెక్లెస్‌లో అమర్చారు. ఆ కాలంలో ఇండోర్‌కు వచ్చిన ఫ్రెంచ్ చిత్రకారుడు బెర్నార్డ్ బౌటెట్ గీసిన చిత్రంలో మహారాణి ఈ నెక్లెస్‌ను ధరించి ఉండటం గమనార్హం. 1947లో నాటి ప్రఖ్యాత ఆభరణాల వ్యాపారి హ్యారీ విన్‌స్టన్ చేతికి ‘గోల్కొండ బ్లూ’ వజ్రం చేరింది. తర్వాత బరోడా మహారాజు దాన్నికొనుగోలు చేశారు. కొంతకాలం అనంతరం మళ్లీ ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లి పోయింది. తాజాగా జెనీవాలోని ఫోర్ సీజన్స్ హోటల్‌లో వేలం వేయనున్నారు. సాధారణంగా స్వచ్ఛమైన నీలంరంగులో ఉండే వజ్రాలకు డిమాండ్ ఎక్కువ. ఇంతకు ముందు 14.62 కేరట్ల ‘ఓపెన్‌హైమర్ బ్లూ’ వజ్రం ఏకంగా రూ.495 కోట్లకు అమ్ముడవడం గమనార్హం.

# వీసాల రద్దుపై కోర్టును ఆశ్రయించిన విదేశీ విద్యార్థులు


**వాషింగ్టన్, ఏప్రిల్ 15:** అమెరికా విదేశాంగ శాఖ వీసాలు రద్దు చేయటాన్ని సవాల్ చేస్తూ పలువురు విదేశీ విద్యార్థులు కోర్టును ఆశ్రయించారు. అకస్మాత్తుగా వీసాలు రద్దు చేయడంతో చదువులు కొనసాగించలేక పోతున్నామని, తమ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్ వంటి ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు సహా మేరీల్యాండ్, ఒహియో స్టేట్ వంటి ప్రఖ్యాత ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో విద్య అభ్యసిస్తున్న విదేశీ విద్యార్థులు కోర్టును ఆశ్రయించిన వారిలో ఉన్నారు. హమాస్‌కు మద్దతుగా జరిగిన క్యాంపస్ ఆందోళనల్లో పాల్గొన్నారంటూ కొందరు విదేశీ విద్యార్థుల వీసాలను ట్రంప్ సర్కార్ రద్దు చేసింది. అయితే ఆందోళనల్లో పాల్గొనని విద్యార్థుల వీసాలు కూడా రద్దయినట్లు కళాశాలలు పేర్కొంటున్నాయి. కొందరు విద్యార్థులు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడినందుకు వీసా రద్దు చేసినట్లు చెప్తుండగా, మరికొందరి విషయంలో అధికారులు సరైన కారణాలు చెప్పటం లేదని బాధితులు కోర్టుకు విన్నవించారు. ఇలాంటి కారణాలతో వీసాలు రద్దుచేసే అధికారం ప్రభుత్వానికి లేదని విద్యార్థులు వాదిస్తున్నారు. క్యాంపస్ ఆందోళనల్లో క్రియాశీలంగా వ్యవహరించిన విద్యార్థులతోపాటు, అక్కడి దృశ్యాలను, జాతి వ్యతిరేక సందేశాలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేసిన వారిని కూడా ట్రంప్ సర్కార్ దేశంవిడిచి వెళ్లిపోవాలని హెచ్చరించింది. తరువాత పలు యూనివర్సిటీ విద్యా ర్థుల వీసాలను కూడా రద్దు చేసింది. చట్టబద్ధమైన పత్రాలు లేని విద్యార్థులను, హమాస్ లాంటి ఉగ్రవాద సంస్థలకు మద్దతిస్తున్న విదేశీ విద్యార్థులను దేశం నుంచి బహిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ట్రంప్ పలుమార్లు పేర్కొన్నారు.ఇప్పుడు అన్నంత పని చేశారు.

**విద్యార్థి వీసాలు ఎలా పని చేస్తాయి?**

అమెరికాలో విద్య అభ్యసించాలంటే విదేశీ విద్యార్థులు ఎఫ్1 వీసా తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం అమెరికాలోని ఓ విద్యా సంస్థలో ప్రవేశం పొందిన తరువాత, విద్యార్థులు అమెరికా రాయబార కార్యాలయంలో లేదా విదేశాల్లోని కాన్సులేట్‌ల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అక్కడ వారిని ఇంటర్వ్యూ చేసి, అన్ని అర్హతలు ఉంటే ఎఫ్1 వీసాను జారీ చేస్తారు. అయితే ఇలా ఎఫ్1 వీసా పొందాలంటే, విద్యార్థులు తమ చదువుకయ్యే ఆర్థిక వనరులు తమ దగ్గర ఉన్నాయని నిరూపించుకోవాలి. అలాగే వాళ్ల అకడమిక్స్ చాలా బాగుండాలి. ఈ ఎంట్రీ వీసాలను స్టేట్ డిపార్ట్‌మెంట్ నిర్వహిస్తూ ఉంటుంది. ఎప్పుడైతే విదేశీ విద్యార్థులు అమెరికాలో అడుగుపెడతారో, అప్పటి నుంచి వారి కార్యకలాపాలను డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్‌సెక్యూరిటీ ఆధ్వర్యంలో పనిచేసే స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ప్రోగ్రామ్ పర్యవేక్షిస్తుంది. అయితే ఇటీవలి కాలంలో, ఈ హోంల్యాండ్ సెక్యూరిటీ తన డేటా బేస్ నుంచి పలువురు విదేశీ విద్యార్థుల చట్టపరమైన నివాస స్థితిని తొలగించింది. దీనితో ఆ విద్యార్థులు అమెరికాలో చదువుకోవడానికి వీలులేకుండా పోయే పరిస్థితి ఏర్పడింది. అందుకే ఇప్పుడు ఆ విదేశీ విద్యార్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.



# తమిళనాడు స్వయంప్రతిపత్తిపై ప్రత్యేక కమిటీ



**చెన్నై ఏప్రిల్ 15:** గవర్నర్ ఆర్ఎన్ రవితో విభేదాలు కొనసాగుతున్న నేప థ్యంలో తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తమిళనాడు స్వయం ప్రతిపత్తి కోసం చర్యలను సిఫార్సు చేయడానికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి కురియన్ జోసెఫ్ నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. ఈమేరకు సీఎం స్టాలిన్ అసెంబ్లీలో ప్రక టన చేశారు. రాష్ట్ర హక్కులను కేంద్రం క్రమంగా లాక్కుంటోందని ఆరోపించారు. సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి కురియన్ జోసెఫ్ నేతృత్వంలోని ఉన్నత స్థాయి కమిటీ రాష్ట్ర స్వయంప్రతిపత్తిని నిర్ధారిస్తుంది. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాన్ని వివరంగా పరిశీలిస్తుంది. జనవరి 2026లో తన మధ్యంతర నివేదికను సమర్పిస్తుంది. ఈ కమిటీలో మాజీ ఐఏఎస్ అధికారి అశోక్ వర్ధన్ శెట్టి, రాష్ట్ర ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు ఎం. నాగనాథన్ సభ్యులుగా ఉంటారు. సిఫార్సులతో కూడిన తుది నివే దికను ఈ కమిటీ రెండేళ్లలో సమర్పించనున్నట్లు స్టాలిన్ తెలిపారు.

# బిసి రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ

## బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** వెనుకబడిన తరగతుల వర్గాల వారికి 42శాతం రిజర్వేషన్లు,ఎస్సీ వర్గీకరణ చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శంషాబాద్‌లో విలేఖరులతో మాట్లాడుతూ కుల గణన సర్వే ప్రామాణికంగా సమాచారాన్ని లక్ష మంది ఉద్యోగుల ద్వారా చేయడాన్ని రాహుల్ గాంధీ కూడా ప్రశంసించారని ఆయన తెలిపారు.

కుల గణన దాని తరువాత జరిగిన ప్రక్రియ సబ్ కమిటీ,బీసీ డెడికేటెడ్ కమిషన్ కేబినెట్ అప్రూవల్ జరిగిందని తెలిపారు. సభలో యాక్ట్ 2,3 ద్వారా బిసిలకు 42 శాతం స్థానిక సంస్థలు,విద్యా ఉద్యోగాల్లో రిజర్వేషన్లు పెంచుతూ చట్టం చేసి గవర్నర్ దగ్గరకు పంపడం జరిగిందని ఆయన తెలిపారు. ఈనెల ఏప్రిల్ 8 న ఆమోదం పొందింది అని అన్నారు. గవర్నర్ ధన్యవాదాలు తెలిపారు. బిసి ల రిజర్వేషన్ల బిల్లు రాష్ట్రపతి దగ్గరకు వెళ్ళిందని ఆయన వివరించారు.

ఇటీవల సుప్రీంకోర్టు కూడా బిల్లులను రెండు నెలల్లో విషయాన్ని తేల్చాలని చెప్పిందని తప్పకుండా సానుకూలంగా రాష్ట్రపతినుంచి కూడా వస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. శాసన సభలో బిసి ల రిజర్వేషన్ల పై అన్ని రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా తీర్మానం చేశాయి .న్యాయపరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా సమాచార సేకరణ జరిగిందని ఆయన అన్నారు. తెలంగాణలోని 119 నియోజకవర్గాల్లో బిసి ల నాయకులు ,కుల సంఘాల నాయకులు,ఉద్యోగ సంఘాల నాయకులు ,బీసీ మేధావులను పిలిచి చారిత్రాత్మక ప్రక్రియను పూర్తిచేశామని తెలిపారు. 1931 స్వాతంత్ర్య ఉద్యమ తరువాత జరిగిన కుల సర్వే మళ్ళీ ఇప్పుడు మాత్రమే జరిగిందని ఆయన వివరించారు. ప్రజలకు కులగణనపై అవగాహన కల్పించాలని ఆయన కోరారు. ఈ అంశాన్ని సానుకూలంగా పార్టీ పరంగా ప్రజలంతా మనవైపు చూసేలా కార్యక్రమాలు నిర్వహించాలని శాసన సభ్యులు ,మండలి సభ్యులు , పార్లమెంట్ సభ్యులకు కోరడం జరిగింది. దేశంలోనే.ఈ అంశాన్ని తీసుకొని ప్రజల్లో పెద్ద ఎత్తున పార్టీ నేతలు కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.



# ప్రతీ ఎమ్మెల్యే వేతనం నుండి రూ.25 వేలు పార్టీకి ఇవ్వాలి

### రియల్ లీడర్ అద్దంకి దయాకర్.. సగం జీతం వాళ్లకే: సీఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 15:** ప్రతీ ఎమ్మెల్యే తన జీతం నుండి రూ.25 వేలు పార్టీకి ఇవ్వాలని సీఎల్పీ నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మంగళవారం శంషాబాద్ లోని నోవాటెల్ హోటల్లో సీఎం రేవంత్ అధ్యక్షతన సీఎల్పీ సమావేశం జరిగింది. ఈ భేటీలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రతీ ఎమ్మెల్యే తన జీతం నుండి రూ.25 వేలు పార్టీకి విరాళంగా ఇవ్వాలని చెప్పారు. పార్టీని బ్లాక్ మెయిల్ చేస్తే అంత కుదరదని, భయపడే పరిస్థితిలో పార్టీ లేదని సీఎం హెచ్చరించారు. అద్దంకి దయాకర్ లాగా ఓపికతో ఉండాలని, దయాకర్ ఓపికగా ఉన్నాడు కాబట్టి,ఎమ్మెల్సీ అయ్యాడని సీఎం అన్నారు. అద్దంకి దయాకర్‌కు ముందు టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయం తీసుకుందని గుర్తు చేశారు. కానీ సడన్‌గా కొన్ని ప్రత్యేక కారణాల వల్ల కాంగ్రెస్ వెనక్కి తగ్గిందన్నారు.కానీ అద్దంకి దయాకర్ మాత్రం తొందరపడకుండా కాంగ్రెస్ పార్టీలోనే ఓపికగా పనిచేశారని కొనియాడారు. ఇలా అందరూ కార్యకర్తలు అలాగే పార్టీ నేతలు పని చేయాలని కోరారు. అద్దంకి దయాకర్ తన జీతంలో 10శాతం ఎఐసిసికి, 15శాతం పీసీసీ జీతం ఇస్తున్నారని కొనియాడారు. రెండోసారి ప్రభుత్వాన్ని తీసుకురావడమే మన టార్గెట్ అని చెప్పారు. త్వరలోనే ఎమ్మెల్యేలకు వ్యక్తిగతంగా అపాయింట్‌మెంట్లు ఉంటాయిన.. రెండోసారి గెలవడానికి మీ నియోజకవర్గాల్లో ప్రభావితం చేసే పనులను తీసుకురండని.. దగ్గరుండి తానే చేయిస్తానని సీఎం చెప్పారు.



నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గం ఇబ్రహీంపేట ఐకెపి సెంటర్ దగ్గర అకాల వర్షానికి వడ్లు తడుస్తుండగా అటుగా వెళ్తూ వాహనాన్ని ఆపి ధాన్యంపై కవర్లు కప్పి రైతులకు సహాయం చేస్తున్న జవాన్లు

# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రూ. 20.19 కోట్లు

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** బేస్‌మెంట్ పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధి దారులకురూ.20.19 కోట్ల రూపాయిలను నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమచేసినట్లు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.మొదటి విడతలో పైలట్ ప్రాజెక్ట్ కింద మంజూరు చేసిన 70,122 ఇండ్లలో బేస్ మెంట్ పూర్తి చేసుకున్న 2019 మందికి లక్ష రూపాయిల చొప్పున రూ.20.19 కోట్ల రూపాయిలను విడుదల చేశామని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి తెలిపారు.ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నాకూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఆటంకం ఏర్పడకుండా నిధులు విడుదల చేస్తామన్నారు. ఇండ్ల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని , గ్రౌండింగ్ అయిన ఇండ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేస్తున్నామని, ఇప్పటికి 13,500 ఇండ్లు గ్రౌండింగ్ అయినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి సిఎం రేవంత్ =12 మంది లబ్దిదారులకు మంగళవారం నాడు లాంఛనంగా లక్ష రూపాయిల చొప్పున చెక్కులను అందజేశారన్నారు.

మధ్యవర్తుల ప్రమేయానికి తావులేకుండా నాలుగు విడతల్లో లబ్దిదారులకు నేరుగా వారి ఖాతాలోనే జమచేస్తామని తెలిపారు. నిర్మాణానికి సంబంధించి బేస్ మెంట్ పూర్తైన తర్వాత లక్ష రూపాయిలు, గోడలు పూర్తైన తర్వాత 1.25 లక్షల రూపాయిలు, శ్లాబ్ పూర్తిచేసుకున్న తర్వాత 1.75 లక్షల రూపాయిలు, ఇల్లు పూర్తైన తర్వాత మిగిలిన లక్ష రూపాయిలు విడుదల చేస్తామన్నారు. బేస్‌మెంట్ గాని గోడలు గాని శ్లాబ్‌గాని నిర్మాణం పూర్తిచేసుకుంటే అధికారుల కోసం ఎదురుచూడకుండా లబ్దిదారులే ఫోటో తీసి మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసినా కూడా డబ్బులు లబ్దిదారుల ఖాతాలో జమచేస్తామని తెలిపారు. కనీసం 400 ఎస్‌ఎఫ్‌టికి తగ్గకుండా 600 ఎస్ ఎఫ్‌టీకి మించకుండా లబ్దిదారులు ఇంటిని నిర్మించుకోవాలన్నారు.అర్హులైన ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ మరింత వేగవంతం చేయడం, అధికారులకు , ప్రజాప్రతినిధులకు సమన్వయం ఉండేలా ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధికారిని నియమిస్తున్నామన్నారు.

# స్త్రీ నిధి నిర్వహణ బాధ్యతలు ఐఎఎస్ అధికారికి అప్పగించాలి

### మాజీమంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 15:** మహిళలకు రూ.20 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్న మాట నిజమే అయితే సంబంధించిన జీవో బయటపెట్టాలని బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు డిమాండ్ చేశారు.ఈ మేరకు మంగళవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. స్వయంగా ముఖ్యమంత్రి మహిళ సంఘాలకు రెండు సార్లు ఆవే చెక్కులు ఇచ్చినా ఇప్పటికి చెల్లుబాటు కాకపోవడం సిగ్గుచేటు అని వ్యాఖ్యానించారు.నవంబర్ 19, 2024 నాడు వరంగల్ లో స్వయం సహాయక సంఘ సభ్యులకు లోన్ బీమా, ప్రమాద బీమా చెక్కులను సీఎం అందించారు. మళ్ళీ అవే చెక్కులను మార్చి 8, 2025 నాడు ఇందిరా మహిళా శక్తి పేరిట హైదరాబాద్ లో నిర్వహించిన సభలో సీఎం అందించారు.అయితే ఇప్పటివరకు అవి క్లియర్ గాక మహిళా సంఘాల సభ్యులు ఎదురు చూస్తు న్నారని పేర్కొన్నారు. స్కూల్ విద్యార్థుల డ్రెస్ కుట్టు చార్జీలు 50 రూపాయలు ఇచ్చి, 75 రూపాయలు ఇస్తున్నం అని ప్రచారం చేసుకున్నరు. మేము నిలదీస్తే మిగతా 25 రూపాయలు విడుదల చేశారు, కానీ ఇవి ఇంకా మహిళలకు చేరలేదు. వెంటనే చెల్లించండి.ప్రతి విద్యార్థి కొలతలు స్వయంగా వెళ్లి తీసుకోవాలని షరతు పెట్టారు.మీరు ఇచ్చే 75 రూపాయలు ఎలా సరిపోతాయి. ఈ కుట్టు ఛార్జీలు 150 రూపాయలకు పెంచాలని మహిళా సంఘాల తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు. స్వయం సహాయక బృందాలకు రుణాలు ఇచ్చే శ్రీనిధి నిర్వహణ అస్తవ్యస్తంగా మారడం దురదృష్టకరమని చెప్పారు. మొత్తం రుణాలలో 40శాతం వాటా నాన్‌పెర్ఫార్మింగ్ అసెట్స్ (ఎన్‌పిఏ) ఉండటం శ్రీనిధి మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నదన్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఐఏఎస్ అధికారికి బాధ్యతలు అప్పగించి శ్రీనిధి భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. వడ్డీ లేని రుణాలపై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని, లేదంటే మహిళలే మీకు బుద్ధి చెబుతారని హెచ్చరిస్తున్నట్లు తెలిపారు.

## రేవంత్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఏప్రిల్ 15:** గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో 2016లో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ వాయిదా పడింది. గోపనపల్లిలోని భూ వివాదానికి సంబంధించి రేవంత్‌పై కేసు నమోదు కాగా, రంగారెడ్డి జిల్లా కోర్టులో విచారణలో ఉంది. ఈ కేసును కొట్టివేయాలంటూ 2020లో రేవంత్ పిటిషన్ వేశారు. జస్టిస్ కె.లక్ష్మణ్ ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టి.. పిటిషన్‌ను వేరే బెంచ్‌కు బదలీ చేయాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

## మిస్‌వరల్డ్‌పై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం

**హైదరాబాద్, ఏప్రిల్ 15,ప్రభాతవార్త :** త్వరలో హైదరాబాద్‌లో జరగనున్న మిస్ వరల్డ్ పోటీలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇందులో భాగంగా అధికారులు మంగళవారం చౌముహుల్లా ప్యాలెస్‌లో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్య కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆధ్వర్యంలోన జరిగిన ఈ సమావేశంలో మిస్ వరల్డ్ ఏర్పాట్లపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పే విధంగా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. ముఖ్యంగా అతిథులకు ఎటువంటి లోటుపాట్లు జరకుండా చూడాలని, అతిథ్యం విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవడమే కాకుండా వారి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భద్రతకు సంబంధించి ఎటువంటి పొరపాట్లు జరిగినా అంతర్జాతీయంగా అపఖ్యాతి మూటకట్టుకోవాల్సి వస్తుందన్నారు.

## మానసికస్థితి సరిగాలేని ఇద్దరు అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య

**హైదరాబాద్ (కంటోన్మెంట్), ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** కార్ఖానా పోలీస్‌స్టేషన్ పరిధి లోని ఓ అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌లో అక్కాచెల్లెళ్లు మృతి చెందిన ఘటన కలకలం రేపింది. సకాలంలో వివాహం కాకపోవడంతోపాటు ఇద్దరి మానసికస్థితి సరిగా లేకపోవడంతో మనస్తాపానికి గురై పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్ప డ్డారు. రెండు రోజుల క్రితం అపార్ట్‌మెంట్‌లో నుండి దుర్వాసన వస్తుండడం గమనించిన అపార్ట్‌మెంట్ వాసులు 100కు డయల్‌చేసి పోలీసులకు సమాచారం అందించారు. అపార్ట్‌మెంటులోని నాలుగవ అంతస్తులో నివాసముంటున్న వీణ, మీనా నివాసం నుండి దుర్వాసన వస్తుండడాన్ని గమనించిన పోలీసులు తలుపు తెరిచిచూడగా కుళ్లినస్థితిలో హాల్‌లోని మంచంపై వారి మృతదేహాలు గుర్తిం చారు. వెంటనే కార్ఖానా పోలీసులు వారి మృతదేహాలను గాంధీ ఆసుపత్రికి తరలించి ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. కార్ఖానాలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వీణ(60), మీనా(59) అక్కాచెల్లెళ్లు 12 సంవత్సరాల నుండి నివాసం ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. వీరిద్దరూ ఒకే ఫ్లాట్‌లో ఉంటూ జీవనం సాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వీణ, మీనా తన చెల్లెలు సాధనతో తరచుగా ఫోన్‌లో మాట్లాడుతూ ఉండేవారని, పదిరోజుల క్రితం చివరగా ఫోన్‌చేసినట్లు తెలిపారు. వీరి కుటుంబంలో ఏడుగురు కుమా ర్తెలు, ఒక కుమారుడు ఉండగా,, వారిలో ఇద్దరు ఇదివరకే మృతి చెందారని పోలీసులు పేర్కొన్నారు. వీరి తండ్రి ఆర్మీలో ఉద్యోగం చేస్తూ పదవీవిరమణ పొందినట్లు పోలీసులు తెలిపారు. అపార్ట్‌మెంట్ వాసులతో మీనా, వీణ సరిగా మాట్లాడేవారు కాదని, వారి మానసికస్థితి కూడా సరిగా ఉండేది కాదని పోలీ సులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. వారం రోజుల క్రితమే అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

### కోరుట్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో

# 30 మంది విద్యార్థులకు అస్వస్థత

### ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిన ఐదుగురు విద్యార్థులు

### నిలకడగా ఆరోగ్య పరిస్థితి



**కోరుట్ల, ప్రభాతవార్త :** కోరుట్ల పట్టణంలోని కల్లూరు రోడ్డులో సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో 30 మంది విద్యార్థులు అస్వస్థత గురయ్యారు. వాతావరణంలో వచ్చిన మార్పులతో పిల్లలు డిహైడ్రేషన్ కావడం వల్ల జ్వరంతో బాధపడుతుండగ కోరుట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వాతావరణంలో వచ్చిన మార్పులతో పిల్లలు డిహైడ్రేషన్ అవుతుందని దీంతో జ్వరం రావడం వల్ల పిల్లలు అస్వస్థత లోనయ్యారని వారికి సరైన సమయంలో చికిత్స అందించినట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. కొంతమంది చిన్నారులు అస్వస్థతకు గురైన దృష్ట్యా కళాశాలలో పనిచేసి స్థానిక ఏ ఎస్ .ఎం. వారిని వెంట బెట్టుకుని అల్లమయగుట్ట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పించగా వైద్యాధికారి డాక్టర్ శివాని వారిని పరిశీలించి చికిత్స అందించారు. జ్వరంతో బాధపడుతున్న ముగ్గురు పిల్లలను కోరుట్ల ఏరియా హాస్పిటల్ కు రిఫర్ చేయగా అక్కడి వైద్యాధికారులు పరిశీలించి వారిని అడ్మిట్ చేసుకొని చికిత్స అందించారు. జ్వరంతో బాధపడుతున్న విద్యార్థుల నుంచి రక్త నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం టీ హబులోని ల్యాబ్ కు పంపించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకునే జాగ్రత్తల గురించి వివరించారు. పాఠశాల సెలవులు ముగిశాక విద్యార్థులు ఎండలో తిరుగకుండా పగటి సమయంలో ఆటలు ఆడకుండా ఉదయము, సాయంత్రం సమయాలలో మాత్రమే ఆటలు ఆడుకో వాల్సిం దిగా సూచించారు. తప్పనిసరి పరిస్థితులలో ఎండలో వెళ్లాల్సి వచ్చినప్పుడు తలకు టోపీలు గాని, టవల్స్ గాని చుట్టుకోవాలని తెలిపాడు. వీలైనంత ఎక్కువగా మంచినీటిని తాగాలని సూచించారు. విషయం తెలిసిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆసుపత్రికి చేరుకొని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి ఐడియా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంఛార్జ్ ప్రిన్సిపల్ అంకం సురేశ్, వైద్యాధికారులు డాక్టర్ సమీన, డాక్టర్ శివాని, హెల్త్ ఎడ్యుకేటర్ తులసి వెంకటరమణ, ఎపిడమాలజిస్ట్ వంశీ, హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ శ్రీధర్, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 136 మంది ఉద్యోగులను విధుల్లోకి తీసుకున్న ఆర్టీసీ

### ముఖ్యమంత్రికి ఆర్టీసీ ఉద్యోగుల కృతజ్ఞతలు

**హైదరాబాద్ (బేగంపేట) ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి ప్రజావాణీ చొరవతో 136 మంది ఆర్టీసీ ఉద్యోగులను ఆర్టీసీ యాజమాన్యం తిరిగి విధుల్లోకి తీసుకోవడంతో ఆర్టీసీ ఉద్యోగులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,మంత్రి పొన్నం ప్రభాకర్, డా.చిన్నారెడ్డి.దివ్యలకు ఆర్టీసీ ఉద్యోగులు కృతజ్ఞతలు తెలియజేసారు.మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణీ కార్యక్రమానికి ఆర్టీసీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు.వివిధ కారణాలతో ఉద్యోగాల నుంచి తొలగించిన 136మందిని ఆర్టీసీ తిరిగి విధుల్లోకి తీసుకుంది.ఇందులో కండక్టర్లు, డ్రైవర్లు,మెకానిక్‌లు,సెక్యూరిటీ గార్డులు ఉన్నారు. వివిధ కారణాలతో ఉద్యోగాలు కోల్పోయిన సుమారు 472మంది ఆర్టీసీ ఉద్యోగులు తమ తప్పు లను క్షమించి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సీఎం ప్రజావాణీలో ఇంచార్జి డా.జి. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్యలను కొన్ని నెలల క్రితం కల్సి విజ్ఞప్తి చేసారు. చిన్నారెడ్డి, దివ్యలు ఈ విషయాన్ని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ మేరకు ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్మిక శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ సంజయ్ కుమార్ ఛైర్మన్‌గా, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ మెంబర్ కన్వీనర్ గా కమీటీని వేసారు.త్రీమెన్ కమిటీ ఆర్టీసీ ఉద్యోగుల విషయాన్ని పరిశీలించి తొలి విడతగా 136మంది ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకుంటూ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఉత్వర్వులు జారీ చేసారు.మిగిలిన 336మంది ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు వినేందుకు బ్యాచ్ వారీగా తేదీలను ఖరారు చేసి షెడ్యూల్ ప్రకటించారు. ప్రజాభవన్‌లో మంగళ వారం జరిగిన సిఎం ప్రజావాణీ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి వచ్చిన ఆర్టీసీ ఉద్యోగులు చిన్నారెడ్డి. దివ్య ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రజావాణికి తరలి వచ్చిన ఆర్టీసీ ఉద్యోగులు

**ప్రజావాణికి అందిన దరఖాస్తులు 274**

మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 274దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబం ధించి 53, విద్యుత్ శాఖకు సంబంధించి 39, రెవెన్యూ శాఖకు సంబంధించి 51, ఇంది రమ్మ ఇళ్ల కోసం 70 దరఖాస్తులు వచ్చాయి.ప్రవాసీ ప్రజావాణీకి 1, ఇతర శాఖలకు సంబంధించి 166 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు.

# గన్నవరంలో విమానాశ్రయం ఉండగా.. అమరావతిలో ఎందుకు?

### కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకే మళ్లీ భూసేకరణ

### బిఎస్పీ ఎపి సమన్వయకర్త, మాజీ డిజిపి పూర్ణచందర్‌రావు



మంగళవారం హైదరాబాద్‌లో మాట్లాడుతున్న బిఎస్పీ ఎపి సమన్వయకర్త, మాజీ డిజిపి పూర్ణచందర్‌రావు, వందన్‌కుమార్ తదితరులు

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** అమరావతిలో కొత్త అంతర్జాతీయ విమానాశ్రయం కడతామంటూ, ఇప్పుడు ఏకంగా 44వేల ఎకరాల భూ సేకరణకు ఏపీ ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోందని, ఇది రైతుల ప్రయో జనాలకు శరాఘాతమని బీఎస్పీ ఏపీ సమన్వ యకర్త, మాజీ డిజిపి డాక్టర్ పూర్ణచందర్ రావు మండిపడ్డారు. మంగ ళవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసమే మళ్లీ భూసేకరణ చేస్తున్నారుని రైతుల అతి ముఖ్యమైన సమస్యలను పట్టించు కోవడంలేదని ప్రభుత్వంపై మండి పడ్డారు. ప్రస్తుతం ఉన్న భూమిని సమర్థవం తంగా అభివృద్ధి చేస్తే, దాని పరిసర ప్రాంతాల్లో ఉన్న 288 మంది రైతులకు లాభం కలుగు తుందని కానీ ప్రభుత్వం కార్పొరేట్ అవసరాలపై దృష్టి పెడుతూ, రైతుల భవిష్యత్తును పూర్తిగా విస్మరించడం బాధాకరన్నారు. వ్యవస్థలను బాగు చేస్తారని పాలకులను ఎన్ను కుంటే, వాళ్లు మరింత అవస్థల పాలు చేస్తున్నారని మండిపడ్డారు. అమరావతికి ఇప్పటికే 54 వేల ఎకరాల భూమి ఉంది. అది చాలదన్నట్లు మరో 44 వేల ఎకరాలు సేకరిస్తు న్నారన్నారు. ఇక్కడ అంతర్జాతీయ విమానాశ్రయం కడతామని చెబు తున్నారు. విజయవాడ, భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయా లున్నాయని భోగాపురంలో 2,700 ఎకరాల్లోనే కడుతుంటే ఇక్కడ 57 వేల ఎకరాలు ఎందుకు? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో 5,200 ఎకరాల్లో విమానాశ్రయం ఉంటే, అందులో వాడుతున్నది 750 ఎకరాలు మాత్రమేనని అందులోనే టెర్మి నల్స్ అన్నీ ఉన్నాయని 2.8 కోట్ల మంది ప్రయా ణికులు దీన్ని వాడుతున్నారన్నారు. అమరావతిలో 2 కోట్ల మంది ప్రయాణికులు రావాలన్నా కనీసం 40 సంవత్సరాలు పడు తుంది. మరి అమరావతి విమానాశ్రయానికి 57వేల ఎకరాలు ఎందుకు? అని ప్రశ్నించారు. పక్క నే ఉన్న గన్నవరం విమానాశ్రయాన్ని విస్తరిస్తే సరి పోతుంది కదా? అని సూచించారు. త్వరలోనే గుంటూరులో భారీ బహిరంగసభ నిర్వహించి, ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలకు అవ గాహన కల్పిస్తాం అని పూర్ణచంద్రరావు పేర్కొ న్నారు. కార్యక్రమంలో బీఎస్పీ ఆంధ్రప్రదేశ్ అధికార ప్రతినిధి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ మాజీ డైరెక్టర్ వందన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పెరిగిన చలివేంద్రాల సంఖ్య

### అత్యవసర నీటిసమస్యల పరిష్కారానికి జిల్లాకు రూ.1 కోటి కేటాయింపు

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** వేసవి ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. పట్టణ, గ్రామీణ కేంద్రాల్లోని బాట సారులు త్రాగు నీటి సమస్యల పరిష్కారం కోసం పంచాయితీరాజ్‌శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాల్లో తొలి 6 వేలకు పైగా చలివేంద్రాలను ఏర్పాటు చేసింది. వాటికి ప్రజల నుంచి మంచి స్పందన రావడంతో పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క ఆదేశాలతో అధికారులు 8,090 చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. అంతే కాకుండా ఎక్కడ త్రాగు నీటి సమస్య ఉన్నా పంచాయితీరాజ్ శాఖ నిధుల నుంచి 31 జల్లాలకు కోటి రూపాయల ప్రత్యేక నిధులను విడుదల చేసి వాటిని అత్యవసర తాగు నీటి అవసరాలకు వినియోగించుకునే విధంగా సంబంధిత జిల్లా కలెక్టర్లుకు ఆదేశాలను జారీ చేసింది.గతంలో ఫైనాన్స్ శాఖ నుంచి ప్రత్యేక నిధుల కోసం అనుమతులు ఇచ్చేవారు. కానీ ఏ ఒక్కఏడాది కూడా వాటిని విడుదల చేసిన సందర్భాలు లేవు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పుడు పెట్టుకుని అత్యవసర తాగు నీటి సమస్యల పరిష్కారం కోసం పంచాయితీరాజ్‌శాఖ ఈ కోటి రూపాయాలను కేటాయించింది. ఏదైనా సమస్యతో మిషన్ భగీరథ నీరు అందకపోయినా తమకు కేటాయించిన ప్రత్యేక నిధిని ఖర్చు చేసి ప్రజలకు నీటి సమస్యలు రాకుండా చర్యలు సంబంధిత జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోనున్నారు.

### కంట్లో స్క్రూడ్రైవర్ గుచ్చుకున్న యువకుడికి

# గాంధీ ఆస్పత్రిలో ఆపరేషన్

**హైదరాబాద్ (సికింద్రాబాద్), ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు కంటిపైభాగంలో దిగబడిన స్క్రూడ్రైవర్‌ను సికింద్రాబాద్ గాంధీ వైద్యులు విజయవంతంగా తొలగించారు. సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి తెలిపిన వివరాలు ప్రకారం మెదక్‌జిల్లా మనోహరాబాద్ మండలం కూచారం గ్రామానికి చెందిన రంజిత్ (21) ఎలక్ట్రికల్ మెకానిక్. ఈనెల 8వ తేదిన మెకానిక్ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు స్క్రూడ్రైవర్ కుడి కంటి పైభాగంలో బలంగా దిగబడింది. అదేరోజు బంజారాహిల్స్‌లోని ఓ ప్రైవేటు కంటి ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. అక్కడి వైద్యులు 9వ తేదిన నిమ్స్‌కు తీసుకువెల్లానని సూచించారు. నిమ్స్‌లో పరిశీలించిన వైద్యులు 10వ తేదిన గాంధీఆస్పత్రికి రిఫర్ చేశారు. గాంధీ ఆప్తమాలజీ వైద్యులు పలు రకాల వైద్యపరీక్షలు నిర్వహించి కంటికి ఎటువంటి గాయం కాలేదని, కంటి పైభాగంలో స్క్రూడ్రైవర్ గుచ్చుకుందని నిర్ధారించి న్యూరోసర్జరీ విభాగానికి తరలించారు. గాంధీ న్యూరోసర్జరీ వైద్యులు సుమారు రెండు గంటల పాటు శ్రమించి అరుదైన ఆపరేషన్ నిర్వహించి బాధితరోగి కంటిపై భాగంలో గుచ్చుకున్న స్క్రూడైవర్‌ను విజయవంతంగా తొలగించారు. సర్జరీ అనంతరం రోగి రంజిత్ కోలుకుంటున్నాడని, త్వరలోనే డిశ్చార్జ్ చేస్తామని తెలిపారు.



రంజిత్ ఆపరేషన్‌కు ముందు, తరువాత

### వంద రోజులపాటు ప్లాట్‌ఫామ్‌ల మూసివేత

# 120 రైళ్ల దారిమళ్లింపు

**హైదరాబాద్ (తార్నాక), ఏప్రిల్ 15, ప్రభాతవార్త :** రైల్వే ప్రయాణికులకు తాత్కా లికంగా అసౌకర్యం తప్పడంలేదు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు ప్రారంభమవుతున్న వేళ రైల్వే ఉన్నతాధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. స్టేషన్‌లో భారి స్థాయిలో జరుగబోయే ఆధునీకరణ పనుల కారణంగా పలు రైళ్లను దారి మళ్లిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ప్రధాని మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైల్వే వ్యస్థను ఆధునీకరించడంపై విశేషంగా దృష్టి పెట్టడంతో దేశ వ్యాప్తంగా అనేక రైల్వే స్టేషన్లను అంతర్జాతీయ ప్రమాణాల తరహాలో తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో బాగంగా దక్షిణ మధ్యరైల్వే అధికారులు స్టేషన్‌ను కూడా ఆధునీకరణలో భాగంగా ఆరు ఫ్లాట్ ఫామ్‌లను వంద రోజుల పాటు మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటిం చారు. ఈ మేరకు 100 రోజుల పాటు స్టేషన్ పరిధిలోని మొత్తం ఆరు ప్లాట్‌ఫామ్‌లను మూసివేస్తున్నట్లుగా ప్రకటించారు. దీంతో దాదాపు 120 రైళ్లను చర్లపల్లి రైల్వే జంక్షన్, కాచిగూడ,నాంపల్లి, స్టేషన్లకు దారి మళ్లిస్తున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునర్నిర్మాణంలో భాగంగా రూ. 720 కోట్ల వ్యయంతో రైల్వే శాఖ ఆధునీకరిస్తుంది. స్టేషన్‌లో ప్రపంచ స్థాయిలో సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. భారీ స్కై కాంకోర్స్, లిఫ్టులు,ఎస్కలేటర్లు, ఫుటవర్ బ్రిడ్జను నిర్మించనున్నారు. ఇందులో 110 మీటర్ల వెడల్పు, 120 మీటర్ల పొడవుతో నిర్మించనున్న భారీ స్కై కాంకోర్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలువ నుంది. అందులో రిటైల్ ఔట్లెట్స్, రెస్టారెంట్లు, కియోస్క్ ఏర్పాటు చేయనున్నారు. ముందుగా ప్లాట్ఫాం నెం.23, 45లలో దాదాపు 50 రోజుల పాటు పనులు కొనసాగనున్నాయి. అక్కడ పనులు పూర్తి అయిన వెంటనే నాలుగు ప్లాట్ఫామ్‌లను పున ప్రారంభించి ప్రారంభిస్తున్నారు. అనంతరం ప్లాట్ఫామ్ నంబర్ 10 వైపు పనులు ప్రారంభిస్తారు. కాగా స్టేషన్ అధునీకరణలో భాగంగా సికింద్రాబాద్ స్టేషన్ భవనం చరిత్రలో కలిసిపోయింది. నాజాం హయాంలో హైదరాబాద్ స్టేట్ రైల్వేస్ పేరుతో వెలుగు వెలిగిన ఈ స్టేషన్ భవనాన్ని ఆదునీకరణలో భాగంగా ఇప్పటికే నేల మట్టం చేసిన సంగతి తెలిసిందే. ప్రతి రోజు ఈ స్టేషన్ నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు దాదాపు 3 లక్షల మంది ప్రయాణిస్తుంటారు.

## ఇండియా జస్టిస్ రిపోర్ట్‌లో తెలంగాణకు టాప్ ర్యాంక్

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** తెలంగాణ పోలీసు విభాగానికి మరోసారి అగ్రతాంబులం దక్కింది. ఇప్పటికే అనేక అంశాలలో పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్న తెలంగాణ పోలీసు విభాగం ఇండియా జస్టిస్ రిపోర్ట్‌అనే సంస్థ ఏటా ప్రకటించే నివేదికలో అగ్రస్థానం అందుకుంది. తెలంగాణ సహ మరో ఐదు రాష్ట్రాలు మొదటి స్థానం అందుకున్నా పాయింట్ల వరకు వస్తే తెలంగాణ 6.48తోటాప్ ర్యాంక్‌లో నిలిచింది. తెలంగాణ తరువాత ఏపి 6.44,కర్నాటక 6.19, ఛత్తీస్‌ఘడ్ 6.02, మహారాష్ట్ర 5.61, ఉత్తర్‌ఖండ్ 5.50తో మొదటి స్థానంలో నిలిచాయి. ద్వితీయ స్థానంలో పంజాబ్ సహ ఒడిషా, గుజరాత్, బీహార్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, తమిళనాడు, హర్యానా, కేరళ, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, బెంగాల్‌లు నిలిచాయి. శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నివారణతో పాటు ప్రజలతో మమేకం అవడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకున్న తరువాత ఇండియా జస్టిస్ రిపోర్ట్ ఈ నివేదికను విడుదల చేసింది.

## రూ.50 నుండి 60 కోట్ల అంచనాతో రైతులకు ట్రాక్టర్లు, డ్రోన్లు

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** వ్యవసాయంలో యాంత్రీకరణపై దృష్టిపెట్టిన తెలంగాణ ప్రభుత్వం రైతులకు సబ్సిడీ కింద అవసరమైన పనిముట్లను అందించేందుకు చర్యలు చేపట్టింది. ట్రాక్టర్లు, కల్టివేటర్లు, పురుగు మందులు పిచికారీకి డ్రోన్లు,పవర్ స్ప్రేయర్లు సహా సాగులో ఉపయోగపడే 20 పరికరాలను ఇవ్వనుంది. ఈ పరికరాలు సరఫరా చేసే కంపెనీలతో ఒప్పందం కోసం వ్యవసాయ శాఖ ఇప్పటికే ప్రక్రియను పూర్తి చేసింది. ఇక, సబ్సిడీ కింద ఇచ్చే యంత్ర పరికరాల కోసం రూ.50రూ.60 కోట్ల దాకా ఖర్చవుతుందని అంచనా వేసింది. సబ్సిడీకింద రైతులకు అందజేయనున్న వ్యవసాయ పరిక రాలలో 600ట్రాక్టర్లు, 160వరకు డ్రోన్లు ఉన్నాయి. దుక్కి కోసం ట్రాక్టర్లకు కల్టివేటర్, ప్లవ్,రోటవేటర్లు సహా అమర్చేవివిధ పరికరాలనూ అందజేయనుంది.

## పాల కల్తీపై నిఘా ముమ్మరం

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** కల్తీ పాల ఉత్పత్తులపై నిఘాను ముమ్మరం చేస్తున్నాయి. ప్రధానంగా పండుగల సమయంలో పాల ఉత్పత్తులకు డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నందున, ఆహార కల్తీ మరియు తప్పుడు లేబులింగ్‌ను నివారించడానికి పర్యవేక్షణను పెంచాలని అన్ని రాష్ట్రాలలోని నియంత్రణ అధికారులకు కేంద్రం ఆదేశాలు ఇవ్వడంతో అప్రమత్తమయ్యారు. డెయిరీల్లో సోయాపాలు, బాదం పాలు, అనలాగ్ పనీర్, సోయా, బాదం మరియు కొబ్బరితో తయారు చేసిన వేగన్ పెరుగు ప్రత్యామ్నాయాలు, వేగన్ చీజ్ మరియు కొబ్బరి పాలపై నిఘా పెంచారు. పండుగల సమయంలో ఆహార కల్తీ మరియు తప్పుడు లేబులింగ్‌ను నిరోధించడమే దీని లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు. కాగా ఇటీవలి కాలంలో పాల ఉత్పత్తులకు సంబంధించి ముఖ్యంగా అనలాగ్ పనీర్ ఆరోగ్యానికి హాని కలిగించే ప్రమాదాల గురించి చాలా విమర్శలకు గురైంది.

## భూ భారతి పోర్టల్‌కు మంచి స్పందన

### క్షణాల్లో ప్రారంభం అవుతున్న పోర్టల్

**హైదరాబాద్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** తెలంగాణలో భూ లావాదేవీలు, రికార్డుల నిర్వహణకు ధరణి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చిన సంగతి తెలిసిందే. సోమవారం సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన పోర్టల్‌కు అనూహ్యస్పందన వచ్చింది.యూజర్లకు సెకన్లలో భూ భారతి పోర్టల్ ఓపెన్ అవుతోంది. ఇప్పటికే ఈ పోర్టల్‌ను 50 వేలకు పైగా యూజర్లు ఓపెన్ చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. భూ భారతి పోర్టల్లో సిఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిల ఫోటోలు ఉన్నాయి. పోర్టల్లో రిజిస్ట్రేషన్లు, మ్యూటేషన్, ఈ చలాన్, అప్లికేషన్ స్టేటస్, ఆర్‌వోఆర్ కరెక్షన్, అప్పీల్ భూముల వివరాలు, మార్కెట్ విలువ, నిషేధిత భూములు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ వివరాలు, ఇతర రకాల పేరితో ప్రత్యేక మ్యాడ్యుల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ భూ భారతి పోర్టల్ జూన్ 2వ తేదీ నుంచి పూర్తి స్థాయిలోనఅందుబాటులోకి రానుంది.

## యువ వికాసంలో డైరీ, ఉద్యాన పంటలు

### ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** రాజీవ్ యువ వికాసంలో కుటీర పరిశ్రమలు, పాల ఉత్పత్తి కోసం డైరీ, కూరగాయల పెంపకం, ఫ్లోరీ కల్చర్ వంటివి యువతకు ఎంతో ఉపయోగం అని ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. తెలంగాణ రైతు మహోత్సవం ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతూ హైదరాబాద్‌కు ప్రతిరోజు లక్షలీటర్ల పాలసరఫరా కొరత ఉందని, డయిరీతో లాభాలు ఆర్జించవచ్చన్నారు. అలాగే కూరగాయలు, ఫ్లవర్స్ కొరత తీవ్రంగా ఉన్నాయని, వాటి సరఫరాపై యువత దృష్టిని సారిస్తే ఆర్థిక స్థోమత పెరుగుతుందని చెప్పారు. ప్రతి రోజు ఇతర రాష్ట్రల నుంచి ఇవన్నీ హైదరాబాద్‌కు సరఫరా అవుతున్నాయని అన్నారు. ఈ పథకం ద్వారా యువత ప్రభుత్వంఅందించె సబ్సిడీతో లాభాలు సాధించ వచ్చని పేర్కొన్నారు. వీటితో పాటు, మొక్క జొన్న, గోధుమలతో వాల్యూ యాడెడ్ ఉత్పత్తి వ్యాపారం, పౌల్ట్రీ, గుడ్ల వ్యాపారం, చిరు దాన్యాల సాగు మంచిదన్నారు.

## ఎరువుల వినియోగం ఆందోళనకరం

**హైదరాబాద్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త:**తెలంగాణలో పంటల సాగులో రసాయనిక ఎరువులవాడకం ఏటా భారీగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. పైర్లు పచ్చగా, ఏపుగా పెరిగి అధిక దిగుబడులు సాధించాలన్న ఉద్దేశ్యంతో రైతులు అధిక శాతం విష రసాయనాలను విచ్చలవిడిగా వాడుతున్నారు. దీంతో పంట పొలాల్లో భాస్వరం నిల్వలు భారీగా పేరుకుపోయినట్లు అధికారులు గుర్తించారు. తెలంగాణలో ప్రతీ ఏటా వానాకాలం, యాసంగి వ్యవసాయ సీజన్లలో ఒక్క యూరియానే 20 లక్షల టన్నులకు పైగా వినియోగిస్తున్నారని అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. కొన్ని జిల్లాల్లో భాస్వరం, నత్రజని, పొటాష్ ఎక్కువగా ఉన్నా మళ్లీ రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. ఏడేళ్ల కాలంలో తెలంగాణలో ఏకంగా 38 శాతం డై అమ్మోనియం ఫాస్పేట్ వినియోగిం పెరిగింది. ప్రధాన వాణిజ్య పంట పత్తితో సహా పసుపు, వేరుశెనగ తదితర పంటలు, కూరగాయలు, పండ్ల తోటలు అధికంగా సాగు చేసే ప్రాంతాల్లో భూసార పరీక్షలు నిర్వహిస్తే అందులో అవసరానికి మించి భాస్వరం ఉన్నట్లు తేలింది. అయినా రాష్ట్రంలో వానాకాలం, యాసంగి సీజన్లలో ప్రతీ ఏటా 5 లక్షల టన్నులకు పైగా డై అమ్మోనియం ఫాస్పేట్‌ను పొలాల్లో చల్లుతున్నట్లు అధికారులు గుర్తించారు.

## నిరంతర విద్యుత్‌లో రాష్ట్రానికి సహకరిస్తాం

### సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ చైర్మన్ శ్యాం ప్రసాద్

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** తెలంగాణలో నిరంతర విద్యుత్ సరఫరా కోసం అవసరమైన పూర్తి సహకారాన్ని అందజేస్తామని కేంద్ర ఎలక్ట్రిసిటీ అథారిటీ చైర్మన్ ఘన్ శ్యాం ప్రసాద్ హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో విద్యుత్‌డిమాండ్, సరఫరా, రెన్యువబుల్ విద్యుత్ లక్ష్యాల సాధనకు తీసుకుంటున్న చర్యలు, రాష్ట్రంలో అమలవుతున్న ప్రాజెక్టుల పురోగతి తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భగా తమ సంస్థలలో అమలవుతున్న ప్రాజెక్టుల వివరాలు, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలను రాష్ట్ర విద్యుత్ సంస్థల అధికారులు నివేదించారు.సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ 2025లో రాష్ట్ర గరిష్ట విద్యుత్ డిమాండ్ 16877 మెగా వాట్లుగా ఉంటుందని ప్లాన్‌లో పొందుపరచారు. కానీ వాస్తవానికి ఈ ఏడాది మార్చి 20న 17162 గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదయ్యిందని వివరించారు. 2030 నాటికి 24215 మెగావాట్లు, 2035 నాటికి గరిష్ట విద్యుత్ డిమాండ్ 31809 మెగావాట్లకు చేరుతుందని అంచనా వేయడం జరిగిందని చెప్పారు. అలాగే గ్రేటర్ హైదరాబాద్‌లో 2030 నాటికి గరిష్ట విద్యుత్ డిమాండ్ 9089 మెగావాట్లకు చేరుతుందని అంచనా వేసినట్లు పేర్కొన్నారు. కేంద్ర నూతన మరియు పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ నిర్ణయించిన లక్ష్యాలను అందుకోవడం కోసం తెలంగాణ విద్యుత్ సంస్థలు ఒక ప్రణాళికను రూపొందించాయన్నారు. దాని ప్రకారం రాష్ట్రంలో సోలార్, విండ్, బ్యాటరి ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ ప్రోత్సాహం ద్వారా లక్ష్యాలను చేరుకుంటామని వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరం రాష్ట్రంలో నమోదయిన గరిష్ట విద్యుత్ డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని రిసోర్స్ ఎడిక్వసీ ప్లాన్ (2024 25 నుండి 2034-35)ను రివైజ్ చేయాలని కోరారు. కుసుమ పథకం కెపాసిటీను పెంచాలని సూచించారు. దీనికి తోడు బడ్జెట్, రెగ్యులేటరీ విషయాల్లో తెలంగాణ విద్యుత్ సంస్థలకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్, దక్షి ణ, ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల సిఎండిలు ముషారఫ్ ఫరూఖీ, వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పౌరసరఫరాల శాఖలో సంస్కరణలు వినూత్నం

### ఇపాస్ సిస్టం విజయవంతం

### గుజరాత్ పౌర సరఫరాల శాఖముఖ్య కార్యదర్శి, రమేష్ చంద్ర మీనా




**హైదరాబాద్, ఏప్రిల్ 15,ప్రభాతవార్త:** తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం పౌర సరఫరాల శాఖలో తీసుకొచ్చిన సంస్కరణలతో అద్భుతమైన ఫలితాలు సాధించడం ఆహ్వానించదగిన పరిణామని గుజరాత్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖా ముఖ్య కార్యదర్శి రమేష్ చంద్ర మీనా కొనియాడారు. అన్నింటికీ మించి పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టంలో ప్రవేశ పెట్టిన ఇ-పాస్ సిస్టం ప్రజా పంపిణీ వ్యవస్థలో లోపాలను సరిదిద్దెందుకు దోహదపడుతుందని రమేష్ చెప్పారు. పౌర సరఫరాల శాఖలో రాష్ట్ర ప్రభుత్వం సంవత్సరంకాలంలో తీసుకొచ్చిన సంస్కరణలను అధ్యయనం చేసేందుకు గుజరాత్ పౌరసరఫరాల శాఖ ముఖ్యకార్యదర్శి మంగళవారం హైదరాబాద్ సందర్శనకు వచ్చారు.ఈ సందర్భంగా పంజాగుట్ట,ఏ.జి కాలనీలలోని జనపోషణ కేంద్రాలను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి డి.ఎస్.చౌహాన్ లతో కలసి ఆయన పరిశీలించారు.పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టం పారదర్శకంగా సాగేందకు ఇ-పాస్ సిస్టం దోహదపడుతుందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలను స్వాగతిస్తున్నామన్నారు. ప్రజాపంపిణి వ్యవస్థ ద్వారా నిరుపేదలకు ఉచితంగా అందిస్తున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం అద్భుతమని ఆయన ప్రశంసించారు.తెలంగాణ రాష్ట్ర బియ్యానికి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రోజు రోజుకు పెరుగుతున్న డిమాండ్ పెరుగుతోన్నదని అన్నారు. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం పిలిప్పీన్ కు బియ్యం ఎగుమతికి ఒప్పందం కుదుర్చుకోవడం అభినందనీయమని ఆయన కొనియాడారు.సన్నాలు పండించిన రైతులకు క్వింటా ఒక్కంటికీ 500 రూపాయలు బోనస్ అందించడంతో అది కూడా రైతు ఖాతాలో నేరుగా జమఅయ్యేవిధంగా తీసుకున్న కార్య చరణపై ఆయన ఆరా తీశారు. మహాలక్ష్మి పథకం కింద అర్హులైన ఎల్ పి జి లబ్దిదారులకు 500 సబ్సిడీ అందించడానికి లబ్దిదారులను ఎంపిక చేసిన విధానంను ఆసక్తిగా అడిగి తెలుసుకొన్నారు..ప్రజాపంపిణీ వ్యవస్థను పారదర్శకంగా నడిపించడంతో పాటు బలోపేతం చేసేందుకు తీసుకొచ్చిన సంస్కరణలు ధాన్యం కొనుగోలులో వచ్చిన మార్పులు మార్గదర్శనం గా నిలుస్తున్నాయని రమేష్ చంద్ర మీనా వ్యాఖ్యానించారు.

# అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఖాళీల వివరాలు ఇవ్వండి

### సేకరిస్తున్న ఉన్నత విద్యా మండలి

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:**తెలంగాణ రాష్ట్రంలోని యూని వర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీ ప్రక్రియ వేగం పుంజుకుంది. ఎస్సీ వర్గీకరణతోపాటు ఉపకులాలకు రోస్టర్ పాయింట్లను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ ప్రక్రియ వేగం పెరిగింది. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల వివరాలను ఇవ్వాలని పేర్కొంటూ తెలంగాణ ఉన్నత విద్యా మండలి విశ్వవిద్యాలయాలకు లేఖలు రాసింది. గతంలోనూ ఇలానే యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల వివరాలను సేకరించారు. అయితే ఈ వివరాలు గత రెండు సంవత్సరాల క్రితం సేకరించిన నేపథ్యంలో.. ఈ సమయంలో పదవి విరమణ పొందిన వారు ఉంటారు కాబట్టి.. ప్రస్తుతం యూనివర్సిటీల్లో మంజూరైన అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఎన్ని?ప్రస్తుతం పనిచేస్తున్న వారు ఎంత మంది? ఎన్ని పోస్టులు ప్రస్తుతానికి ఖాళీగా ఉన్నాయనే వివరాలను స్పష్టంగా ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ఉన్నత విద్యా మండలి వర్సిటీలకు లేఖలు రాసింది. ఒక్క ఉస్మానియా యూనివర్సిటీలోనే 1572 పోస్టులు మంజూరు కాగా వాటిలో 458 మంది పనిచేస్తుండగా.. 1114 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గతంలో వివరాలు సేకరించినప్పుడు మొత్తం ఖాళీలు 20260 ఉన్నట్టుగా చెప్పగా.. ప్రస్తుతం 2125 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు తెలుస్తోంది. అందుకే పూర్తి వివరాలను స్పష్టంగా ఇవ్వాలని కోరుతూ ఉన్నత విద్యా మండలి యూనివర్సిటీలకు లేఖలు రాసింది.

ఇప్పటికే ఒకటి, రెండు యూనివర్సిటీలు తమ విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల వివరాలను పంపించినట్టు తెలిసింది. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల వివరాలను ప్రభుత్వానికి ఉన్నత విద్యా మండలి సమర్పించనుంది.

# యువ వికాసానికి 15.60 లక్షల దరఖాస్తులు

### రూ.6 వేల కోట్లతో అమలు

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త:** ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీలకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి దరఖాస్తుల స్వీకరణ గడువు ముగిసింది. ఈ పథకం కోసం రాష్ట్రవ్యాప్తంగా సోమవారం అర్ధరాత్రి ముగిసింది. అయితే సాయంత్రానికే 15.60 లక్షల దరఖాస్తులు వచ్చినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే రేషన్‌కార్డు లేక, ఆదాయం సర్టిఫికెట్లు మంజూరు కాక లక్షలాది మంది దరఖాస్తు చేసుకోనట్టు వెల్లడైంది. రాజీవ్ యువవికాసం పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ తదితర వర్గాలకు రూ.6వేల కోట్లను సబ్సిడీ రుణాలుగా అందిస్తామని ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. దరఖాస్తుల స్వీకరణను మార్చి 24న ప్రారంభించగా, తొలుత ఈనెల 5 వరకే గడువు విధించింది. ఆ తరువాత 14వ తేదీ వరకు పొడిగించింది. ఈ గడువు ముగియంతో మరోసారి పెంచుతుందా లేదా అనేది సందిగ్ధమవుతోంది. 21 నుంచి 60 ఏళ్ల లోపు వారు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. గ్రామీణ ప్రాంతంలో వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలలోపు ఉండాలి. అదే పట్టణ ప్రాంతంలో వార్షిక ఆదాయం రూ.2 లక్షల లోపు ఉండాలి. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వర్గాల యువత సొంతంగా ఉపాధి పొందేందుకు ఆర్థిక సహాయం చేసే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ యు వ వికాసంపథకాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారం భించింది. ఈ పథకం ద్వారా యువతకు వారు కోరుకున్న రంగాల్లో ఉపాధి పొందేందుకు రాయి తీతో కూడిన రుణాలను గరిష్టంగా రూ.4లక్షల వరకు అందించనుంది. దీంతో భారీ సంఖ్యలో పథకానికి దరఖాస్తులు చేసుకున్నారు.

# జపాన్ పర్యటనకు వెళ్లిన సిఎం రేవంత్‌రెడ్డి

### శ్రీధర్‌బాబుతో పాటు అధికారుల బృందం పయనం

### టోక్యో, మోంట్‌ఫుజి, ఒసాకా, హీరోషిమాలో పర్యటన

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.ఎప్రిల్15:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రతినిధి బృందం జపాన్ పర్యటనకు వెళ్లింది. ఈ నెల 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఈ పర్యటన సాగనుంది. ఈ మేరకు మంగళవారం రాత్రి బెంగుళూరు ఎయిర్‌పోర్టు నుంచి ముఖ్యమంత్రితో పాటు ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, అధికారులు జపాన్‌కు వెళ్లారు.

టోక్యో, మోంట్ ఫుజి, ఒసాకా, హీరోషిమాలో ముఖ్యమంత్రి బృందం పర్యటి స్తుంది. ఓసాకా వరల్డ్ ఎక్స్పో 2025లో తెలంగాణ పెవిలియన్‌ను ప్రారంభిస్తుంది.ఆ దేశానికి చెందిన ప్రముఖ కంపెనీలు, పారిశ్రామిక వేత్తలు, పలువురు ప్రతినిధులతో ముఖ్యమంత్రి బృందం సమావేశమవుతుంది. రాష్ట్రంలో పెట్టు బడులు, పారిశ్రామిక సాంకేతిక సహకారంపై ప్రధానంగా చర్చలు జరుపుతుంది.

# భూ భారతి నిబంధనల జీవో విడుదల: నవీన్ మిట్టల్

**హైదరాబాద్, ఏప్రిల్ 15 ,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం సోమవారం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని భూభారతి పోర్టల్‌ను ఆవిష్కరించింది. ఈ నేపథ్యంలో ఇందుకు సంబంధించిన నియమ నిబంధనల(రూల్స్)ను రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ తెలుపుతూ జీవో నెం 39 విడుదల చేశారు.దీని ప్రకారం భూ భారతి చట్టం 2025 ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా లీగల్ సౌకర్యం కల్పించడమే కాకుండా మహిళలు, వికలాంగులకు సైతం ఈ వెసులు బాటు ఉన్నది. భూ సమస్య పరిష్కారంలో అధికారుల నిర్ణయాలపై అసంతృప్తి నెలకొంటే, ఫస్ట్, సెకండ్ అప్పీల్స్ చేసుకునే అవకాశం ఉందని, ఈ అప్పీల్స్‌ను ఉన్నత స్థాయి అధికారులు నేరుగా పరిశీలించే అవకాశం కూడా ఉన్నట్లు నిబంధనల్లో స్పష్టం చేశారు. రాష్ట్రంలోని భూమి రికార్డులు, యాజమాన్య హక్కులు, లావాదేవీల సమస్యలను సులభతరం చేసేందుకు ప్రజల సౌకర్యార్థం, ఈజీ ప్రాసెస్‌ను అమలు చేసేందుకు క్రమంగా మరిన్ని రూల్స్‌ను కూడా తయారు చేయనున్నారు. అన్ని గ్రామాల్లో వ్యవసాయ, వ్యవసాయేతర, అబాదీ భూములు రికార్డులను రికార్డింగ్ అథారిటీ తయారు చేసి భూ భారతి పోర్టల్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. భూమి సర్వే, సబ్ డివిజన్ మ్యాప్‌లను లైసెన్స్‌డ్ సర్వేయర్లు తయారు చేయడమే కాకుండా తప్పులు, వివాదాలకు ప్రత్యేక గడువు ఆధారంగా పరిష్కరించన్నట్లు వెల్లడించారు. గ్రామ స్థాయిలో భూ రికార్డులను భూ భారతి పోర్టల్ ద్వారా ఎలక్ట్రానిక్‌గా అప్డేట్ చేసి దీని కోసం 5 రిజిస్టర్లను మెయింటెయిన్ చేయనున్నారు. గ్రామ స్థాయిలో విలేజ్ అకౌంట్స్ కూడా డిజిటల్‌గా నిర్వహిస్తామని వీటిలో పహాణీ, ప్రభుత్వ భూముల రిజిస్టర్, ట్రాన్స్‌ఫర్ రిజిస్టర్, ఇరిగేషన్ రిజిస్టర్ వంటివి ఉంటాయన్నారు. అంతే కాకుండా మ్యుటేషన్ జరిగినప్పుడల్లా ఈ రికార్డులను అప్డేట్ చేయనున్నట్లు ఉత్తర్వులో తెలిపారు. ప్రతి డిసెంబర్ 31న స్నాప్ షాట్ తీస్తామని, దీంతో రికార్డులు సురక్షితంగా ఉంటాయని, సర్టిఫైడ్ కాపీలు రూ.10కి అందుబాటులో ఉంటాయని నిబంధనల్లో స్పష్టం చేశారు.భూ రికార్డుల సవరణ, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, భూధార్ కార్డ్, పట్టాదార్ పాస్‌బుక్, నమోదు కాని లావాదేవీలు వంటి విషయాల్లో అధికారుల నిర్ణయాలపై అసంతృప్తి ఉంటే అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు.

తహసీల్దార్ ఆర్డర్‌పై రికార్డ్ సవరణ విషయంలో ఆర్డీఓకు 30 రోజుల్లో అప్పీల్ చేసుకోవడమే కాకుండా ఆర్డీఓ నిర్ణయంపై జిల్లా కలెక్టర్‌కు, కలెక్టర్ ఆర్డర్‌పై ల్యాండ్ ట్రైబ్యునల్‌కు 30 రోజుల్లో అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, భూధార్, పాస్ బుక్ వంటి విషయాల్లో తహసీల్దార్ నిర్ణయంపై ఆర్డీఓకు 60 రోజులు, నమోదు కాని లావాదేవీలు, ఇతర మ్యుటేషన్‌లపై ఆర్డీఓ నిర్ణయంపై కలెక్టర్‌కి 60 రోజుల్లో చేసే వెసులుబాటు ఉన్నట్లు తన ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. రెండో అప్పీల్‌లో ఆర్డీఓ ఆర్డర్‌పై జిల్లా కలెక్టర్‌కు, కలెక్టర్ నిర్ణయంపై ల్యాండ్ ట్రైబ్యునల్‌కు 30 రోజుల గడువులో అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు.అన్ని అప్పీల్స్ భూ భారతి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో రూ.1,000 ఫీజు చెల్లించాలన్నారు.వ్యవసాయ, అవ్యవసాయ, అబాదీ భూముల రికార్డులు భూ భారతి పోర్టల్లో అందుబాటులో ఉంటాయని, సర్వే, మ్యాప్‌లను లైసెన్స్‌డ్ సర్వేయర్‌లు తయారు చేస్తారన్నారు.రికార్డ్ ఆఫ్ రైట్స్‌లో తప్పులను సవరించడానికి ఒక సంవత్సరం గడువులో ఆన్‌లైన్ దరఖాస్తు చేయవచ్చని 60 రోజుల్లో పరిష్కారం లభిస్తుందన్నారు. కొనుగోలు, గిఫ్ట్, తాకట్టు వంటివి పోర్టల్ ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చని,తహసీల్దార్ కొత్త పట్టాదార్ పాస్‌బుక్ జారీ చేస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2014కి ముందటి నమోదు కాని లావాదేవీలను సన్నకారు రైతులు 90 రోజుల్లో రెగ్యులరైజ్ చేయవచ్చున్నారు.వీలు నామా, వారసత్వపు మ్యుటేషన్ కోసం 30 రోజుల్లో ఆర్డర్, ఆటోమేటిక్ మ్యుటేషన్ జరుగుతుం దన్నారు. వివాదాలు లేని భూములకు తాత్కాలిక/పర్మినెంట్ భూధార్ కార్డ్, యూనిక్ ఐడీతో ఇవ్వనున్నట్లు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. భూ భారతి యాక్ట్ 2025ప్రకారం మ్యుటేషన్ఎకరానికి రూ.2,500 -రికార్డ్ సవరణ/అప్పీల్:రూ.1,000-పాస్‌బుక్ రూ.300-సర్టిఫైడ్‌కాపీరూ.10 చెల్లించాలన్నారు.

# వడదెబ్బతో మృతిచెందిన కుటుంబాలకు రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్.ఏప్రిల్15:** తెలంగాణ రాష్ట్రంలో వడదెబ్బ కారణంగా ప్రాణాలు కోల్పోతున్న సంఘటనల నేపథ్యంలో ప్రభుత్వం కీలకనిర్ణయం తీసుకుంది. వడదెబ్బను రాష్ట్ర విపత్తుగా పరిగణిస్తూ, మరణించిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియాను చెల్లించనున్నట్లు ప్రకటించింది. గతంలో వడదెబ్బతో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.50 వేల ఎక్స్‌గ్రేషియాను మాత్రమే అందించేవారు. అయితే, ఇప్పుడు రాష్ట్ర విపత్తు సహాయ నిధి కింద ఆ మొత్తాన్ని రూ.50 వేల నుంచి రూ.4 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వడగాల్పుల ప్రభావం నుంచి రక్షించుకోవడానికి స్థానిక అధికారులు జారీ చేసే ఆరోగ్య సూచనలను ఖచ్చితంగా పాటించాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఎండలో ఎక్కువ సమయం గడపకుండా, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం కోరింది. వడదెబ్బ ప్రభావం గురించి ప్రజల్లో అవగాహన పెంచడానికి, సంబంధిత ఆరోగ్య శాఖలు, విపత్తు నిర్వహణ సంస్థలు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టనున్నాయి. గ్రామ స్థాయి నుంచి నగరాల వరకు ఈ అవగాహన చర్యలు కొనసాగ నున్నాయి. ఉదయం 11 నుంచి 5గంటల వరకు వేడిగాల్పులు కొనసాగు తున్నాయని అధికారులు తెలిపారు. ఔట్‌డోర్‌లో పనిచేసే కార్మికులను రక్షించడానికి ప్రస్తుతం ప్రభుత్వ చర్యలు చేపట్టింది. అందులో భాగంగా వడగాల్పులను ప్రభుత్వం విపత్తుగా ప్రకటించింది. వడగాల్పుల మరణాలపై జాతీయ స్థాయిలో నష్టపరిహారం చెల్లించే పాలసీ లేదు. కొన్ని రాష్ట్రాలు మాత్రమే పరిహారం చెల్లిస్తున్నాయి. ప్రస్తుతం తెలంగాణ కూడా ఆ జాబితాలో చేరిపోయింది.ఒక వ్యక్తి వడ దెబ్బతో చనిపోయారో లేదో తెలుసుకునేందుకు డాక్టర్లుపోస్టుమార్టం చేస్తారు.ఆతరువాత పిహెచ్ సి డాక్టర్, ఎమ్మార్వో, ఎస్ఐలతో కూడిన కమిటీ ధ్రువీకరించాల్సి ఉంటుంది. అప్పుడుమాత్రమే ప్రభుత్వం నుంచి పరిహారం అందుతుంది. పోస్ట్ మార్టం చేయకుంటే నష్ట పరిహారం అందదు.




మంగళవారం హైదరాబాద్‌లో సరస్వతి పుష్కరాల యాప్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్‌బాబు, అధికారులు

# కాళేశ్వరం సరస్వతి పుష్కరాల యాప్, వెబ్ పోర్టల్ ప్రారంభం

### పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్ బాబు

**హైదరాబాద్, ఏప్రిల్ 15 ,ప్రభాతవార్త :**వచ్చే నెల 15 నుంచి 26 వరకు జరగనున్న సరస్వతి పుష్కారాలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహించనుంది. ఈనేపథ్యంలో మంగళవారం సచివాలయంలో సరస్వతి నదీ పుష్కరాల యాప్, వెబ్ పోర్టల్‌ను దేవాదాయధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఐటి,పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మట్లాడుతూ సరస్వతీ పుష్కరాలు పండుగకు స్నానఘాట్ల విస్తరణతో సహా వివిధ అభివృద్ధి పనులను విస్తృతంగా చేపట్టినట్లు తెలిపారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వంలో గతంలో సరస్వతి పుష్కరాలు నిర్వహించామని, ఇప్పుడు కూడా అవకాశం మాకు రావడం ఆ భగవంతుడి ఆశీస్సులున్నాయన్నారు.అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ తమ ప్రభుత్వం దేవాలయాల విషయంలో చాలా క్రియాశీలకంగా పని చేస్తుందని, గత ప్రభుత్వం దేవాదాయ శాఖ సంబంధిత వ్యవహారాలను పూర్తిగా నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. ఈ సరస్వతీ పుష్కరాలకు రోజుకు 50 వేల నుంచి లక్షదాకా వస్తారని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. సరస్వతి పుష్కరాలను పునస్కరించుకుని 17 అడుగుల రాతి సరస్వతి విగ్రహం ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ అధ్వర్యంలో జిల్లా యంత్రాగం మొత్తం పుష్కరఏర్పాట్ల పనులలో నిమగ్నమై ఉన్నట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ (ఎండోమెంట్స్) శైలజా రామయ్యర్(ఐఎఎస్), కమిషనర్ శ్రీధర్(ఐఎఎస్), ధార్మిక పరిషత్ అడ్వైజర్ గోవింద హరి, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఆలయ ఈవో మహేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.



మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎం.నర్సింహ్మా

# మే 20న కార్మిక సంఘాల సమ్మెను విజయవంతం చేయాలి

### ఎఐటియుసి నేత ఎం.నర్సింహ్మా పిలుపు

**హైదరాబాద్ (సైఫాబాద్), ఏప్రిల్ 15 ప్రభాతవార్త:** కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మార్చి యాజమాన్యాలకు అనుకూలంగా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న 4 లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ మే 20వ తేదీన దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయడానికి హైదరాబాద్ నగరంలో విస్తృత ప్రచారం నిర్వహించాలని అన్ని కార్మిక సంఘాలు నిర్ణయించాయి. ఈ మేరకు మంగళవారం సత్యనారా యణరెడ్డి భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా మాటాడుతూ బిజెపి ప్రభుత్వం పది సంవత్సరాలుగా ప్రజలను, కార్మికులను మరొక బానిసత్వంలోకి తీసుకువెళ్ళే పద్ధతిలో రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మ శాస్త్రాన్ని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నదని, ప్రస్తుతం కార్మిక చట్టాలను మార్చే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. కార్మికులను, ప్రజలను సన్నద్ధం చేసేందుకు ఈనెల 19న కోఠిలో, మే 6న సికింద్రాబాద్‌లో, 10వ తేదీన అమీర్‌పేటలో విస్తృతంగా కరపత్రాలను పంపిణి చేసి, మే 18న హైదరాబాద్ నగర వ్యాప్తంగా బైక్ ర్యాలీని నిర్వహిస్తున్నామని చెప్పారు. మే 20వ తేదీన సార్వత్రిక సమ్మెలో భాగంగా ఇందిరాపార్కు వద్ద భారీ బహిరంగ సభ నిర్వసు_న్నామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిఐటియు నగరఅధ్యక్షుడు జె.కుమారస్వామి తదితరులున్నారు.

తెలంగాణ రాష్ట్రం

**పెద్దపల్లి :: మునిసిపల్ కౌన్సిల్ కార్యాలయం, జిల్లా :: పెద్దపల్లి**

**ఆసక్తి వ్యక్తీకరణ ప్రకటన**

R.No.E1/834/PDPL/2025-26, తేది: 15.04.2025

పెద్దపల్లి జిల్లా, పెద్దపల్లి మునిసిపాలిటీలో 2025-26 సంవత్సరానికి, క్రింది వివిధ పనులకు అనుభవం గల ట్రేడర్లు/ఏజెన్సీలు/కాంట్రాక్టర్ల నుండి కొటేషన్లకు పిలుపునిస్తూ సీల్డ్ కవర్‌లలో ఆసక్తి వ్యక్తీకరణ కొరకు కొటేషన్‌లను కోరుతూ ఇందుమూలంగా ఆహ్వానించడమైనది. ట్రీటింగ్ బీట్, ప్లాంట్లు, చెట్లు, విత్తనాలు, వెదురు కర్రలు, ట్రీ గార్డ్‌లు, టూల్స్, షేడ్ నెట్, పోల్స్, పాలిథిన్ సంచులు, కంపోస్ట్ ఎరువులు/రసాయనాలు, పైప్‌లు స్ప్రింక్లర్‌లు, నీటి సరఫరాకు ఐటమ్‌ల సరఫరా, లీకేజ్ సామగ్రి, గేట్ వాల్వ్‌లు, మోటార్‌లు, పంపులు, విద్యుత్ సామగ్రి, కంప్యూటర్‌లు మరియు ప్రింటర్‌లు, కీబోర్డ్‌లు, మౌజ్‌లు మరియు ఇతర పెరిఫెరల్స్, వార్షిక నిర్వహణకు బోర్‌వెల్స్ సామగ్రి, పారిశుధ్య వాహనాల కొనుగోలు (స్వచ్ఛ ఆటోలు, ట్రైలర్స్‌తో ట్రాక్టర్‌లు, ఇ-ఆటోలు స్వీపింగ్ మెషీన్, ఫూడికతీత యంత్రాలు మరియు ఏ ఇతర వాహనాలు. పారిశుధ్య పరికరాలు, సామగ్రి బ్లీచింగ్ పౌడర్, లైమ్ పౌడర్, సబ్బులు, బట్టలు, తువ్వాళ్లు, PPE కిట్స్, పారిశుధ్య టూల్స్, తట్ట, పార, గడ్డిపార, డస్ట్‌బిన్‌లు, చీపుళ్లు వగైరాల మరియు వాహన నిర్వహణ/మరమ్మతుల (నూనెలు, గ్రీజ్, టూల్స్, టైర్‌లు, ట్యూబ్‌లు, మెటల్ షీట్‌లు, షెడ్‌లు, వెల్డింగ్ వగైరా) మరియు కార్యాలయ స్టేషనరీ/కార్యాలయ సామగ్రి, కుర్చీలు, టేబుల్స్ వంటి ఫర్నీచర్, సివిల్ పనులకు ఇంజనీరింగ్ పరికరాలు, అవుట్‌డోర్ జిమ్ పరికరాలు, మరియు పిల్లల క్రీడా పరికరాలు, ఇన్వర్టర్‌లు, బ్యాటరీలు, బయోమెట్రిక్ యంత్రాలు, బోర్‌వెల్ యొక్క డ్రిల్లింగ్, LED స్ట్రిప్ లైటింగ్ అన్ని రంగులు, అలంకార మరియు విద్యుత్ స్తంభాలు, మరియు లైట్‌లు (అన్ని రకాలు) మరియు అన్ని రకాల మొక్కలు, సుందరీకరణ, గడ్డి, విగ్రహాలు, శిల్పాలు, అలంకార సంబంధిత షేప్‌లు, ఫౌంటెన్‌లు వగైరా. దరఖాస్తుల దాఖలుకు చివరి తేది: 22-04-2025 సమయం: మ.3.00 గం. **ఐటమ్‌ల సరఫరా కొరకు నిబంధనలు:** 1. ఏ రాష్ట్రంలోనైనా, ఏ డిపార్ట్‌మెంట్‌లోనైనా ట్రేడర్లు/ఏజెన్సీ/కాంట్రాక్టర్ జాబితాలో ఉండవలెను. 2. తెలంగాణ ప్రభుత్వంతో తగిన రిజిస్ట్రేషన్ యొక్క క్లాస్ కలిగి ఉన్న కాంట్రాక్టర్లు/సంస్థలు అర్హులు. 3. ఇదే తరహా పనుల యొక్క స్వభావం/సంబంధిత MOU దాఖలు చేసిన అనుభవం గల ఏజెన్సీ/కాంట్రాక్టర్ మాత్రమే పరిగణించబడతారు. 4. GST రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్. 5. పాన్ కార్డ్ మరియు తాజా IT రిటర్న్‌లు. 6. పై నిబంధనలను నెరవేర్చే/అంగీకరించే సంస్థ మాత్రమే దరఖాస్తు పెట్టవలెను. 7. మునిసిపల్ కమిషనర్, పెద్దపల్లి వారికి సీల్డ్ EOIను అంగీకరించే లేదా తిరస్కరించే అన్ని అధికారాలు కలిగి ఉన్నారు. ఏ ఇతర వివరాలకైనా పెద్దపల్లి మునిసిపాలిటీ కార్యాలయ పనివేళలలో సంప్రదించవచ్చును. సంప్రదించవలసిన మొబైల్ నం: మునిసిపల్ కమిషనర్-(9100902361) మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్-(9490862431).

DIPR.No.380-PP/CL/Advt/1/2025-26, తేది: 15.04.2025 సం/- కమిషనర్, పెద్దపల్లి మునిసిపాలిటీ

संगीत नाटक अकादेमी | Sangeet Natak Akademi

**నేషనల్ అకాడమీ ఆఫ్ మ్యూజిక్, డాన్స్ & డ్రామా**

రవీంద్ర భవన్, 35 ఫిరోజ్ షా రోడ్, న్యూఢిల్లీ-110 001

టెలి: 011-23386648, 23387246, 23387247, 23387248

ఇ-మెయిల్: mail@sangeetnatak.gov.in

**కుటియట్టం కేంద్రం, తిరువనంతపురం, కేరళ ప్రాజెక్ట్ డైరెక్టర్ యొక్క ఉద్యోగానికి కాంట్రాక్ట్ ప్రాతిపదికన దరఖాస్తులు కోరబడుతున్నవి**

భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖచే పూర్తి నిధులు సమాకూర్చబడిన స్వతంత్ర సంస్థ సంగీత నాటక అకాడమీ, కుటియట్టం కేంద్రం, తిరువనంతపురం, కేరళ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఒక ఉద్యోగం కొరకు కాంట్రాక్ట్ ప్రాతిపదికపై, మొదటి ఒక సంవత్సర కాలానికి, తదుపరి ఒక్కొక్క సంవత్సరం చొప్పున గరిష్టంగా 3 సంవత్సరాల పొడిగింపు ప్రాతిపదికన ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉద్యోగ భర్తీ నిమిత్తం అర్హులైన భారతీయ పౌరుల నుండి దరఖాస్తులు కోరుతోంది. సంగీత నాటక అకాడమీ (SNA), న్యూఢిల్లీ యొక్క కేంద్రంగా కుటియట్టం కేంద్రం ఉంది.

అర్హతా ప్రమాణం అనగా విద్యార్హతలు, అనుభవం, వయస్సు, వేతనం మరియు దరఖాస్తు నమూనా వగైరా వివరాలకు దయచేసి మా వెబ్‌సైట్ (http://sangeetnatak.gov.in/sna) వీక్షించండి. దరఖాస్తు దాఖలుకు చివరి తేదీ ప్రకటన తేదీ నుండి 20 రోజులు.

ఏదైనా / లేదా అన్ని దరఖాస్తులు, తిరస్కరణ లేదా ప్రొసీడింగ్స్ / నియామకం ఎప్పుడైనా దానికి ఎటువంటి కారణం చెప్పనక్కర్లేకుండానే రద్దు చేయడానికి అకాడమీకి హక్కు రిజర్వ్ అయి ఉన్నది.

సెక్రటరీ
సంగీత నాటక అకాడమీ
న్యూఢిల్లీ

CBC 09114/12/0001/2526

# 'కుబేర' ఫస్ట్ సింగిల్ డేట్ అనౌన్స్‌మెంట్

శేఖర్ కమ్ముల కుబేర ఫస్ట్ సింగిల్ ఏప్రిల్ 20, 2025న విడుదల కానుంది. డేట్‌ని అనౌన్స్ చేశారు. పాట యొక్క మరిన్ని వివరాలతో ప్రోమోను విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. శేఖర్ కమ్ముల కుబేర దేవి శ్రీ ప్రసాద్ మ్యూజికల్, ఇది నేషనల్ అవార్డు ముగ్గురూ కలిసి మాస్ డ్యాన్స్ నంబర్ ఇవ్వడం ఇదే మొదటిసారి. విడుదల చేసిన పోస్టర్‌లో ధనుష్ డ్యాన్స్, విజిల్స్‌తో వేడుక వాతావరణం ఉంది. బ్యాక్ డ్రాప్‌లో డ్యాన్స్ చేస్తూ పెద్ద సంఖ్యలో జనం పండుగ మూడ్‌లో కనిపించారు. ఈ పాట ఫుట్ ట్యాపింగ్ మ్యూజిక్‌తో కూడిన మాస్ సాంగ్ అని హామీ ఇచ్చింది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతున్న పాన్‌ఇండియా చిత్రం కుబేర.



ధనుష్, నాగార్జున అక్కినేని, రష్మిక మందన్న, జిమ్ సర్భ్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం గ్రిప్పింగ్ థ్రిల్లర్‌గా నిలుస్తుంది. శేఖర్ కమ్ముల కుబేర ఎపిక్ సోషల్ డ్రామా రూపొందుతోంది. ఈ చిత్రం తమిళం, తెలుగు భాషల్లో ఒకేసారి భారీ స్థాయిలో చిత్రీకరించబడుతోంది. గ్రహీత దర్శకుడు శేఖర్ కమ్ముల, నేషనల్ అవార్డు గ్రహీత సంగీత దర్శకుడు డీఎస్పీ మొదటిసారి కలిసి చేస్తున్న చిత్రం! మరో ఎక్సయిటింగ్ విషయం ఏమిటంటే నేషనల్ అవార్డు గ్రహీత ధనుష్ ఫ్రేమ్‌లో ఉన్నారు! ఈ ఈ చిత్రానికి జాతీయ అవార్డు గ్రహీత, సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందిస్తారు. అద్భుతమైన తారాగణం, నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్, ఆసక్తికరమైన కథాంశంతో సంచలనం సృష్టించిబోతున్న శేఖర్ కమ్ముల కుబేర జూన్ 20, 2025న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# ఎమోషనల్ మూవీ 'అర్జున్ S/O వైజయంతి'

నందమూరి కళ్యాణ్ రామ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ అర్జున్ S/O వైజయంతి. ఈ చిత్రంలో విజయశాంతి పవర్ ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు. ఈ యాక్షన్‌ప్యాక్డ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో ఈ రెండు పాత్రలు మధ్య డైనమిక్స్ కీలకంగా వుండబోతున్నాయి. ఈ సినిమా ఏప్రిల్ 18న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు విలేకరులు సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. **అర్జున్ S/O వైజయంతి మూవీ ఎలా స్టార్ట్ అయింది?** కళ్యాణ్ రామ్‌తో ఒక సినిమా చేయాలనుకున్నాం. ఆయన ఎక్స్పెరి మెంటల్ ఫిలిమ్స్ ఎక్కువగా చేస్తున్నారు. ఒక మాస్ కమర్షియల్ సినిమాని ఆయనతో చేయాలని ఈ కథని సిద్ధం చేయించాం. కథ ఆలోచన దగ్గర నుంచి ప్రతిదీ కళ్యాణ్ రామ్ కోసం తయారుచేసినవే.



**దర్శకుడిగా ప్రదీప్‌ని ఎంపిక చేసుకోవడానికి కారణం?** ప్రదీప్‌తో నేనొక వెబ్ ఫిల్మ్ చేశాను. ఆయనతో నాకు మంచి ఎక్స్పీరియన్స్ ఉంది. అయినా కమర్షియల్ మీటర్ తెలిసిన డైరెక్టర్. ఈ కథకు ఆయన బెటర్ అనిపించింది. హై ఎమోషన్ వున్న ఈ సినిమాని ఆయన అద్భుతంగా తీశారు. **అశోక్ మీరు అలా ఎలా సినిమా చేసి పదేళ్లు అవుతుంది. మళ్లీ ఈ సినిమా చేయడం ఎలా అనిపించింది?** అలా ఎలా సినిమా నా ఫ్రెండ్ అనీస్ కోసం చేశాను. అందులో సునీల్ కూడా ఉన్నారు. ఆ సినిమాని సునీల్ నే ప్రమోట్ చేశారు. కళ్యాణ్ నా ఫ్రెండ్. అందరం కలసి ఒక సినిమా చేద్దామని ఈ ప్రాజెక్ట్ చేయడం జరిగింది. **విజయశాంతి పాత్ర గురించి?** లేడీ పోలీస్ ఆఫీసర్ అనగానే విజయశాంతి గుర్తుకు వస్తారు. కర్తవ్యం సినిమా స్ఫూర్తితో తీర్చిదిద్దిన పాత్రలో కనిపిస్తారు. ఈ కథని ఆమె ఒకే చేస్తారని మాకు గట్టి నమ్మకం. మా నమ్మకం ప్రకారం ఈ సినిమాని ఆమె ఒప్పుకోవడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఇందులో చాలా పవర్ ఫుల్ రోల్ చేశారు. **ఫైనల్ అవుట్ ఫుట్ చూసుకున్నాక మీ అంచనాలు అందుకున్నట్లు అనిపించిందా?** కచ్చితంగా. మేము అనుకున్న దాని కంటే సినిమా చాలా అద్భుతంగా వచ్చింది.



ఈషా రెబ్బా నయా లుక్

# 'ఓదెల 2' ప్రిరిలీజ్

తమన్నా భాటియా హై లీ యాంటిసిపేటెడ్ మూవీ ఓదెల 2లో నెవర్ బిఫోర్ క్యారెక్టర్‌లో అలరించడానికి సిద్ధంగా వున్నారు. సూపర్ నాచురల్ థ్రిల్లర్ ఓదెల రైల్వే స్టేషన్‌కి సీక్వెల్ ఇది. సంపత్ నంది సూపర్ విజన్‌లో అశోక్ తేజ దర్శకత్వంలో, మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్‌పై డి మధు నిర్మించిన ఈ చిత్రం ప్రమోషనల్ కంటెంట్‌తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. తమన్నా నాగ సాధువుగా, మిస్టరీ ఎనర్జీతో కూడిన పాత్రలో కనిపించనున్నారు. హెబ్బా పటేల్, వశిష్ట ఎన్ సింహా ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా టీజర్ ట్రైలర్ అంచనాలని నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్ళింది. ఈ వేసవిలో బిగ్గెస్ట్ ఎట్రాక్షన్‌లలో ఒకటిగా ఏప్రిల్ 17న ఓదెల2 థియేటర్స్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రిరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. చార్మింగ్ స్టార్ శర్వా చీఫ్ గెస్ట్‌గా హాజరైన ఈ ప్రిరిలీజ్ ఈవెంట్ చాలా గ్రాండ్‌గా జరిగింది. ప్రిరిలీజ్ ఈవెంట్లో హీరో శర్వా



మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. కొన్ని కొన్ని సినిమాలు ప్లాన్ చేయాల్సిన అవసరం లేదు. ఆ మంచి వాటంత అదే జరిగిపోతుంది. ఓదెల 2 టీజర్ చూడగానే అరుంధతి, అమ్మోరు సినిమాలు చూసిన ఫీలింగ్ వచ్చింది. ఏదో మ్యాజిక్ జరగబోతుందనే ఫీలింగ్ నాకుంది. సంపత్ నందితో ఏడాదిగా ట్రావెల్ చేస్తున్నాను ఆయన ఒక అడిక్షన్. తమన్నా ఆయనతో నాలుగు సినిమాలు చేశారంటే మామూలు విషయం కాదు. తమన్నాని హీరోయిన్ అని పిలవడం నాకు ఇష్టం లేదు తను వండర్ఫుల్ ఆర్టిస్ట్ అన్నారు. హీరోయిన్ తమన్నా భాటియా మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. మా సినిమాకి ఎంతో సపోర్ట్ చేసిన మీడియాకి థాంక్యూ. ఈ సినిమా ఏప్రిల్ 17న పాన్ ఇండియా థియేటర్స్‌లో వస్తుంది. తప్పకుండా వెళ్లి చూడండి. ఈ సినిమా సంపత్, మధు కోసం గొప్పగా ఆడాలని కోరుకుంటున్నాను. 20 ఏళ్లుగా ఎన్నో ప్రొడక్షన్స్ లో పనిచేశాను. కానీ ఇంత పాషన్ వున్న ప్రొడ్యూసర్, క్రియేటర్స్ చాలా అరుదుగా ఉంటారు. ఈ సినిమాలో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నాను. శివశక్తి పాత్ర, ఈ సినిమా నా కెరీర్లో చాలా స్పెషల్‌గా ఉండబోతుంది. 17 ఏప్రిల్ కోసం చాలా ఈగర్ వెయిట్ చేస్తున్నాను. మధు ఈ సినిమాని చాలా అద్భుతంగా అన్ని జాగ్రత్తలు తీసుకుని నిర్మించారు. ప్రతి ప్రమోషన్ మెమోరబుల్‌గా చేశారు. ఈ ఈవెంట్ కొచ్చి మమ్మల్ని విష్ చేసిన శర్వానంద్‌కి థాంక్యూ. శర్వానంద్, నేను ఎప్పుడూ మీట్ కాలేదు. ఆయనతో కలిసి నటించాలనుంది. శివశక్తి పాత్రను నాకు ఇచ్చినందుకు సంపత్, అశోక్ తేజకు కృతజ్ఞతలు. వశిష్ఠ అద్భుతంగా నటించారు. అజినీస్ ఈ సినిమాకి సోల్ ఫుల్ మ్యూజిక్ ఇచ్చారు.

శివకార్తికేయన్, ఎ.ఆర్. మురుగదాస్ కాంబినేషన్‌లో వస్తున్న హై ఆక్టేన్ యాక్షన్ ఎంటర్‌టైనర్ మదరాసి. శ్రీ లక్ష్మీ మూవీస్ నిర్మిస్తున్న ఈ చిత్రం విజువల్ వండర్‌గా అద్భుత స్థాయిలో రూపొందుతోంది. ఈ ఇంటెన్స్ యాక్షన్ ఎంటర్టైనర్ యాక్షన్ ప్యాక్డ్ గ్లింప్స్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ సినిమా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు.

# శ్రీ లక్ష్మీ మూవీస్ 'మదరాసి'



సెప్టెంబర్ 5నసినిమా వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ పోస్టర్‌లో శివకార్తికేయన్ ఇంటెన్స్ లుక్ అందరినీ ఆకట్టుకుంది. తన ఇంటన్సీవ్ నెరేటివ్ గ్రిప్పింగ్ స్టోరీ టెల్లింగ్‌తో ఆకట్టుకునే ఎఆర్ మురుగదాస్ మదరాసితో సరికొత్త ఎక్సయిటింగ్ యాక్షన్‌ప్యాక్డ్ కథను చూపించబోతున్నారు. ఈ చిత్రంలో రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటి స్తోంది. విద్యుత్ జామ్వాల్, బిజు మీనన్, షబీర్, విక్రాంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి రాక్ స్టార్ కంపోజర్ అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్ సుదీప్ ఎలామోన్. శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్, అరుణ్ వెంజరమూడు ఆర్ట్ డైరెక్టర్. యాక్షన్ కొరియోగ్రఫీని కెవిన్ మాస్టర్, దిలీప్ మాస్టర్ పర్యవేక్షిస్తారు.

# 'డియర్ ఉమ' విడుదలకు రెడీ

తెలుగమ్మాయి అయిన సుమయ రెడ్డి హీరోయిన్‌గా, నిర్మాతగా, రచయితగా 'డియర్ ఉమ' అనే చిత్రం ఏప్రిల్ 18న రాబోతోంది. ఈ చిత్రంలో పృథ్వీ అంబర్ హీరోగా నటించారు. ఈ మూవీకి లైన్ ప్రొడ్యూసర్‌గా నగేష్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా నితిన్ రెడ్డి వ్యవహరించారు. ఇక ఈ సినిమాకు సాయి రాజేష్ మహాదేవ్ స్క్రీన్ ప్లే, మాటలు, దర్శకత్వ బాధ్యతలు నిర్వర్తించారు. ఇక ఎన్నో చిత్రాలకు అద్భుతమైన విజువల్స్ అందించిన రాజ్ తోట కెమెరామెన్‌గా, బ్లాక్ బస్టర్ చిత్రాలకు మ్యూజిక్ అందించిన రదన్ సంగీత దర్శకుడిగా పని చేశారు. ఇక ప్రమోషన్స్‌లో భాగంగా సుమయ రెడ్డి మీడియాతో ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు.

**సుమయ రెడ్డి మీ నేపథ్యం ఏంటి?**
మాది అనంతపూర్. మోడలింగ్ రంగం నుంచి ఇటు వైపు వచ్చాను. నాకు చిన్నప్పటి నుంచీ సినిమాలంటే ఇష్టం. మొదట్లో సినిమాలు చేయడం అంటే చాలా ఈజీ అనుకున్నాను. కానీ అది అంత సులభం కాదు అని అర్థమైంది.

**డియర్ ఉమ కథను రాయడానికి, సినిమా చేయడానికి స్ఫూర్తి ఏంటి?** కరోనా టైంలో నాకు ప్రతీ రోజూ ఓ కల వస్తూనే ఉండేది. అది నన్ను వెంటాడుతూ ఉన్నట్టుగా అనిపించింది. అలా ఆ కలలో వచ్చిన పాయింట్ మీదే కథను రాసుకున్నాను. అందరికీ కనెక్ట్ అయ్యేలా మా చిత్రం ఉంటుంది. **డియర్ ఉమ చిత్రంలోకి పృథ్వీ అంబర్ ఎలా వచ్చారు?** తెలుగు హీరోని ట్రై చేశాం. కానీ చాలా కారణాల వల్ల మిస్ అవుతూ వచ్చాం. కానీ పృథ్వీ అంబర్‌కి కథ చెప్పిన వెంటనే ఓకే చేశారు. కొత్త ప్రొడక్షన్ అని కూడా చూడకుండా కథ నచ్చిన వెంటనే ఓకే చెప్పారు.

**డియర్ ఉమ చిత్రంలో వైద్య రంగం మీద విమర్శలు గుప్పిస్తున్నారా?** కార్పొరేట్ హాస్పిటల్స్‌లో జరిగే వాటిని చూపించబోతున్నాం. డాక్టర్లు, పేషెంట్స్‌కి మధ్యలో ఉండే పర్సన్స్ సరిగ్గా లేకపోతే ఏం జరుగుతుందో చూపిస్తాం.

**డియర్ ఉమ చిత్రం ఎలా ఉండబోతోంది?**
డియర్ ఉమ చిత్రం కాస్త ఫిక్షనల్. కాస్త రియల్. సోషల్ మెసెజ్ అని కాకుండా ఓ సొల్యూషన్‌ని కూడా చెబుతాం. అందరికీ అవగాహన కల్పించేలా చిత్రం ఉంటుంది. హీరోయిన్‌గా ఉండి నిర్మాతగానూ సినిమాను చేయాలని అనుకోలేదు. కానీ అలా చేయాల్సి వచ్చింది.

**ఈ చిత్రానికి బడ్జెట్ పెరిగిందా?**
డియర్ ఉమ సినిమాకి ముందు అనుకున్న దానికంటే ఎక్కువే పెరిగింది. కెమెరామెన్, మ్యూజిక్ డైరెక్టర్ ఇలా అందరినీ పెద్ద వాళ్లని తీసుకున్నాం. ఆర్టిస్టుల్ని కూడా చాలా పెద్ద వాళ్లని తీసుకున్నాం. అలా ముందుకు వెళ్తూ ఉన్న కొద్దీ బడ్జెట్ పెరుగు తూనే వచ్చింది.



సుమయ రెడ్డి

# 'శంబాల' మేకింగ్ వీడియో రిలీజ్

యంగ్ హీరో ఆది సాయి కుమార్ కెరీర్ డిఫరెంట్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్ అవుతోంది. ప్రతి సినిమాలో వైవిధ్యం చూపిస్తూ దూసుకుపోతున్న ఈ హీరో ప్రస్తుతం ఆడియెన్స్‌ను నూతన ప్రపంచంలోకి తీసుకెళ్లే సినిమా చేస్తున్నారు. ఆ సినిమానే శంబాలా. కాల్పనిక ప్రపంచంలో జరిగే అద్భుతమైన ఘట్టాల్ని చూసి ఆడియెన్స్ థ్రిల్ అవుతున్నారు. ఈ క్రమంలోనే ఆధ్యాత్మిక ప్రపంచంలోకి తీసుకెళ్లేలా శంబాల చిత్రాన్ని పూర్తి చేస్తున్నారు ఆది సాయికుమార్. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజశేఖర్ అన్నభీమోజు, మహిధర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమాకు ఏయాడ్ ఇన్ఫినిటిమ్‌ఖి ఫేమ్ డైరెక్టర్ యుగంధర్ ముని దర్శకత్వం వహిస్తున్నారు. ఖర్చులకు ఎక్కడా రాజీ పడకుండా భారీ ఎత్తున ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ఆది సాయి కుమార్ సరసన అర్చన అయ్యర్ కథానాయికగా నటిస్తోంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుతున్న దర్శకనిర్మాతలు.. ఓ వైపు షూటింగ్ చేస్తూనే మరోవైపు జోరుగా ప్రమోషన్స్ చేస్తున్నారు. ఇప్పటికే శంబాల మూవీ నుంచి విడుదలైన ఫస్ట్ లుక్ మొదలుకొని.. వరుసగా వస్తున్న అన్ని అప్ డేట్స్ సినిమాపై అంచనాలు క్రియేట్ చేశాయి. ఈ క్రమంలోనే తాజాగా శంబాలా మేకింగ్ వీడియో వదిలారు మేకర్స్. టీజర్ లోడింగ్ అంటూ వదిలిన ఈవీడియోలో సినిమా కోసం చిత్రయూనిట్ ఏ రేంజ్‌లో కష్టపడుతోందో చూపిస్తూ ఆసక్తిరేకెత్తించారు. తాజాగా విడుదల చేసిన ఈ వీడియో సినిమాపై ఉన్న అంచనాలకు రెక్కలు కట్టింది. చిత్రంలో భారీ యాక్షన్ ఎపిసోడ్స్ చూడబోతున్నామని ఈ వీడియో చెప్పకనే చెప్పింది. ఈ శంబాల చిత్రంలో ఆది సాయి కుమార్ జియో సైంటిస్ట్‌గా కనిపించనున్నారు. సూర్య 45వ చిత్రంలో భాగమైన శ్వాసిక ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తుండగా.. రవివర్మ, మీసాల లక్ష్మణ్, మధునందన్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇండియన్ సిల్వర్ స్క్రీన్ పై ఇదివరకెన్నడూ టచ్ చేయని పాయింట్, కథతో ఈ సూపర్ నేచురల్ థ్రిల్లర్‌ను తెరకెక్కిస్తున్నారు. న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో ఫిల్మ్ మేకింగ్‌లో శిక్షణ పొందిన యుగంధర్ ముని హాలీవుడ్ స్థాయి నిర్మాణాన్ని లక్ష్యంగా చేసుకుని హై టెక్నికల్ స్టాండర్డ్స్‌తో, గ్రాండ్ విజువల్స్‌తో రూపొందిస్తున్నారు. ఈ మూవీలో విజువల్స్, సాంకేతికత అత్యున్నత స్థాయిలో ఉండేలా చూసుకుంటున్నారు. ఈ చిత్రానికి భారతీయ సంగీత విద్వాంసుడు శ్రీరామ్ మద్దూరి సంగీతాన్ని అందిస్తున్నారు. అతి త్వరలో ఈ సినిమా రిలీజ్ డేట్ సహా మరిన్ని ఇంట్రెస్టింగ్ అప్డేట్స్ వదులుతామని చిత్రయూనిట్ చెబుతోంది.



# థియేట్రికల్ ఫీలింగ్ మూవీ 'హిట్: ది థర్డ్ కేస్'

నేచురల్ స్టార్ నాని తన అప్ కమింగ్ 'హిట్: ది థర్డ్ కేస్'లో మోస్ట్ ఇంటెన్స్ అండ్ వైలెంట్ అవతార్‌లో కనిపించనున్నారు. ఈ సినిమా గ్లింప్స్, టీజర్, పాటలు, ఇతర ప్రమోషనల్ కంటెంట్ ట్రెమండస్‌తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేశాయి. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వంలో వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై ప్రశాంతి తిపిర్నేని, నాని యూనానిమస్ ప్రొడక్షన్స్‌తో కలిసి నిర్మించారు. 'హిట్: ది థర్డ్ కేస్' మే 1న థియేటర్లలో విడుదల కానుంది. ఈ చిత్రం థియేట్రికల్ ట్రైలర్ వైజాగ్ సంగమ్ థియేటర్‌లో భారీగా తరలివచ్చిన అభిమానులు సమక్షంలో లాంచ్ చేశారు. అనంతరం హైదరాబాద్‌లో ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్‌లో నేచురల్ స్టార్ నాని మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. పొద్దున్న వైజాగ్‌లో ట్రైలర్ లాంచ్ చేసాం. ట్రైలర్‌రిలీజ్ అయినప్పటి నుంచి నా ఫోన్ మెసేజ్‌లతో ఫుల్ అయింది. ట్రైలర్‌కి వచ్చిన అద్భుతమైన రెస్పాన్స్ ఇది. చాలా ఆనందాన్నిచ్చింది. గత కొన్ని రోజులుగా మా టీమ్ అంతా చాలా కష్టపడ్డారు. ఈ



మధ్యకాలంలో లాస్ట్ మినిట్‌లో ట్రైలర్స్ ఇస్తున్నారు. ఇంతకుముందు 20 రోజులు ముందు ట్రైలర్ వచ్చేది. ఆ నోస్టాల్జిజియా ఫీలింగ్ మళ్లీ ఇద్దామని ట్రైలర్‌ని ముందుగానే రిలీజ్ చేసాము. ట్రైలర్ కోసం టీం అంత డే అండ్ నైట్ పనిచేసింది. ట్రైలర్‌కి వస్తున్న రెస్పాన్స్ కారణం శైలేష్ అండ్ టీం. వారందరికీ థాంక్యూ అన్నారు. డైరెక్టర్ శైలేష్ కొలను మాట్లాడుతూ, మీడియా ఫ్రెండ్స్ అందరికీ థాంక్యూ. ట్రైలర్ చూశారు. యూనిక్‌గా క్రియేట్ చేసాము. నాతో కలిసి ఈ సినిమా చేసిన నా టీమ్ అందరికీ థాంక్యూ సో మచ్ అన్నారు. డిఓపి సాను జాన్ వర్గీస్ మాట్లాడుతూ, తెలుగులో నాలుగు సినిమాలు చేశాను. ఈ నాలుగు సినిమాలు కూడా నానితోనే వర్క్ చేశాను. ఈ సినిమా కూడా అలరిస్తుంది. ఇందులో నాని చాలా డిఫరెంట్ క్యారెక్టర్‌లో కనిపిస్తారు. ఈ సినిమా చాలా మంచి ఎక్స్పీరియన్స్ అన్నారు. ప్రొడక్షన్ డిజైనర్ శ్రీ నాగేంద్ర మాట్లాడుతూ, నానితో ఇది నా ఫస్ట్ మూవీ. నా కెరీర్‌కి చాలా బెస్ట్ మూవీ అవుతుందని నమ్మకం ఉంది.

# అల్లరి ఫరియా క్యూట్ అందం

జాతిరత్నాలు సినిమాతో హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ఫరియా అబ్దుల్లా అందరి దృష్టిని ఆకర్షించింది. మొదటి సినిమాతోనే మంచి మార్కులు సొంతం చేసుకున్న ఈ అమ్మడు ఆ తర్వాత పలు సినిమాల్లో నటించింది. కాస్త ఎక్కువ హైట్ ఉండటం వల్ల ఈమెకు ఆఫర్లు తక్కువ వస్తున్నాయి అనేది కొందరి అభిప్రాయం. హైదరాబాదీ అమ్మాయి అయినా కూడా టాలీవుడ్‌లో ఇతర తెలుగు అమ్మాయిలతో పోల్చితే ఎక్కువ ఆఫర్లు సొంతం చేసుకుంది. ఆకట్టుకునే అందంతో పాటు, సోషల్ మీడియాలో మంచి ఫాలోయింగ్ అంతే కాకుండా నటనతో మెప్పించే స్వభావం కారణంగా అడపాదడపా ఆఫర్లను సొంతం చేసుకుంటూనే ఉంది. ఇన్‌స్టాగ్రామ్‌లో మిలియన్ ఫాలోవర్స్ కంటే ఎక్కువగానే అభిమానులను సొంతం చేసుకున్న ఈ అమ్మడు రెగ్యులర్‌గా అందమైన ఫొటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఎప్పటిలాగే ఈ అమ్మడు అందమైన ఫోటోలతో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆకట్టుకునే అందంతో పాటు, చిలిపితనంతో కూడిన ఫోజ్ ఇవ్వడంలో ఫరియా అబ్దుల్లా ఎప్పుడూ ముందు ఉంటుంది అంటారు. అన్నట్లుగానే ఈ అమ్మడు మరోసారి ఈమె తన అల్లరి ఫోజ్‌లతో ఆకట్టుకుంది. సాధారణంగా హీరోయిన్స్ కవ్వించే చూపులతో అలరిస్తూ ఉంటారు. అయితే హీరోయిన్ అందంగా కనిపించడంతో పాటు క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ ఇస్తూ చూపు తిప్పుకోనివ్వదు. తాజా ఫోటోలు వైరల్ అవుతున్నాయి. స్కిన్ షో చేయకున్నా స్వచ్ఛమైన నవ్వుతో, క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో, అల్లరి ఫోజ్ ఇస్తూ క్యూట్‌గా అందంగా ఫరియా అబ్దుల్లా ఉంది అంటూ నెటిజన్స్ ఈ ఫోటోలకు కామెంట్ చేస్తున్నారు. పాపం ఫరియా ఇంత అందంగా ఉన్నా, నటనతో మెప్పిస్తున్నా కూడా లక్ కలిసి రావడం లేదని, అంతే కాకుండా తెలుగు అమ్మాయి కావడం వల్ల ఆశించిన స్థాయిలో ఆఫర్లు రావడం లేదనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. కెరీర్ ఆరంభంలో వరుసగా సినిమాలు చేసిన ఫరియా అబ్దుల్లా ఈమధ్య కాలంలో కాస్త స్లో అయింది. తిరిగి ఇలాంటి అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా కచ్చితంగా పాపులారిటీని సొంతం చేసుకుని వరుసగా ఆఫర్లు సొంతం చేసుకుంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. జాతిరత్నాలు సినిమాలో నవీన్ పొలిశెట్టికి జోడీగా నటించి చిట్టి పాత్రలో మెప్పించింది.



# రక్తపోటుకు కారణాలు..

ఒత్తిడి, డీహైడ్రేషన్, నిద్రలేమి మొదలైన వాటి కారణంగా తలనొప్పులు వస్తుంటాయి. అధిక రక్తపోటు కూడా తీవ్రమైన తలనొప్పికి కారణమవుతుంది.



పైగా ఇది మామూలుగా వచ్చే తలనొప్పులకు భిన్నమైంది. హైపర్‌టెన్సివ్ క్రైసిస్‌గా పిలిచే విపత్కర పరిస్థితికి దీన్ని సంకేతంగా భావించాలి. సాధారణంగా అధిక రక్తపోటు ప్రత్యక్షంగా ఎలాంటి లక్షణాలనూ ప్రదర్శించదు. అయితే రక్తపోటు అధికంగా ఉన్నప్పుడు దానివల్ల తలనొప్పులు, తలతిప్పడం, అలసట, దృష్టి సంబంధ సమస్యలులాంటివి తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు. మెదడులోని రక్తనాళాల్లో ఒత్తిడి పెరగడం వల్ల అధిక రక్తపోటు సంబంధిత తలనొప్పులు వస్తాయి. రక్తపోటు గణనీయంగా పెరిగినప్పుడు, మెదడులో రక్తనాళాల వ్యాకోచానికి దారి తీస్తుంది. దీంతో ఒత్తిడి, నొప్పి పెరుగుతాయి. రక్తసరఫరా మందగించడంతో మెదడు కణజాలానికి ఆక్సిజన్ లభ్యత తగ్గుతుంది. దీంతో తలనొప్పి వేధిస్తుంది. అధిక రక్తపోటు కారణంగా వచ్చే తలనొప్పి మామూలు తలనొప్పి, పార్శ్వపునొప్పి కంటే భిన్నమైంది. పొడుస్తున్నట్లుగా ఉండి, తల వెనకభాగంలో, కపాలం కింది భాగానికి కొంచెం పై భాగంలో నొప్పి ఉంటుంది. పట్టేసినట్లుగా, ఒత్తిడిగా అనిపిస్తుంది. కొంతమంది దీన్నే తలలో ఏదో తిరుగుతున్నట్లుగా అనుభూతి చెందుతారు. అధిక రక్తపోటుతో వచ్చే తలనొప్పులు ఉదయం నిద్ర లేస్తూనే తట్టుకోలేనంతగా బాధిస్తాయి. తల తిరుగుతున్నట్లుగా, కళ్లు మసకబారినట్లుగా అనిపిస్తుంది. అధిక రక్తపోటు రక్త ప్రవాహాన్ని ఆటంకపరుస్తుంది. దీంతో కంటిచూపులో ఆటంకాలు ఏర్పడతాయి. పెయిన్ కిల్లర్‌లతో ఈ సమస్యకు ఉపశనమం దొరకదు. రక్తపోటు విపరీతంగా పెరిగినప్పుడు వైద్య చికిత్స తీసుకుంటే మంచిది. ఇలాంటి సమయాల్లో నెమ్మదిగా శ్వాస తీసుకోవాలి. దీంతో రక్తనాళాలు ఉపశమని పొందుతాయి. రక్తపోటు తగ్గుతుంది. లేదంటే ఓ గ్లాసు నీళ్లు తాగాలి. దీంతో రక్త సరఫరా మెరుగవుతుంది. రక్తపోటు నియంత్రణ లోకి వస్తుంది. కండరాలు బిగిసుకుపోవడం కూడా తలనొప్పిని తీవ్రం చేస్తుంది. కాబట్టి కణతలు, మెడ, భుజాల భాగంలో నెమ్మదిగా మసాజ్ చేసినా కూడా రక్త సరఫరా మెరుగుపడుతుంది. అల్లం మొదలైన వాటితో చేసే టీలు సహజంగానే రక్తపోటును తగ్గించే గుణాన్ని లిగి ఉంటాయి. అరటిపండ్లు, పాలకూర, చిలగడదుంప, నారింజలులాంటి పొటాషియం ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలి. ★

# పిల్లలకు స్క్రీన్ సమయంలో పరిమితులు




పిల్లల శారీరక, మానసిక ఆరోగ్యంపై అధిక స్క్రీన్ సమయం చెడుగా కనిపిస్తుందని ప్రపంచ ఆరోగ్యసంస్థ నివేదిస్తోంది, దీన్ని పరిమితం చేయకపోతే పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని చెబుతోంది.

ఈ సమయంలో తాజాగా సింగపూర్ ప్రభుత్వం ఈ విషయంపై కఠిన నిబంధనలను రూపొందించింది. అమేటంటే.. ప్రీస్కూల్ నుంచే పిల్లల స్క్రీన్ సమయాన్ని తగ్గించాలి. దీనికోసం ఆయా స్థాయిలకు తగ్గట్లు పిల్లలు నియమాలను పాటించేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలి. వాళ్ల లైఫ్ స్టైల్‌ను తీర్చిదిద్దాలి. ఇకపై ఏడాదిన్నర నుంచి ఆరేళ్లలోపు చిన్నారులకు ఇంట్లో కేవలం పాఠ్యాంశాలు బోధించడానికి మాత్రమే స్క్రీన్ వినియోగించేలా చూడాలి. ప్రైమరీ, సెకండరీ స్కూల్ పిల్లలకూ ఇదే నియమం. తరగతి గదిలోకి ఫోన్‌తో ప్రవేశం లేదు. ఒకవేళ పాఠశాలకు తెచ్చినా వాటిని బయటే భద్రపరచాలి. తరగతిలో డివైస్ వినియోగం కూడా పరిమితం. అలాగే స్కూల్ తర్వాత స్కూల్ నిర్వాహకులు క్రీడలు, తోట పెంపకం వంటి పనుల్లో పిల్లలను నిమగ్నం చేయాలి. మూడు నుంచి ఆరేళ్ల పిల్లలకు రోజులో గంట మాత్రమే స్క్రీన్ సమయం ఉండేలా తల్లిదండ్రులు పరిమితి విధించాలి. స్కూల్ వర్క్ కలిపి కూడా ఇదే సమయాన్ని పిల్లలు వినియోగించేలా చూడాలి. 7 నుంచి 12 ఏళ్ల వయసు లోపువారు రెండుగంటలకన్నా ఎక్కువగా స్క్రీన్ ముందు ఉండకూడదు. మొబైల్స్, సోషల్మీడియాపట్ల ఆసక్తి పెరగకుండా పెద్దవాళ్లు ఓ కన్నేసి ఉంచాలి. లేదా ఎక్కువ స్క్రీన్ సమయం పిల్లల్లో జీవన నైపుణ్యాలను కొరవడేలా చేస్తుంది. వాళ్ల శారీరక, మానసికా రోగ్యాలు ప్రభావితమవుతాయి. అలాకాకుండా ఉండా లంటే బాల్యం నుంచీ వ్యాయామాలు, తోటివారితో కలిసి ఆటల్లో పాల్గొనడం, పుస్తకపఠనం, తోటపని వంటివాటిలో పిల్లలను నిమగ్నం చేయడానికి ప్రయత్నించాలి. జీవనశైలిలో మంచి మార్పులు తేగలిగితేనే భవిష్యత్తులో వాళ్లంతా ఉన్నతస్థాయిలకు చేరుకోగలుగుతారు. ★

# బూడిద గుమ్మడి జ్యూస్

తెల్ల గుమ్మడి, కూష్మాండం, వింటర్ మెలన్, వాక్స్‌గార్డ్, చైనీస్ వాటర్ మిలన్ ఇలా అనేక పేర్లతో పిలుచుకునే బూడిదగుమ్మడితో చేసే హల్వా, వడియాలు ప్రసిద్ధం. ఇది ఔషధంగానూ పనిచేస్తుంది. ఇందులో పోషకాలు అధికమే. దీని జ్యూస్ ఎంతో మంచిది. బూడిద గుమ్మడి కాయను కడిగి చెక్కు తీసి, గింజలు పూర్తిగా తీసేయాలి. చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసి, కాస్త అల్లం, కొద్దిగా ఉప్పు కలిపి గ్రైండ్ చేయాలి. దాన్ని వడకట్టి తాగితే సరిపోతుంది. ఇందులో మజ్జిగ, నిమ్మరసం, మిరియాలపొడి లాంటివి కూడా కలపొచ్చు. ఈ రసం తాగటం వల్ల శరీరానికి పొటాషియం, కాల్షియం, ఫోలేట్, పీచు, బి1, బి9, సి విటమిన్లు అందుతాయి. రక్తంలో చక్కెర స్థాయి క్రమబద్ధంగా ఉంటుంది. ఊబయాకం రాదు. అరుగుదల బాగుంటుంది. వేళకు ఆకలి వేస్తుంది. శరీరంలో చేరిన హానికరమైనవి బయటకు వెళ్లిపోతాయి. కొలెస్ట్రాల్ అదుపులో ఉంటుంది. గుండె జబ్బులు వచ్చే అవకాశం తగ్గుతుంది. మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉంటాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. చర్మం పొడిబారదు. కాంతి వస్తుంది. ఇది యాంటిబయాటిక్‌గాను పనిచేసి జ్వరం, దగ్గు నుంచి బయటపడటంలో సాయపడుతుంది. మానసిక ఒత్తిడి తగ్గుతుంది. ★



## ఆధ్యాత్మికం

# ప్రారబ్ధ కర్మ

ఎవరైనా, ఎంత గొప్పవారైనా ప్రారబ్ధ కర్మను అనుభవించి తీరాల్సిందే అని చాలామంది చెబుతుంటారు. అయితే భగవన్నామస్మరణ చేస్తే సూర్య కిరణాలకు మంచు కరిగినట్లుగా ప్రారబ్ధం కరిగి పోతుందని, బిల్వమంగళుని కథలోని పరమార్థం ఇదే అని అంటారు భగవాన్ సత్యసాయి. బిల్వమంగళుడు 500 సంవత్సరాల క్రితం కేరళలో జీవించినవాడు. శ్రీకృష్ణుని భక్తుడు. ఎంత గొప్ప భక్తుడంటే ఆయన పిలిచిన వెంటనే శ్రీకృష్ణుడు ఆయన ముందు ప్రత్యక్ష మయ్యేవాడు. ఒకసారి చాలా కాలంగా కడుపునొప్పితో బాధపడే ఒక వ్యక్తి బిల్వ మంగళునితో నా ఈ కడుపునొప్పిఎలా తగ్గుతుందో, ఎప్పుడు తగ్గుతుందో నీవు కృష్ణున్ని అడిగి తెలుసుకొని చెప్పు అన్నాడు. అతని ప్రారబ్ధం అతడు అనుభవించ వలసినదే, కానీ దొర్లటం ఆగితే మాత్రం తగ్గి పోతుంది, అన్నాడు శ్రీకృష్ణుడు. దొర్లటం అంటే బాధ కల్గినపుడు అటు, ఇటు దొర్లటం అను కున్నాడు ఆ దుర దృష్టవంతుడు. ఒక జన్మ నుంచి మరొక జన్మకు దొర్లటం అని అనుకున్నాడు బిల్వమంగళుడు. ఆ బాధపడే వ్యక్తి దొర్లకుండా ఉండటం దుర్లభమనుకొని ఇంకా గొప్ప జ్ఞానిని కలిసి నివారణ మార్గాన్ని కనుగొనటానికి కేరళనుండి కాశీకి వెళ్లదలిచాడు. దారిలో ఒకచోట కూరూరమ్మను కలిశాడు. ఆమె ఒక అన్నదాన సత్ర నిర్వాహకురాలు. ఆమెతో తన కష్టాన్ని తెలిపాడు. తాను గంగానదిలో దూకి చావాలనుకొన్నట్టు చెప్పాడు. ఆమె అతని తెలివి తక్కువతనానికి నిందించి 'గోపీజన వల్లభాయి నమః' అను మంత్రాన్ని నిరంతరం స్మరించు, అన్ని బాధలు తొలగుతాయి అని చెప్పింది. అతడు అలాగే చేశాడు. ఆశ్చర్యంగా అతని బాధ అదృశ్యమైంది. అతడు కాశీయాత్ర పూర్తి చేసికొని ఇంటికి తిరిగి వచ్చాడు. అది ఎలా సాధ్యం, కృష్ణుని మాటల అర్థం ఏమిటి? అనుకొన్నాడు బిల్వ మంగళుడు. కృష్ణుడి కనపడి ప్రాపంచిక విషయాల్లో మనసు దొర్లకుండా ఉంటే తగ్గుతుందని తాను చెప్పినట్లు వివరించాడు. భగవన్నామ స్మరణ చేస్తూ అన్యచింతన లేక పోవటం వల్ల అతనికి నొప్పి తగ్గింది, ప్రారబ్ధ కర్మ నశించింది. ★

## దోసగింజల పొడి

దోసగింజలు అరకప్పు, మినప్పప్పు అరకప్పు, నువ్వులు పావుకప్పు, సెనగపప్పుపావుకప్పు, ఎండుమిర్చి 20, జీలకర్ర పావుకప్పు, కరివేపాకు రెండు రెబ్బలు, వెల్లుల్లి ఐదు. వెల్లుల్లి తప్పించి తక్కిన వాటిని విడివిడిగా వేయించి దోసగింజల్ని, ఎండుమిర్చి మిక్సీ పట్టుకోవాలి. తక్కినవాటిని కూడా మిక్సీ పట్టుకుని వెలుల్లి వేసి మిక్సీ పట్టుకుంటే దోసగింజల పొడి సిద్ధమవుతుంది. ఇడ్లీలోకి నెయ్యి వేసుకుని తింటే ఆరోగ్యానికి మంచిది.

# మసాజ్‌కు నూనెలు..

మసాజ్.. అందాన్ని పెంపొందించుకోవడానికి, శారీరక నొప్పులను దూరం చేయడానికి ఎంతగానో సహకరిస్తుంది. అయితే ప్రత్యేకించి కొన్ని నూనెలను మసాజ్‌లో భాగంగా ఉపయోగిస్తే ఆరోగ్యానికీ పలు ప్రయోజనాలు చేకూరతాయంటున్నారు నిపుణులు.

ఆలివ్ నూనె అన్ని చర్మతత్వాల వారికీ సరిపోతుంది. ఈ నూనెతో మసాజ్ చేయించుకోవడం వల్ల శరీరంలోని కండరాలు దృఢమై మంచి శరీరాకృతి సొంతమవుతుంది. అలాగే రక్తప్రసరణ మెరుగై.. బిపి, గుండె కొట్టుకునే వేగం అదుపులో ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు.. ఈ నూనెతో మర్దన చేయించుకోవడం వల్ల రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుందని అధ్యయనంలో తేలింది.

నిమ్మగడ్డి నూనె అలసటను తగ్గించి శరీరాన్ని పునరుత్తేజితం చేస్తుంది. ఈ నూనెతో మసాజ్ చేయించుకోవడం వల్ల తలనొప్పి తగ్గడంతో పాటు నాడీవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. కండరాల నొప్పిని తగ్గించి, వాటిని దృఢంగా మార్చడంలో నిమ్మగడ్డి నూనె ఉపకరిస్తుంది.

చర్మానికి, జుట్టుకు పోషణనిచ్చే నువ్వుల నూనెతో శరీరంపై మర్దన చేసుకోవడం వల్ల కండరాలు, ఎముకలు దృఢమవుతాయి. కీళ్లు ఫ్లెక్సిబుల్‌గా మారతాయి. నాడీ వ్యవస్థ పనితీరునూ మెరుగుపరుస్తుందీ నూనె. అంతేకాదు.. సుఖనిద్రకూ ప్రేరేపిస్తుందని నిపుణులు చెబుతున్నారు. చర్మం తేమను కోల్పోయి నిర్జీవంగా తయారైనప్పుడు ఈ నూనెతో మసాజ్ చేయించుకుంటే మంచి ఫలితం ఉంటుంది. దీనికి కారణం ఇందులో అధిక మొత్తంలో ఉండే పోషకాలే! ఇవి చర్మాన్ని తేమగా ఉంచడానికి సహాయ పడతాయి. అలాగే బాదం నూనెతో మసాజ్ చేయించుకోవడం వల్ల కండరాల నొప్పుల నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది. ★



## చెలి చిట్కాలు

కలబంద రసంలో పసుపు కలిపి కాలిన గాయాల మీద రాస్తే గాయాలుతగ్గుతాయి.

# జయశంకర్ వ్యవసాయ వర్సిటీ నుండి మొక్కజొన్న హైబ్రిడ్ రకాలు విడుదల

**అత్తాపూర్ ఏప్రిల్15,ప్రభాతవార్త :** ఇటీవల భారత వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు లో నిర్వహించిన అఖిల భారత మొక్కజొన్న పరిశోధన సమన్వయ సమావేశంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇటీవల రూపొందించిన ఐదు ఉత్తమమైన మొక్కజొన్న హైబ్రిడ్ రకాలను విడుదల చేశారని విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ఒక పత్రిక ప్రకటనలో తెలియజేశారు. నూతనంగా విడుదలైన హైబ్రిడ్ రకాలు దక్కన్ హైబ్రిడ్ మక్కా () 144, డి.హెచ్.యం. 182, డి.హెచ్.యం.193, డిహెచ్.యం.206,డిహెచ్.యం.218 లతో కలిపి ఈ విశ్వవిద్యాలయం నుండి మొత్తం 24 మొక్కజొన్న హైబ్రిడ్ రకాలు విడుదల అయ్యాయి. ఇందులో డి.హెచ్.యం. 144 (తెలంగాణ మక్క 6) రకంలో అధిక పిండి పదార్థాలు ఉండటం వలన ఇథనాల్ ఉత్పత్తికి బాగా అనుకూలంగా ఉంటుందని తెలిపారు. అదే విధంగా డి.హెచ్.యం. 206 (తెలంగాణ మక్క 3) మెట్ట సాగుకు అనుకూలమైనదని మరియు ఎండు తెగులును సమర్థ వంతంగా తట్టుకుంటుందని తెలియజేశారు. అంతేకాకుండా ప్రస్తుతం రైతాంగానికి అందుబాటులో ఉన్న వివిధ మొక్కజొన్న వంగడాలతో పోల్చితే డి.హెచ్.యం. అన్ని విధాలుగా మేలైందని పరిశోధనలో తేలింది. కాబట్టి ఈ సదవకాశాన్ని రాబోయే కాలంలో రైతాంగం వినియోగించుకోవలసిందిగా విశ్వవిద్యాలయ అధికారులు కోరుతున్నారు.

16 పంట రకాలకు కేంద్ర ప్రభుత్వం అధికారిక ప్రకటిత రకాలుగా గుర్తింపు: ఈ మధ్య కాలంలో జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన 16 వివిధ పంటల రకాలకు ఇటీవల కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ మంత్రిత్వ శాఖలో జరిగిన సమీక్ష సమావేశంలో అధికారిక ప్రకటిథ రకాలుగా (నోటిఫైడ్ వైరైటీస్) గుర్తిస్తూ ప్రకటన విడుదల చేసారు. తద్వార జయశంకర్ వర్సిటీ విడుదల చేసిన ఈ పంట రకాలను కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ మంత్రిత్వ శాఖ ద్వారా విత్తనోత్పత్తి ప్రణాళికలు రూపొందించి ఈ రకాలను రైతాంగానికి అందుబాటులోనికి తేవడానికి సహకరిస్తుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని వివిధ విత్తన సంస్థలు ఈ రకాల మూల విత్తన సరఫరా కొరకు విశ్వవిద్యాలయాన్ని సంప్రదించాలని విశ్వవిద్యాలయ అధికారులు సూచిస్తున్నారు.



# గోవుల మృతి అసత్య ప్రచారాలపై భూమనపై కఠిన చర్యలు తీసుకోవాలి

## - భక్తుల మనోభావాలు దెబ్బతీశాడని ఆగ్రహం

## - తిరుపతి జిల్లా ఎస్పీకి టిటిడి బోర్డు సభ్యుడు ఫిర్యాదు

**తిరుమల,ఏప్రిల్ 15 ప్రభాతవార్తప్రతినిధి:** ఎంతో పవిత్రమైన హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానం గోశాలను గోవధశాలగా మార్చారంటూ మాజీచైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తప్పుడు ఆరోపణలు చేశారని, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని టిటిడి బోర్డు సభ్యుడు పేర్కొన్నారు. గోశాలలో గోవులు మరణించాయని భక్తుల మనోభావాలు దెబ్బతీశాడని దీనిపై టిటిడి చర్యలకు సిద్ధమైంది. ఇందులో భాగంగా మంగళవారం టిటిడి పాలకమండలి తరపున బోర్డు సభ్యుడు జి.భానుప్రకాశ్‌రెడ్డి తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజును కలసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడం సంచలనం కలిగించింది. ఆయనపై ఐటి యాక్ట్ 74,బిఎన్ఎస్ 356క్రింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్వీగోశాలలో వంద ఆవులు మరణించాయని, పవిత్రమైన గోశాలను గోవధశాలగా మార్చారని ఆరోపణలు చేశారన్నారు. వారి హయాంలో మరణించిన గోవుల ఫోటోలు మార్ఫింగ్‌చేసి ఇప్పుడు జరిగినట్లు కలకలం సృష్టించారన్నారు. ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. గతంలో టిటిడి ఛైర్మన్‌గా ఉన్నపుడే కరుణాకర్‌రెడ్డి పెద్ద సంఖ్యలో గోవులు మృత్యువాత పడ్డాయన్నారు. వైసిపి హయాంలో పురుగులు పట్టిన ఆహారాన్ని, దాణాను గోవులకు పెట్టారని ఆరోపించారు. ఆయన హయాంలో జరిగిన అక్రమాలను ఆధారాలతో సహా బయటపెట్టామన్నారు. టిటిడిలో అక్రమాలపై విజిలెన్స్ విచారణ కొనసాగుతోందని భానుప్రకాశ్‌తెలిపారు. ఎస్వీగోశాలపై అసత్యప్రచారాలు చేస్తూ భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా భూమన వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోవిందుడు, గోవులతో ఆటలాడవద్దని వైసిపి నేతలకు భాను హెచ్చరించారు. ఎస్పీని కలసి ఫిర్యాదు చేసినవారిలో బిజెపి నాయకులు తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, మునిసుబ్రమణ్యం, అజయ్‌కుమార్ ఉన్నారు.

# ముత్యాలమ్మ ఆలయంలో జాతర సంబరాలు

## శ్రీకాళహస్తీశ్వరాలయం సారె బహూకరణ

## మూడు రోజుల జాతరకు శ్రీకారం

**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త** దక్షిణ కైలాసంలో శక్తి నిలయాలుగా బాసిల్లుతున్న ఆలయాల్లో ఒకటైన ముత్యాలమ్మ ఆలయంలో సాంప్రదాయ పద్దతుల్లో జాతర ఉత్సవం ప్రారంభమైంది. ప్రతి ఏడాది ఎంతో అనందోత్సాహాలతో నిర్వహించే ముత్యాలమ్మ జాతరను ఆదివారం రాత్రి చాటింపుతో జాతర ప్రారంభం అయ్యింది. మంగళవారం ఉదయం గెరిక ఉత్సవంతో అమ్మవారి జాతరకు శ్రీకారం చుట్టారు. మూడు రోజుల పాటు సాంప్రదాయ పద్దతుల్లో అమ్మవారి జాతరను వైభవంగా



ముత్యాలమ్మ అమ్మవారికి సారెను సమర్పిస్తున్న దృశ్యం

నిర్వహించనున్నారు. స్థానికంగా గ్రామ దేవతగా శక్తి స్వరూపిణిగా భక్తజన కొంగుబంగారంగా ముత్యాలమ్మ కొలువు దీరి భక్తజనాలను అనుగ్రహిస్తున్నారు. ఏడు గంగమ్మల్లో ఒక గంగమ్మగా కొలువుదీరి అమ్మవారి భక్తజనాన్ని కటాక్షిస్తున్నారు. శక్తిస్వరూపిణి అయిన అమ్మవారిని మంగళ, శుక్ర, ఆదివారాల్లో ఉపవాస దీక్షలతో మహిళలు కొలుస్తూ తమ కోర్కెలను నెరవేర్చుకుంటున్నారు. భక్తజనాల కోర్కెలను అమ్మవారు మన్నిస్తూ కోరిన కోర్కెలను తీర్చే కల్పవల్లిగా బాసిల్లుతుంది. భక్తజన బాంధవిగా బాసిల్లుతున్న అమ్మవారి ఆలయంలో జాతర ఉత్సవాలను వైభవంగా ప్రత్యేక సాంప్రదాయ పద్దతుల్లో నిర్వహించడం ఇక్కడ ప్రత్యేకత. అన్ని చోట్ల జాతర ఉత్సవం అంటే మూలవిరాట్టుకు అభిషేకం చేసి ఉత్సవ మూర్తిని మూలస్థానంలో నిలిపి జాతర నిర్వహించడం ఆనవాయితీ. అయితే ఇందుకు భిన్నంగా ముత్యాలమ్మఆలయంలో అమ్మవారి మూలవిరాట్టుకు ఎదురుగా అమ్మవారి వివిధ రూపాల్లో ముగ్గుగా తీర్చిదిద్ది పూజలు నిర్వహించి జాతర జరపడం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. గ్రామీణ కులవృత్తుల మేళవించిన విభిన్న వారసత్వపు సాంప్రదాయాలకు ఈ జాతర అద్దం పడుతుంది. నేటి తరానికి సాంప్రదాయ వారసత్వపు చరిత్ర తెలియడం లేదు. నాటి ఈ సాంప్రదాయాలు నిగూఢమైన ఎన్నో విశేషాలతో కూడిన విజ్ఞానానికి నిదర్శనంగా చెప్పవచ్చు.

**గెరిక ఉత్సవంః** ముత్యాలమ్మ జాతరను పురస్కరించుకొని అమ్మవారి ఆలయాన్ని సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. ఆలయమంతా అరటి,మామిడి తోరణాలతో పచ్చగా కళకళలాడే విధంగా అలంకరించారు. విద్యుత్ దీపాలంకరణలతో కన్నులపండువగా ముస్తాబు చేశారు.పూల ముస్తాబులతో ఆకట్టుకునే రీతిలో తీర్చి దిద్దారు. మంగళవారం ఉదయం మూలవిరాట్టు శక్తిస్వరూపిణి ముత్యాలమ్మకు ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో విశేష అభిషేక పూజలను నిర్వహించారు. అనంతరం శ్రీకాళహస్తీశ్వరాలయం నుండి సారెను తీసుకొచ్చి ఆలయ డెప్యూటి ఈ ఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి వారి సిబ్బంది సమర్పించారు. అనంతరం ఆలయం నుండి గెరిక తీసుకొని ఉత్సవంగా పట్టణ పురవీధుల్లో అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఈ సందర్బంగా పట్టణంలోని ఆయా మూలస్థానాల్లో విశేష పూజలను నిర్వహించారు.

**మైలు ముగ్గులో అమ్మవారి దర్శనంః** ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం మధ్యాహ్నం అమ్మవారి విశ్వరూప దర్శనాన్ని మైలుముగ్గుగా తీర్చిదిద్దారు. ఈ మైలుముగ్గుకు విశేష పూజలను సాంప్రదాయపద్దతుల్లో నిర్వహించారు. అనంతరం కుంభం వేసి బలిప్రసాదాలు సమర్పించి విశేష హారతులిచ్చారు. అనంతరం పెద్దఎత్తున స్థానిక భక్తులు అమ్మవారి విశ్వరూప మైలుముగ్గును దర్శించుకొని పూజలు నిర్వహించుకున్నారు. కాగా అమ్మవారి జాతరను పురస్కరించుకొని స్థానిక మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చి ఆలయ ఆవరణంలో పొంగళ్ళు పెట్టి సాంప్రదాయపద్ధతుల్లో మొక్కులు చెల్లించుకోవడంతో పాటు ఆలయం ఆవరణలో విచ్చేసిన భక్తులకు అంబళ్ళు పోసారు. పట్టణ నలుమూలల నుండి భక్తజనాలు తరలి వచ్చి అమ్మవారి దివ్యదర్శనాన్ని దర్శించుకొని పూజలు జరిపించుకున్నారు.

కాగా మంగళవారం రాత్రి అమ్మవారు శేషపాన్పు ముగ్గులో భక్తజనానికి దర్శనమిచ్చారు. సాయంత్రం సాంప్రదాయ పద్ధతుల్లో గంగపెట్టె ఊరేగింపు నిర్వహించి అనంతరం అమ్మవారి మూలవిరాట్టుకు ఎదురుగా శేషపాన్పు ముగ్గును తీర్చిదిద్దారు. సాంప్రదాయపద్ధతుల్లో కుంభం వేసి విశేష పూజలు నిర్వహించి హారతులిచ్చారు. అమ్మవారి విశ్వరూప దర్శనాన్ని భక్తజనాలు దర్శించుకొని పూజలు జరుపుకున్నారు.

# అద్దె చెల్లించకపోవడంతో మూతపడుతున్న హాస్టళ్లు

## బకాయిలు చెల్లించాలి: బిసి సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త** ఐదు నెలల మెస్ బిల్లులు, మూడేళ్లగా హాస్టల్ భవనాలు అద్దె బిల్లులు, ఏడాది కరెంటు బిల్లుల బకాయిలు చెల్లించకపోవడంతో హాస్టల్లో నిర్వహణ భారంగా తయారైందని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. వారం రోజుల్లో బకాయిలు చెల్లించకపోతే మూసివేస్తామని స్వయంగా అధికారులు అంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఈ బకాయిలు చెల్లించడానికి బడ్జెట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన బిసి ప్రతినిధులు నీల వెంకటేష్, అంజి, పగిళ్ళ సతీష్, మోదీ రాందేవ్, ఉమేష్ యాదవ్, రాజేందర్, ఆశిష్ గౌడ్ తదితరులతో కలిసి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య ప్రభుత్వం ముందు పలు డిమాండ్లను ఉంచారు. 'కూరగాయలు, మాసం, గుడ్ల బిల్లులు గత పప్పులు, నూనెలు, ఇతర నిత్యావసర వస్తువుల బిల్లులు గత ఐదు నెలలుగా చెల్లించడం లేదు, దీనితో హాస్టళ్లకు వీటిని సరఫరా చేసి కాంట్రాక్టర్లు వ్యాపారస్తులు అప్పుల పాలయ్యారు. నిత్యావసర వస్తువులు సరఫరా నిలిపి వేస్తామని అంటున్నారు. దీనిమూలంగా హాస్టల్లో మూసివేసి పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలోని మొత్తం బీసీ కాలేజీ హాస్టళ్ళు అద్దె భవనాల్లో ఉన్నాయి. మూడేళ్ళ నుండి అద్దె చెల్లించడం లేదు. వీపరీత జాప్యం మూలంగా వాటి యజమానులు భవనాలు ఖాళీ చేయమని ఒత్తిడి చేస్తున్నారు. వెంటనే భవనాల అద్దె బకాయిలు మంజూరు చేయాలి' అని డిమాండ్ చేశారు. 'హాస్టళ్ళ కరెంట్ బిల్లులు గత సంవత్సరం నుండి పెండింగ్‌లో ఉన్నాయి. పరీక్ష సమయంలో హాస్టళ్ళకు కరెంటు కట్ చేస్తే విద్యార్థులు ఎలా చదువుకుంటారు. పరీక్షలు ఎలా రాస్తారు. దీని ప్రభావం విద్యార్థుల పరీక్ష ఫలితాలపై ఉంటుంది. గత మూడేళ్లగా కాలేజ్ ఫీజుల బకాయిలు 4వేల కోట్లు ఉన్నాయి. విద్యార్థులు తీవ్ర ఇబ్బందలకు గురువుతున్నాడు.

తవిదేశాల్లో చదువుకుంటున్న బిసి ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థుల ఓవర్‌సిస్ స్కాలర్‌షిప్ బకాయిలు ఇవ్వక పోవడంతో విదేశాల్లో చదువుకుంటున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత సంవత్సరం, ఈఏడాది దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి ఓవర్‌సిస్ స్కాలర్‌షిప్‌లకు నిధులు విడుదల చేయాలి. బీసీ కాలేజీ హాస్టళ్ళ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి' అని కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


క్రిస్ గేల్


షాన్ మార్ష్


విరాట్ కోహ్లీ


డేవిడ్ వార్నర్


రాబిన్ ఉతప్ప


రుతురాజ్ గైక్వాడ్

# ఆరెంజ్ క్యాప్ హీరో?

## అత్యధిక రన్స్‌పై పోటీ

## అత్యధికసార్లు క్యాప్ గెలిచిన వార్నర్

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 టైటిల్ వేట రసవత్తరంగా సాగుతోంది. చాలా మ్యాచుల్లో లాస్ట్ ఓవర్ వరకు గెలుపు దోబూచులాడుతోంది. ప్రతి టీమ్‌లో నిమిషాల్లో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేయగల హిట్టర్లు ఉండటంతో చివరి వరకు ఎవరు గెలుస్తారో అంచనా వేయలేని పరిస్థితి. అయితే కొందరు ప్లేయర్‌లు స్థిరంగా పరుగులు చేస్తూ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ అటువంటి వారికి ప్రతి సీజన్‌లో ఆరెంజ్ క్యాప్ అవార్డు ప్రత్యేకం. టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడికి ఆరెంజ్ క్యాప్ ఇస్తారు. ఇప్పటికే ఈ రేసులో చాలా మంది ఉన్నారు. టోర్నీ ముగిసే సరికి పోటీ అమాంతం పెరుగుతుంది. మరి ఇంత పోటీ ఉండే అవార్డును వరుసగా రెండు సీజన్లలో గెలుచుకోవడం అంటే సాధారణ విషయమా? అవును ఐపిఎల్ చరిత్రలో ఏకైక ప్లేయర్ ఈ ఘనత దక్కింది. ఐపిఎల్ హిస్టరీలో వరుసగా రెండు సీజన్లు ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్న రికార్డ్ వెస్టిండీస్ స్టార్ క్రిస్ గేల్ పేరిట ఉంది. గేల్ వరుసగా రెండు సంవత్సరాలు 2011, 2012లో ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్నాడు. 2011లో ఆర్సీబీ తరఫున 608 రన్స్ కొట్టాడు. ఈ సీజన్‌లో బెంగళూరు ఫైనల్ చేరడంలో కీలక పాత్ర పోషించాడు. కానీ, చెన్నై చేతిలో ఫైనల్‌ఓడిపోయింది. 2012 ఆర్సీబీలో గేల్ 733 పరుగులు చేశాడు. దురదృష్టవశాత్తు ఈ సారి బెంగళూరు ప్లేఆఫ్స్‌కి కూడా చేరలేదు. 2008లో ఐపిఎల్ ప్రారంభమైనప్పటి నుంచి ఆరెంజ్ క్యాప్ ఉంది. మొదటి విజేత ఆస్ట్రేలియాకు చెందిన షాన్ మార్ష్. కింగ్స్ఎలెవన్ పంజాబ్ తరఫున 616 పరుగులు చేశాడు. ఇక కోహ్లికి 2016 సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగుళూరు తరఫున 973 పరుగులు చేశాడు. అందులో నాలుగు సెంచరీలు ఉన్నాయి. ఇవే ఇప్పటికీ ఒక సీజన్‌లో సాధించిన అత్యధిక పరుగులు కావడం గమనార్హం. 2024లో కూడా విరాట్ కోహ్లీ 741 పరుగులతో ఆరెంజ్ క్యాప్ సాధించాడు. అలాగే డేవిడ్ వార్నర్ అత్యధిక సార్లు ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్నాడు. 2015, 2017 2019లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరఫున అత్యధిక పరుగులు చేశాడు. ఒకే సంవత్సరంలో ఆరెంజ్ క్యాప్, ఐపిఎల్ ట్రోఫీని ఇద్దరు ఆటగాళ్లు మాత్రమే గెలుచుకున్నారు. 2014లో కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున రాబిన్ ఉతప్ప, 2021లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున రుతురాజ్ గైక్వాడ్ ఈ అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు.


దివ్య


వైశాలి


హంపీ

# దివ్య విజయంతో శుభారంభం

## హంపీ, వైశాలి డ్రా.. హారిక ఓటమి

**న్యూఢిల్లీ:** ఫిడే మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ ఐదో అంచె చెస్ టోర్నమెంట్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ఈ సిరీస్‌లో భాగంగా తొలి రోజు నలుగురు భారత్ క్రీడాకారిణులు పాల్గొనగా, ప్రపంచ జూనియర్ ఛాంపియన్ దివ్య విజయంతో శుభారంభం చేసింది. ఇక భారత్ గ్రాండ్ మాస్టర్లు కోనేరు హంపి, వైశాలి తమ గేమ్‌లను డ్రా చేసుకోగా, ద్రోణవల్లి హారిక పరాజయం చవిచూసింది. పుణేలో జరిగిన తొలి రౌండ్ గేముల్లో భారత్‌కే చెందిన గ్రాండ్ మాస్టర్ వైశాలితో నల్ల పావులతో ఆడిన ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్ హంపి 53 ఎత్తుల్లో డ్రా చేసుకుంది. చైనా గ్రాండ్ మాస్టర్ జూ జినెర్ 53 ఎత్తుల్లో హారికపై గెలుపొందింది. బల్గేరియాకు చెందిన నుర్గుల్ సలీమోవాతో జరిగిన గేమ్‌లో నల్లపావులతో పోటీపడ్డ దివ్య దేశ్‌ముఖ్ 53 ఎత్తుల్లో నెగ్గడం విశేషం. భారత్ ప్లేయర్ల గేమ్‌లన్నీ 53 ఎత్తుల్లోనే ముగియడం గమనార్హం. ఇతర తొలి రౌండ్ గేముల్లో బత్ఖుయాగ్ మున్‌గున్‌తుల్ 85 ఎత్తుల్లో జార్జియాకు చెందిన మెలియా సలోమీపైన, రష్యాకు చెందిఇన పొలీనా షువలోవా 57 ఎత్తుల్లో పోలాండ్‌కు చెందిన అలీనా కష్లిన్‌స్కాయపై గెలుపొందారు. మొత్తం 10 మంది ప్లేయర్ల మధ్య తొమ్మిది రౌండ్‌ల పాటు ఈ టోర్నీ జరగనుంది.


# ప్లేయర్ ఆఫ్ ద మంత్‌గా శ్రేయస్




**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసిసి) మెన్స్ ప్లేయర్ ఆఫ్ ద మంత్ అవార్డును ఇండియన్ స్టయిలిష్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ గెలుచుకున్నాడు. మార్చి నెలకు గాను ఈ ప్రతిష్టాత్మక పురుస్కారాన్ని అందుకున్నాడు. న్యూజిలాండ్‌కు చెందిన జాకబ్ డఫీ, రచిన్ రవీంద్ర నుంచి పోటీ వచ్చినా, ఆ రేసులో అయ్యర్ టాప్‌లో నిలిచాడు. ఇటీవల జరిగిన చాంపియన్స్ ట్రోఫీలో ఇండియన్ బ్యాటర్ అత్యధికంగా 243 రన్స్ స్కోర్ చేశాడు. భారత జట్టు గెలుపుతో అతను కీలక పాత్ర పోషించాడు. అయితే వరుసగా ఇద్దరు ఇండియన్లకు ఈ అవార్డు దక్కింది. ఫిబ్రవరి నెలలో శుభమన్ గిల్ ఐసిసి మెన్స్ ప్లేయర్ ఆఫ్ ద మంత్ అవార్డు వశం చేసుకున్నాడు. మిడల్ ఆర్డర్‌లో అయ్యర్ ఇటీవల కీలక ఇన్నింగ్స్‌లు ఆడాడు. అద్భుతమైన స్ట్రోక్ ప్లే ప్రదర్శించాడు. కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. జట్టు ట్రోఫీ గెలవడంతో కీలకంగా వ్యవహించాడు. మొత్తంగా మార్చిలో ఆడిన మూడు వన్డేల్లో అతను 57 సగటుతో 172 రన్స్ చేశాడు. గ్రూపు ఏ మ్యాచ్‌లో కివీస్‌పై 79 రన్స్, ఆ తర్వాత సెమీస్‌లో ఆస్ట్రేలియాపై 45 రన్స్, ఇక ఫైనల్లో 48 రన్స్ చేశాడు. దీనిపై స్పందిస్తూ మార్చి నెలకు ఐసిసి అవార్డు దక్కడం సంతోషంగా ఉందని అయ్యర్ తెలిపాడు. ఈ గౌరవం తనకు ఎంతో ప్రత్యేకమైందన్నారు. ఐసిసి చాంపియన్స్ ట్రోఫీ గెలిచిన నెలలోనే ఆ అవార్డు రావడంతో నిజంగా ఆ జ్ఞాపకాలను మరిచిపోలేమన్నారు.

# వరల్డ్ కప్ ఆర్చరీలో..

# ధీరజ్‌కు కాంస్యం




**న్యూఢిల్లీ:** ఆర్చరీ-2025 సీజన్ తొలి టోర్నమెంట్‌లో భారత్ క్రీడాకారులు తమ సత్తాను చాటారు. అమెరికాలోని సెంట్రల్ ఫ్లోరిడాలో ముగిసిన ప్రపంచ కప్ స్టేజ్-1 టోర్నమెంట్‌లో భారత్ నాలుగు పతకాలు గెల్చుకుంది. చివరి రోజు పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో భారత్ నవంబర్ వన్ బొమ్మదేవర ధీరజ్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. కాంస్య పతక మ్యాచ్‌లో 23 ఏళ్ల ధీరజ్ 6-4 (28-28, 28-29, 29-29, 29-28, 30-29) సెట్ పాయింట్లతో స్పెయిన్‌కు చెందిన అండ్రెస్ టెమినో మెడీల్‌పై విజయం సాధించాడు. అంతకు ముందు సెమీ ఫైనల్లో ధీరజ్ 1-7 (27-28, 28-30, 29-29, 26-30) సెట్ పాయింట్లతో జర్మనీకి చెందిన ఫ్లోరియన్ ఉన్‌రా చేతిలో ఓడిపోయి కాంస్య పతక పోరుకు అర్హత సాధించాడు. ఇక క్వాలిఫయింగ్‌లో 666 పాయింట్లు స్కోరు చేసి ఆరో స్థానంలో నిలిచిన ధీరజ్ బెర్ముడాకు చెందిన కెమిరిన్ పికెరింగ్, రెండో రౌండ్‌లో 7-1తో మెక్సికోకు చెందిన కార్లోస్ రొజాస్, మూడో రౌండ్‌లో 7-3తో భారత్‌కే చెందిన అతాను దాస్‌పై గెలుపొందాడు. అలాగే క్వార్టర్ ఫైనల్లో 6-4తో ఫ్రాన్స్‌కు చెందిన థామస్ చిరాల్ట్‌పై విజయం సాధించాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 11వ స్థానంలో ఉన్న ధీరజ్ ఇండియన్ ఆర్మీలో సుబేదార్‌గా పనిచేస్తున్నాడు. ఇక ఇదే టోర్నీలో ధీరజ్ రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో అతాను దాస్, తరుణ్‌దీప్ రాయ్‌లతో కలిసి భారత్‌కు రజత పతకాన్ని అందించాడు. అలాగే ఇదే టోర్నీలో భారత్‌కు చెందిన వెన్నం జ్యోతి సురేఖ సహచరుడు రిషభ్ యాదవ్‌తో కలిసి కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత్‌కు స్వర్ణ పతకాన్ని అందించింది. అభిషేక్ వర్మ, రిషబ్‌యాదవ్, ఓజస్ ప్రవీణ్‌లతో కూడిన భారత్ పురుషుల జట్టు కాంపౌండ్ టీమ్ విభాగంలో కాస్య పతకాన్ని దక్కించుకుంది.

## మహిళల వరల్డ్ కప్ క్వాలిఫయింగ్‌లో..

# పాక్ చేతిలో వెస్టిండీస్ చిత్తు



**న్యూఢిల్లీ:** ఐసిసి మహిళల వన్డే వరల్డ్ కప్ క్వాలిఫయర్ పోటీల్లో పాకిస్థాన్ వరుస విజయాలతో దూసుకుపోతోంది. ఈ టోర్నీలో పాక్ హ్యాట్రిక్ విజయాలు సాధిస్తోంది. తాజాగా జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై పాకిస్థాన్ 65 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ 49.5 ఓవర్లలో 191 పరుగులకు ఆలౌట్ అయింది. విండీస్ బౌలర్లలో అఫ్ ఫ్లెచర్, హేలీ మాథ్యూస్, కరిష్మ, రామ్హరాక్ తలో రెండు వికెట్లు తీయగా, అష్మిని మునిసర్, అలియా అలెన్ చెరో వికెట్‌ను దక్కించుకున్నారు. పాకిస్థాన్ బ్యాటర్లలో సిద్రా అమీన్ 54 పరుగులతో హాఫ్ సెంచరీ చేసి రాణించగా, మునీబా అలీ 33 పరుగులు, సిద్రానవాజ్ 23 పరుగులు, అలియా రియాజ్ 20 పరుగులు, ఒమైమా సోహైల్ 16 పరుగులు, ఫాతిమా సనా 15 రెండంకెల స్కోర్లు చేశారు.. అనంతరం స్వల్ప లక్ష్య ఛేదనకు దిగిన విండీస్ ఫాతిమా సనా (7-0-16-3), రమీన్ షమీమ్ (8.2-1-26-2), నష్రా సంధు (10-0-31-2), సదియా ఇక్బాల్ (8-1-31-1) రెచ్చిపోవడంతో 39.2 ఓవర్లలో 126 పరుగులకే కుప్పకూలింది.

# 'బోయింగ్' డెలివరీలు తీసుకోవద్దు: చైనా

**వాషింగ్టన్, ఏప్రిల్ 15:** అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం రోజు రోజుకు తీవ్రమవుతోంది. ఇప్పటికే బీజింగ్ అరుదైన ఖనిజాలు, మాగ్నెట్ల ఎగుమతులను నిలిపివేసి వాషింగ్టన్‌ను దెబ్బకొట్టగా, తాజాగా మరో షాక్ ఇచ్చింది. అమెరికా వైమానిక రంగ దిగ్గజమైన బోయింగ్ నుంచి ఎటువంటి డెలివరీలు స్వీకరించవద్దని స్వదేశీ విమానయాన సంస్థలను ఆదేశించింది. ఈ విషయాన్ని బ్లూమ్‌బెర్గ్ కథనంలో వెల్లడించింది. అదే సమయంలో వైమానిక రంగంలో వినియోగించే విడిభాగాలను అమెరికా నుంచి కొనుగోళ్లు చేయవద్దని సూచించింది. అమెరికా వస్తువులపై 125 సుంకాలను విధిస్తూ ఇటీవల ఓ ప్రకటన చేసింది. ఈ నేపథ్యంలో ఆ దేశం నుంచి విమానాల విడి భాగాలను దిగుమతి చేసుకోవద్దని పలు సంస్థలకు సూచించింది. ఈ నిర్ణయంతో బోయింగ్ విమానాల నిర్వహణ కూడా చైనా సంస్థలకు భారంగా మారనుంది. అదే సమయంలో ఇప్పటికే బోయింగ్ నుంచి విమానాలను లీజుకు తీసుకొని నిర్వహిస్తున్న సంస్థలను ఆదుకొనే దిశగా చైనా ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. చైనా-అమెరికా వాణిజ్య యుద్ధం దెబ్బకు బోయింగ్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇప్పటికే ఆ సంస్థ గత కొన్నేళ్లుగా తీవ్ర నష్టాల్లో కొనసాగుతోంది. ఆ సంస్థకు చైనా అతిపెద్ద మార్కెట్‌గా నిలిచింది. రానున్న 20 ఏళ్లలో ప్రపంచ విమానాల మార్కెట్‌లో 20శాతం వాటా చైనాదే అన్న అంచనాలున్నాయి. ఒక్క 2018లోనే 25శాతం బోయింగ్ విమానాలను బీజింగ్ సంస్థలు కొనుగోలు చేశాయి. కానీ, వాణిజ్య ఉద్రిక్తతల కారణంగా గత కొన్నేళ్లుగా చైనా నుంచి ఎటువంటి కొత్త ఆర్డర్లు




బోయింగ్‌కు లభించలేదు. అమెరికా-చైనా వస్తువులపై 145 శాతం సుంకం విధించగా, డ్రాగన్ కూడా అంతే వేగంగా దూకుడు ప్రదర్శించింది. అగ్రరాజ్యం వస్తువులపై 125 శాతం సుంకాలు విధించింది. దీంతో రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య జరుగుతోన్న ట్రేడ్ వార్ ఎక్కడివరకు వెళ్తుందోనన్న ఆందోళన నెలకొంది. ట్రంప్ టారిఫ్‌లపై చైనా ప్రతిఘటించడంతో అమెరికాలో ఇతర దేశాల వస్తువులతో పోలిస్తే.. చైనా దిగుమతి వస్తువుల రేట్లు చాలా ఎక్కువగా ఉండనున్నాయి. ప్రతిఘటించని దేశాలకు 90 రోజుల విరామం ఇచ్చిన సంగతి తెలిసిందే.

# 'ఉన్నతాధికారులతో బేరసారాలు'..వదలని పోలీసులు..



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 15:** భారత సిబిఐ అధికారుల కోరిక మేరకు ప్రముఖ వజ్రాల వ్యాపారి మెహుల్ చోక్సీని బెల్జియం పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు. రూ.13,500 కోట్ల పంజాబ్‌నేషనల్‌బ్యాంకు మోసం కేసులో మెహుల్‌పై అభియోగాలున్నాయి. దాంతో అతడిని అప్పగించాలని భారత్ కోరింది. ఈ నేపథ్యంలోనే తనను అరెస్ట్ చేసినట్లు తెలిసింది. చోక్సీని త్వరలోనే భారత్‌కు అప్పగించే అవకాశం ఉంది. చోక్సీ భారత్‌కు రాకుండా ఉండేందుకు గతంలో విశ్వప్రయత్నాలు చేసినట్లు కొన్నిసంస్థలు తెలిపాయి. ఈ మేరకు భారత్‌లోని ఉన్నతాధికారులకు లంచాలు కూడా ఇచ్చినట్లు గతంలో ఆలోపణలున్నాయి. చోక్సీలంచాల భాగోతంపై ప్రముఖరిపోర్టర్ కెన్నెత్ రిజోక్ తన బ్లాగ్‌లో గతంలో ఓ ఆర్టికల్‌ను పోస్ట్ చేశారు. ఆ న్యూస్ ఆర్టికల్‌లో అప్పట్లో కరేబియన్ దేశమైన ఆంటిగ్వాలో ఉంటున్న చోక్సీ భారత్‌కు రాకుండా ఉండేలా ఉన్నతాధికారులకు లంచాలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. తద్వారా ఇక్కడ అతనిని అదుపులోకి తీసుకొని భారత్‌కు అప్పగించేందుకు ప్రయత్నిస్తున్న ఇంటర్ పోల్ ప్రయత్నాలకు స్థానిక అధికారులు అడ్డుపడుతున్నారని చెప్పారు. అంతేకాకుండా న్యాయ విచారణ ఆలస్యంగా జరిగేలా ఆంటిగ్వా ప్రభుత్వ పెద్దలతో పాటు సీనియర్ పోలీస్ అధికారి ఆడోనిస్ హెన్రీ వంటి అధికారులకు లంచాలు ఇవ్వడం ద్వారా తన అప్పగింతను ఆలస్యం చేస్తున్నట్లు తేల్చారు. భారత్‌లో బ్యాంకుల్ని కొల్లగొట్టిన చోక్సీ ఆంటిగ్వాలో పెద్దఎత్తున రెస్టారెంట్ వ్యాపారం చేస్తున్నట్లు తెలిపారు. ఆయనకు సొంతమైన జోలీ హార్బర్ రెస్టారెంట్‌లో పోలీసు ఉన్నతాధికారి హెన్రీని పలు మార్లు కలిసినట్లు తన వద్ద ఆధారాలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఛీక్సీ హెన్రీని కలవడం మాత్రమే కాదని, లంచం ఇచ్చి న్యాయ విచారణ ఆలస్యంగా జరిగేలా మేజిస్ట్రేట్ కాన్లిఫ్ క్లార్క్‌ని సైతం ప్రభావితం చేశారని హైలెట్ చేశారు. క్లార్క్, హెన్రీలు కుట్రపన్ని ఇంటర్ పోల్ అధికారులకు చిక్కకుండా జాగ్రత్త పడుతున్నారని, అందుకు తగిన సాక్ష్యాదారాలు తనవద్ద ఉన్నాయని గతంలో సంచలన వ్యాఖ్యలు చేశారు.

# భారీ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు


**ముంబై, ఏప్రిల్ 15:** వివిధ దేశాలపై విధించిన ప్రతీకార సుంకాలను తాత్కాలి కంగా వాయిదా వేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఎలక్ట్రానిక్ ఉత్పత్తులను ఆ సుంకాల జాబితా నుంచి తొలగిస్తూ చేసిన ప్రకటన మార్కెట్లలో కొత్త ఉత్సాహం నింపింది. అంతర్జాతీయ మార్కెట్లతో పాటు మన మార్కెట్లూ లాభపడ్డాయి. సెన్సెక్స్ 1500 పాయింట్లకు పైగా లాభపడగా, నిఫ్టీ 500 పాయింట్లు పైకెగసింది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ ఒక్క రోజులో రూ.8.7లక్షల కోట్లు పెరిగి రూ.410.24 లక్షల కోట్లకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్ల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 76,852.06 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 76,907.63 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచి, చివరికి 1577.63 పాయింట్ల లాభంతో 76,734.89 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 500 పాయింట్లు లాభపడి 23,328.55 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.77గా ఉంది. హిందుస్థాన్ యూనిలీవర్, ఐటీసీ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ లాభపడ్డాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, టాటా మోటార్స్, ఎల్అండ్‌టీ, యాక్సిస్ బ్యాంక్, అదానీ పోర్ట్స్ షేర్లు ప్రధానంగా లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 64 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3,242 డాలర్ల వద్ద కొనసాగుతోంది. స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ ఉత్పత్తులను ప్రతీకార సుంకాల నుంచి మినహాయిస్తూ అమెరికా తీసుకున్న నిర్ణయం మార్కెట్లో కొనుగోళ్ల మద్దతుకు కారణమైంది. హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు నేడు 3 శాతం మేర రాణించాయి. సెన్సెక్స్ 1577 రాణించడంలో ఈ రెండు బ్యాంకులే దాదాపు 638 పాయింట్ల మేర దోహదపడ్డాయి. ఆటో సెక్టార్‌కు కూడా టారిఫ్‌ల నుంచి మినహాయింపు లభిస్తుందన్న అంచనాలతో నిఫ్టీ ఆటో ఇండెక్స్ మంగళవారం 3 శాతం మేర లాభపడింది. సంవర్ధనా మదర్‌సన్స్, భారత్ ఫోర్జ్, టాటా మోటార్స్ షేర్లు రాణించాయి. అమెరికా మార్కెట్లతో పాటు నేడు ఆసియా మార్కెట్లు రాణించడమూ మన మార్కెట్లపై సానుకూల ప్రభావం చూపింది. జపాన్, హాంకాంగ్, షాంఘై మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. అమెరికా డాలర్ ఇండెక్స్ బలహీన పడడం మనలాంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్లకు కలిసొస్తోందని నిపుణులు చెబుతున్నారు. విదేశీ పెట్టుబడులు తరలిరావడం వల్ల రూపాయి మీద కూడా ఒత్తిడి తగ్గుతుంది.



# వాణిజ్యం


# టిసిఎస్ ఉద్యోగులకు ప్రమోషన్లు

**ముంబై, ఏప్రిల్ 15:** మన దేశంలోనే అతిపెద్ద ఐటీ కంపెనీ.. టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) గత ఆర్థిక సంవత్సరంలో 1.10 లక్షల మంది నిపుణులకు పదోన్నతులు (ప్రమోషన్లు) కల్పించింది. వృద్ధిని సమర్థవంతంగా నిర్వహించడానికి, ఉద్యోగుల వలసలను నిరోధించడానికి ఈ చర్య తీసుకుంది. వార్షిక వేతన పెంపు వాయిదా పడినప్పటికీ, కంపెనీ ఉద్యోగుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తోందని దీనిని బట్టి తెలుస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా గత సంవత్సరం మాదిరిగానే 42,000మంది ఫ్రెషర్స్‌ను నియమించుకోవాలని టీసీఎస్ యోచిస్తోంది. పదోన్నతులు, పనితీరు ఆధారిత ప్రోత్సాహకాల వల్ల కంపెనీ ఆర్థిక గణాంకాలపై దాదాపు 1 శాతం ప్రభావం పడిందని సీఎఫ్ఓ సమీర్ వెల్లడించారు. గతేడాది డిజిటల్ నైపుణ్యాలు కలిగిన వారిని టీసీఎస్ ఎక్కువగా నియమించుకుంది. మొత్తం నియామకాల్లో ఈ విభాగం వాటా 40 శాతానికి పెరిగింది. అంతకుముందు ఏడాది చూస్తే ఇది కేవలం 17 శాతంగా ఉంది. ప్రారంభ స్థాయి ఉద్యోగుల కోసం టీసీఎస్ నేషనల్ క్వాలిఫైయర్ టెస్ట్‌ను నిర్వహిస్తోంది. ఇందులో చూపిన ప్రతిభ ఆధారంగా వారిని ప్రైమ్, డిజిటల్, నింజా వంటి వివిధ విభాగాల్లో నియమిస్తోంది. సంఖ్య 6,07,979కి చేరుకుంది. పూర్తి ఆర్థిక సంవత్సరంలో నికరంగా 6,433 మంది ఉద్యోగులు పెరిగారు. వేతన పెంపు వాయిదా పడినప్పటికీ, కంపెనీ వేరియబుల్ పే చెల్లింపులను కొనసాగిస్తోంది. నాల్గవ త్రైమాసికంలో 70 శాతం మంది ఉద్యోగులకు పూర్తి వేరియబుల్ పే చెల్లించగా, మిగిలిన వారికి వారి పనితీరు ఆధారంగా చెల్లింపులు ఉంటాయని స్పష్టం చేసింది. ఇక ఇటీవల డొనాల్డ్ ట్రంప్ సుంకాల నేపథ్యంలో తీవ్ర ఒడుదొడుకులకు లోనైన టీసీఎస్ స్టాక్ ఇప్పుడు పుంజుకుంటోంది. మంగళవారం ఇంట్రాడేలో దాదాపు 3 శాతం లాభంతో రూ.3314.40వద్ద గరిష్టాన్ని తాకినా మళ్లీ వెనక్కి తగ్గింది.




# లేఆఫ్స్‌పై డా.రెడ్డీస్ క్లారిటీ

**ముంబై, ఏప్రిల్ 15:** ప్రముఖ ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్, 25శాతం ఉద్యోగులను తగ్గించుకునే అవకాశం ఉందనే వార్తలపై తాజాగా సంస్థ అధికారికంగా స్పందించింది. ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ ఇలా వస్తున్న వార్తలను ఖండించింది. ఇది అవాస్తవమని స్పష్టం చేసింది. అలాంటి చర్యలేమీ తీసుకోలేదని వివరించింది. ఖర్చులను తగ్గించుకోవడంలో భాగంగానే కంపెనీ లేఆఫ్స్ కార్యక్రమాన్ని చేపట్టనుందని ఇటీవల వార్తలొచ్చాయి. కంపెనీలోని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగంలో పనిచేస్తున్న 50 నుంచి 55 సంవత్సరాల వయసున్న ఉద్యోగులకు స్వచ్ఛంద పదవీ విరమణ ఆఫర్ చేసినట్లు పుకార్లు వచ్చాయి. అంతేకాకుండా వివిధ విభాగాల్లో యేడాదికి కోటి రూపాయల జీతం పొందుతున్న అనేక మంది ఉద్యోగులను రాజీనామా చేయాలని సంస్థ ఇప్పటికే కోరినట్లు ఆయా వార్తల్లో తెలిపారు. జాతీయ మీడియా సంస్థలతో సహా చాలా ప్రాంతీయ సంస్థలు ఈ మేరకు కథనాలు ప్రచురించాయి. దీనిపై కంపెనీ తాజాగా ప్రకటన విడుదల చేసింది. సంస్థలో సిబ్బంది తగ్గింపు వార్తలు అవాస్తవమని స్పష్టం చేసింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.